# సృష్టికర్త ఉద్దేశ్యం?

By:Dr.A.B.Philips

www.islamhouse.com

الهدف من الخلق
بـلغة التلغو



# సృష్టికర్త ఉద్దేశ్యం?

రచయిత: డాక్టర్. ఎ.బి. ఫిలిప్స్

అనువాదం: ముహమ్మద్ కరీముల్లాహ్

## الهدف من الخلق

بلغة التلغو

Copyright © 1429 H., 2008 CE

This book is copyrighted. Any or all parts of this book may be used in any means as long as the information used is not in any way quoted out of context

We would like to express our sincere appreciation to those who contributed for the publication of this book. May Allah reward them for their efforts. If you have any corrections, comments, questions about this publication, please feel free to contact us at:

ఈ పుస్తకం కాపీ రైట్ చేయబడినది. ఈ పుస్తకంలోని ఏ భాగమైనా లేదా మొత్తం భాగాలను, దీనిలోని విషయాలు అసంపూర్తిగా, సరైన భావం ఇవ్వని విధంగా, అసలు విషయాన్ని దాచే విధంగా కాకుండా ఎలాగైనా ఉపయోగించుకో వచ్చును.

ఈ పుస్తక ప్రచురణలో సహాయసహకారాలు అందించిన వారందరికీ మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. ముఖ్యంగా పునర్విమర్శలో పాల్గొన్న దివ్యఖుర్ఆన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి కృషిని, సేవలను అల్లాహ్ స్వీకరించి, వారికి అనేక పుణ్యాలు ప్రసాదించు గాక! మీ వద్ద ఏమైనా సలహాలు గాని, దిద్దుబాట్లు గాని, సూచనలు గాని, ప్రశ్నలు గాని ఉంటే, వెంటనే క్రింది ఈమెయిల్ ద్వారా మమ్మల్ని నిస్సంకోచంగా సంప్రదించగలరు.
**telugu@islamhouse.com**

1429 H
[1784]

Published by:

The Islamic Propagation Office in Rabwah
Tel. +4454900 □ 4916065 Ext. 301
Email: telugu@islamhouse.com
**www.islamhouse.com** తెలుగు విభాగం

# విషయసూచిక


| | |
|---|---|
| పరిచయం | 04 |
| సృష్టికర్త ఎందుకు సృష్టించాడు? | 17 |
| సృష్టికర్త మానవజాతిని ఎందుకు సృష్టించాడు? | 31 |
| సృష్టికర్త మానవజాతిని భూమిపైనే ఎందుకు సృష్టించాడు? | 53 |
| సృష్టికర్త విశ్వజగత్తును ఎందుకు సృష్టించాడు? | 72 |
| ముగింపు | 80 |
| Bibliography | 83 |

# పరిచయం

సృష్టి యొక్క ఉద్దేశ్యం ఏమిటి? అనే చిక్కు ప్రశ్న ప్రతి మానవుడికి తన జీవితంలో ఎక్కడో ఒక చోట ఎదురవుతుంది. ఏదో ఒక సందర్భంలో ప్రతి మానవుడు "నేనెందుకు జీవిస్తున్నాను?", "దేనికోసం నేను ఈ భూమి పై ఉన్నాను?" అని స్వయంగా తనను తాను ప్రశ్నించుకోవటం కూడా జరుగుతుంది. కాని సమాధానం కనుక్కోవటానికి మనం ఎప్పుడైనా ప్రయత్నించామా? నిజాయితీగా చూస్తే, ఆ ఆలోచనే ఇంత వరకు రాని వాళ్ళు అధికంగా ఉన్నారు. ఈ పుస్తకం ద్వారా ఆ అవకాశం వారికి లభించబోతున్నది.

మానవుల్ని మరియు వారు జీవిస్తున్న భూప్రపంచాన్ని అత్యంత జటిలమైన బృహత్తర విశ్వవ్యవస్థతో పోల్చినట్లైతే, ఈ విశాల భూమండలం మొత్తం అణువంతైనా లేని అతి చిన్న సూక్ష్మభాగం మాత్రమేనని తెలుస్తుంది. ఇంకా సృష్టిలోని వైవిధ్యం, క్లిష్టత్వం ద్వారా మన ఊహలకందని, మహాద్భుతమైన శక్తిసామర్ధ్యాలు మరియు పరిపాలనా దక్షత గల సర్వలోక సృష్టికర్త ఒకడు ఖచ్చితంగా ఉన్నాడనే స్పష్టమైన సూచన కనబడుతుంది.

అద్భుతమైన ఒక కళాఖండం, మహాద్భుతంగా డిజైను చేసిన దాని రూపకల్పకుడి నైపుణ్యం వైపునకు మన ఆలోచనలను తీసుకుపోతుంది. ఎప్పుడైతే మానవులకు సముద్రపు ఒడ్డున, బీచ్ లో మనిషి పాదాల గుర్తులు కనబడతాయో, ఎవరో ఒకతను కొద్దిసేపు క్రితమే అక్కడి నుండి నడిచి వెళ్ళినట్లుగా వారు ఊహిస్తారు. అంతే తప్ప ఆ ఇసుకలో సముద్రపు అలలు నిలిచిపోయి, ఎలాగోలా మనిషి పాదాలనే పోలిన గుర్తుల్ని వేశాయని ఎవరూ అనుకోరు. ఇంకా ఎటువంటి ప్రయోజనం లేకుండానే ఆ పాదచిహ్నాలు ఉనికిలోనికి తీసుకు రాబడినాయని మానవులు అంగీకరించరు. అలాగే ప్రయోజనకరమైన

చర్య అనేది మానవ తెలివితేటల స్వాభావిక ఫలితమవటం వలన ఏదో ఒక ప్రత్యేక ఉద్దేశ్యంతోనే సంపూర్ణ జ్ఞానవంతుడైన సృష్టికర్త తమను సృష్టించాడని మానవులు భావిస్తారు. కాబట్టి ఈ తాత్కాలిక జీవితాన్ని మరణం తర్వాత కూడా శాశ్వతంగా పనికి వచ్చే విధంగా సరైన మరియు స్వచ్ఛమైన పద్ధతిలో జీవించటం కోసం, మానవులు తమ ఉనికి వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రతి యుగంలోను సృష్టికర్త ఉనికినే తిరస్కరించేవారు, అతి తక్కువ సంఖ్యలోనైనా సరే తప్పక ఉంటారు. 'జడపదార్థమనేది' శాశ్వతమైనదనీ, యాధృచ్ఛికంగా దాని మూలకాలు కలవటం వలననే మానవజాతి ఉనికిలోనికి వచ్చిందని వారి అభిప్రాయం. కాని "సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించాడు?" అనే ప్రశ్నకు వారి దగ్గర నేటికీ సమాధానం లేదు. అసలు ఎలాంటి కారణం లేకుండానే సృష్టి ఉనికిలో వచ్చిందనేదే వారి వాదన. ఇంకోవైపు ప్రతి కాలంలోను, "విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త ఒకడున్నాడని, ఒక ప్రత్యేక ఉద్దేశ్యంతోనే అతడు సర్వలోకాలను సృష్టించాడని" గాఢంగా నమ్మే ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. సృష్టికర్త గురించి పరిశోధించటం మరియు ఆయన ఏ ఉద్దేశ్యంతో మానవులను సృష్టించాడనే విషయం గురించి పరిశోధించటం వారి దృష్టిలో అత్యంత ముఖ్యమైన పని.

## సమాధానం

"సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించాడు?" అనే ప్రశ్నకు జవాబిచ్చే ముందు, వారు ఏ ఉద్దేశ్యంతో ఈ ప్రశ్న అడుగుతున్నారో తప్పక తెలుసుకోవాలి. సృష్టికర్త వైపు నుండి గనుక ఆలోచిస్తే "సృష్టికర్త ఏ కారణం వలన మానవులను సృష్టించ వలసి వచ్చింది?" అనే ప్రశ్నా మరియు మానవుల వైపు నుండి ఆలోచిస్తే "సృష్టికర్త మానవుడిని ఏ ఉద్దేశ్యంతో సృష్టించాడు?" అనే ప్రశ్నా ముందుకు వస్తాయి. "నేను ఎందుకు జీవించి ఉన్నాను?" అనే మరో ఆసక్తికరమైన ప్రశ్నకు పై రెండు

ప్రశ్నలు ప్రాతినిధ్యం వహిస్తాయి. రాబోయే పేజీలలో పై ప్రశ్న యొక్క రెండు దృక్పధాలపై విపులంగా, క్రమపద్ధతిలో దైవవాణి ఆధారంగా చర్చ జరుగును. ఇది మానవ ఊహలకు అందని విషయం. వాస్తవానికి మానవుల పరిమిత ఆలోచనా విధానానికి ఈ ప్రశ్నలోని నిగూఢమైన నిజానిజాల వరకు చేరుకునే సామర్థ్యం లేదు. మానవులు అతి కష్టం మీద తమ మెదడును మరియు దాని క్లిష్టత్వాన్ని, మనస్సును మరియు దాని మహాద్భుత మహిమలను కొంతవరకు మాత్రమే గ్రహించ గలిగారు. మరి అటువంటి పరిస్థితులలో వారు తమ ఉనికి యొక్క పుట్టుపూర్వోత్తరాల నిజానిజాలను తమకున్న పరిమిత జ్ఞానంతో, మేధాసంపత్తితో, తెలివితేటలతో ఎలా కనిపెట్టగలరు? దీని కారణంగా యుగయుగాలుగా ఈ ప్రశ్న పై పరిశోధించిన తత్వవేత్తలు కనీసం ఒక్కసారి కూడా ఏకాభిప్రాయానికి చేరుకోలేక పోయారు. లెక్కించలేనన్ని జవాబులను వారు ఊహించారు, సూత్రీకరించారు. కానీ వాటిలో ఏ ఒక్కటీ ఇంత వరకు ఋజువు చేయబడలేదు. సృష్టి గురించిన రకరకాల ప్రశ్నలు అనేక మంది తత్వవేత్తలను - "మానవజాతి అసలు ఉనికిలోనే లేదని, ఈ మొత్తం ప్రపంచం కేవలం ఒక భ్రమ మాత్రమేననే" పిచ్చివాదనల వైపుకు తప్పుదోవ పట్టించాయి. ఉదాహరణకు గ్రీకు దేశపు సుప్రసిద్ధ తత్వవేత్త ప్లాటో (క్రీ.పూ. 428 - 348) ఇలా వాదించాడు -"ప్రతిరోజు అనేక మార్పులకు గురౌతున్న మరియు మానవుడు తన స్పర్శల ద్వారా గ్రహిస్తున్న ఈ ప్రపంచం అసలు వాస్తవమైనదే కాదు, కాని ఇది ఒక నీడ లాంటి ప్రతిబింబం". (ఇది 'ది రిపబ్లిక్ (The Republic)' అనే అతడి పుస్తకంలో వ్రాయబడినది. అందులోని సుప్రసిద్ధ గుహ యొక్క మెటాఫోర్ (అంటే ఏదైనా ఒక వస్తువుకు పదంతో వర్ణించని పేరును వర్తింపచేయటం) వివరణలో మారుతున్న భౌతిక ప్రపంచాన్ని గుహ గోడలపై పడే రాతి విగ్రహాల నీడలతో పోల్చినాడు.) (*The New Encyclopaedia Britannica*, vol. 25. p. 552).

ఇంకా అనేక మంది ఇతర తత్వవేత్తలు ఇంతకు ముందు తెలిపినట్లుగా మానవుల సృష్టికి అసలు ఎటువంటి ఉద్దేశ్యమే లేదని వాదించారు, ఇంకా వాదిస్తున్నారు కూడా. వారి అభిప్రాయం ప్రకారం

మానవుల ఉనికి కేవలం ఒక యాధృచ్ఛిక సంఘటన మాత్రమే. ఒకవేళ జీవితం చైతన్యం (జీవం) లేని పదార్థం నుండి గనుక క్రమంగా మార్పులు చెంది ఏర్పడినట్లయితే దానికొక ఉద్దేశ్యమే ఉండక పోయేది. అది కేవలం అదృష్టం వలననే సజీవమై ఉండేది. అలాగే (మరి కొందరు తత్వవేత్తల అభిప్రాయం ఆధారంగా) మన కజిన్స్ అనబడే కోతులు, గొరిల్లాలు, చింపాంజీలే తమ ఉనికికి సంబంధించిన ప్రశ్నలను పట్టించుకోనప్పుడు, మానవుడు వాటిని ఎందుకు పట్టించుకోవాలి?

అనేక మంది 'తమ సృష్టికి కారణం ఏమై ఉంటుంది?' అనే విషయాన్ని గురించి అప్పుడప్పుడు ఆలోచించినప్పటికీ, దానిపై సరైన ఏకాగ్రత చూపరు మరియు సరైన ప్రాధాన్యతా ఇవ్వరు. వేరే పనుల ఒత్తిడి వలన తరచుగా ఆ ఆలోచనల్ని ప్రక్కన పెట్టేస్తారు. అత్యంత క్లిష్టమైన ఈ పరిశోధనకు తగిన మోతాదులో సమయాన్ని కేటాయించ కుండా, ఫలితాన్ని సాధించటం ఎలా సాధ్యం?

సరైన జవాబు తెలియకపోవటం వలన, మానవులు తమ పరిసరాలలోని జంతువుల మాదిరిగా జీవితం గడుపుతున్నారు. అంటే తమకూ, వాటికీ మధ్య ఎలాంటి తేడా కనిపించని విధంగా ప్రవర్తిస్తున్నారు. జంతువుల అవసరాలు మరియు శారీరక కోరికలైన తినడం, త్రాగటం, పిల్లల్ని పుట్టించడం లాంటి మామూలు పనులనే మానవులు తమ జీవితపు అసలైన లక్ష్యాలుగా భావించి, భ్రమపడు తున్నారు. అందువలన మానవ జీవితం తినడం, త్రాగడం, పుట్టించడం వంటి పరిమిత పనుల పైనే కేంద్రీకృతమై పోయినది. నిర్ణీత కాలపు భౌతిక శారీరక సుఖసంతోషాలే జీవితపు పరమలక్ష్యాలుగా మారి పోవటం వలన, మానవ జీవితం పశువుల కంటే హీనమైన స్థితికి దిగజారి పోతున్నది. మానవులకు తమ జీవితపు అసలు ఉద్దేశ్యమే తెలియక పోవటం వలన, సృష్టికర్త ప్రసాదించిన అమూల్యమైన తెలివితేటలను తరచుగా అనవసరమైన తప్పుడు వ్యవహారాలలో ఉపయోగిస్తూ, వృధా

చేస్తున్నారు. దిగజారిపోయిన తమ మెదడు యొక్క ఆలోచనా శక్తిని డ్రగ్స్, బాంబుల తయారీ మొదలైన అరాచక చర్యలలో వాడుతున్నారు. ఇంకా వ్యభిచారం, హోమోసెక్సు (స్వలింగ సంపర్కం), అశ్లీలమైన ఫోటోలు / సాహిత్యం, జాతకం-చిలకజ్యోతిష్యం-సోదె మొదలైనవి చెప్పటం, ఆత్మహత్యకు పూనుకోవడం వంటి సంఘ వ్యతిరేక పనులలో లీనమై పోతున్నారు. ప్రపంచ జీవితపు అసలు ఉద్దేశ్యం తెలీకపోవటం వలన మానవులు తమ ఉనికినే అర్థం చేసుకో లేకపోతున్నారు. ఫలితంగా మరలిరాని ఈ జీవితపు అమూల్యమైన కాలాన్ని అప్రయోజనకరమైన పనులలో వృధా చేసుకుంటున్నారు. వాటిలో లభిస్తున్న తాత్కాలిక విజయాలకే సంతోష పడిపోతున్నారు మరియు సంతృప్తి చెందుతున్నారు. ఆ విధంగా భౌతిక జీవితపు పరీక్షా కాలం పూర్తయిన (అంటే మరణం) తర్వాత "తాత్కాలికమైన ప్రాపంచిక సుఖాల కంటే అనేక రెట్లు గొప్పవి మరియు ఎన్నటికీ తరగని సుఖసంతోషాలను, స్వర్గలోకంలో శాశ్వతంగా అనుభవించు" అనే సృష్టికర్త యొక్క ఆశీర్వాదాన్ని పొందే సువర్ణావకాశాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కాబట్టి "మేమిక్కడ ఎందుకు ఉన్నాము?" అనే ప్రశ్నకు సరైన జవాబును వెదకటం ప్రతి ఒక్కరు త్వరగా చేయవలసిన అతి ముఖ్యమైన పని.

పై వాటి జవాబుల కోసం మానవులు తరచుగా తమ తోటి మానవుల వైపునకు మరలుతుంటారు. ఇంకా తమ తెలివితేటల ఆధారం గా తమలో తాము చర్చించుకుంటూ, వృధా ప్రయాసలు చేస్తుంటారు. అయితే వీటికి సరైన, స్పష్టమైన మరియు ఖచ్చితమైన జవాబులు కేవలం దివ్యగ్రంథాలలో మాత్రమే దొరుకుతాయనే నిజాన్ని గ్రహించ లేక పోతున్నారు. స్వయంగా సరైన జవాబు వరకు చేరుకోవటానికి మానవుల తెలివితేటలు సరిపోవు కాబట్టి దైవప్రవక్తల ద్వారా మానవ జీవితపు అసలు ఉద్దేశ్యాన్ని స్పష్ట పరచవలసిన అవసరం సృష్టికర్తకు కలిగినది. దీని కారణంగా, "సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించాడు?" అనే

ప్రశ్నకు సరైన జవాబులను వేర్వేరు యుగాలలో, ప్రపంచ నలుమూలలా పంపబడిన దైవప్రవక్తలు తమ తమ సహచరులకు చాలా స్పష్టంగా బోధించారు.

## యూదుల, క్రైస్తవుల దివ్యగ్రంథాలు

నిజాయితీగా సత్యాన్వేషణ చేస్తున్న వారిని బైబిల్ పఠనం మరింత అయోమయంలో పడవేస్తుంది. మానవసృష్టికి సంబంధించిన అతి ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానం పాతనిబంధనలలో అస్సలు కనబడదు. ధర్మచట్టాలు, ప్రాచీన మానవచరిత్ర మరియు యూదుల గురించిన విషయాలతో అవి నిండి ఉన్నట్లుగా స్పష్టమౌతుంది. (ఈసాయియా (Isaiah) లో దేవుడి గొప్పతనం కోసం ఇస్రాయీలు సంతతిని సృష్టించినట్లు, ....గాని ఇంకోచోట దేవుడు ఇలా చెబుతున్నాడు - "అతడే నిన్ను సృష్టించాడు. ఓ! జాకోబు, అతడే నిన్ను ఏర్పరచినాడు, ఓ! ఇస్రాయీలు....నేను ఉత్తరానికి ఇక చాలించు అని చెబుతాను మరియు దక్షిణాన్ని పట్టుకోవద్దని. నా కొడుకులను దూరం నుండి తీసుకు వచ్చి మరియు నా కుమార్తెలను భూమి చివరి నుండి...ఎవరైతే నా పేరు పిలుస్తారో, ఎవరినైతే నా గొప్పతనం కోసం సృష్టించానో, ఎవరినైతే నేను ఏర్పరచానో, మరియు తయారుచేసానో........") RSV Isaiah 43:1. 6-7

జెనెసిస్ (Genesis) లో దేవుడు విశ్వాన్ని, ఆదం మరియు ఈవ్ లను ఆరు దినాలలో సృష్టించాడు మరియు తన పని నుండి 7వ దినాన విశ్రాంతి తీసుకున్నాడు. (...."మరియు 7వ దినాన దేవుడు తన పని పూర్తి చేసాడు, ఏదైతే తను చేసాడో, మరియు అతడు 7వ దినాన పూర్తి చేసిన తన మొత్తం పని నుండి విశ్రాంతి తీసుకున్నాడు. 'కాబట్టి దేవుడు 7వ దినాన్ని దీవించాడు మరియు ఖాళీగా ఉంచాడు. ఎందుకంటే అప్పుడే దేవుడు సృష్టిలోని తను పూర్తి చేసిన మొత్తం పని నుండి విశ్రాంతి తీసుకున్నాడు." (RSV, Genesis 2:2-3.)

ఆదం మరియు ఈవ్ దేవుడికి అవిధేయత చూపారు మరియు వారి కుమారుడు కైన్ ఇంకో కుమారుడైన అబెల్ ను చంపాడు మరియు నోడ్ అనే ప్రదేశంలో నివసించటానికి వెళ్ళాడు. మరియు దేవుడు

మానవుడిని తయారుచేసి బాధపడినాడు. (..."మరియు భూమిపై మానవుడిని సృష్టించినందుకు దేవుడు బాధ పడినాడు, మరియు అది అతడి హృదయాన్ని బాధ పరచినది ") RSV. Genesis 6:6

బైబిల్ లోని సమాధానములు స్పష్టంగా మరియు సందేహాలకు తావివ్వని విధంగా ఎందుకు లేవు? వాటి వచనాల అర్థాలను పాఠకులు తమ ఇష్టానుసారం ఆలోచించుకునే విధంగా ఎక్కువ శాతం పదాలు సంకేత భాషలో ఎందుకని ఉన్నాయి? ఉదారణకు Genesis 6:6 లో ఇలా తెలుపబడినది, "ఎప్పుడైతే పురుషులు భూమిపై వృద్ధిచెందటం మొదలెట్టారో, మరియు వారికి కుమార్తెలు జన్మించటం మొదలైనది, ఆ పురుషుల కుమార్తెలు అందంగా ఉండటాన్ని దేవుడి కుమారులు చూశారు మరియు వారిలో తమకు నచ్చిన వారిని భార్యలుగా తీసుకున్నారు." ఇక్కడ దేవుడి కుమారులు ఎవరు? దీనికి యూదులలో మరియు వారిని అనుసరించే ఇతర క్రైస్తవ తెగలలో రకరకాల వివరణలు ఉన్నాయి. మరి వాటన్నింటిలో సరైన వివరణ ఏది? నిజానికి మానవ జీవితపు ఉద్దేశాన్ని సృష్టికర్త తన ప్రవక్తల ద్వారా బోధించాడు, కాని ప్రవక్త సహచరులు కొందరు, దుష్టశక్తులతో కుమ్మక్కై, ఆ దైవగ్రంథాలలో తమ ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేశారు. ఫలితంగా అతి ముఖ్యమైన ప్రశ్నలకు దైవం పంపిన స్పష్టమైన జవాబులు, తికమక పెట్టే విధంగా మార్చివేయబడినాయి. ఇంకా దైవవాణిని చాలా వరకు సంకేత పదాలలో దాచివేశారు. యూదులు చేస్తున్న తప్పిదాలను ఎత్తిచూపి, వారికి సరైన మార్గం చూపటానికి సృష్టికర్త ఏసుక్రీస్తును యూదుల వద్దకు పంపెను. పవిత్ర దేవాలయాలలోనే వివిధ రకాల వ్యాపారాలు మొదలు పెట్టిన అక్కడి స్వార్థపరులైన వ్యాపారస్తుల నక్కజిత్తులను ఆ మహాప్రవక్త నిర్వీర్యం చేసివేసెను (లూకా 19:45 RSV). మరియు యూదు పండితులు (రబ్బీస్) తమ ఇష్టానుసారం మార్పులు చేసిన అనుసరిస్తున్న నకిలీ ధర్మ చట్టాలకు వ్యతిరేకంగా సరైన సత్యమార్గాన్ని ఆయన బోధించెను. ఇంకా ఆయన ప్రవక్త మోసెస్ ధర్మచట్టాన్ని ధృవపరచి, మరల

ఆచరణలోనికి తీసుకు వచ్చెను. ఆయన మానవ జీవితపు ఉద్దేశాన్ని తన శిష్యులకు బోధించి, దానిని ఎలా పూర్తి చేయాలో భూప్రపంచం లోని తన చివరి ఘడియ వరకూ స్వయంగా ఆచరించి చూపెను. కాని ఈ ప్రపంచం నుండి నిష్క్రమించగానే 'వారి శిష్యులమే' అని దావా చేసిన కొందరు కపటులు ఆయన బోధనలను కూడా తమ స్వార్థాలకు అనుగుణంగా మార్చి వేశారు. ఆయన బోధించిన స్పష్టమైన సత్యసందేశం కూడా పూర్వ ప్రవక్తల సందేశాల వలే స్వార్థపరులైన కపట పండితుల చేతుల్లో మార్పులు చేర్పులకు గురై, అస్పష్టమైనదిగా మారిపోయినది. కాలక్రమంలో 'భావప్రకటన గాక భావసూచనే ప్రధానమైనది' అనే ప్రతీకవాద పద్ధతి (symbolism) యోహాను యొక్క రివిలేషన్స్ ద్వారా ముఖ్యంగా ప్రవేశ పెట్టబడినది. ఇంకా ప్రవక్త ఏసుక్రీస్తు బోధించిన అసలు గోస్పెల్ మాయమై పోయినది. అసలు గోస్పెల్ కు బదులుగా మానవులు రచించిన ఇంకో నాలుగు గోస్పెల్స్ ను 4వ శతాబ్దపు బిషప్ అథనాసియస్ (Athanasius) ఎన్నుకొనటం జరిగినది. (The New Encyclopedia Britannica, vol. 14, p. 814.)

ఇంకా పాల్ మరియు ఇతరులు వ్రాసిన 23 గ్రంథాలు కూడా క్రొత్త నిబంధనలలో చేర్చబడి, పూర్వపు నాలుగు గోస్పెల్స్ ల సంఖ్యనే మించిపోయెను.(4వ శతాబ్దపు సగభాగంలో కోడెక్స్ శినైటికస్ (Codex Sinaiticus) అనబడే చేతివ్రాతను, బర్నాబాస్ ఉత్తరాన్ని, హెర్నియాస్ గొర్రెలకాపరి ఉత్తరాన్ని కూడా క్రొత్త నిబంధనలలోని ఒక భాగంగా చేర్చబడెను.) (The New Encyclopedia Britannica, vol. 14. p. 814.)

కాబట్టి క్రొత్తనిబంధన పాఠకులు "సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించెను?" అనే ప్రశ్నకు సరైన సమాధానం కనిపెట్ట లేకపోతున్నారు. (కింగ్ జేమ్స్ గ్రంథం Revelation 4లో ఏదైతే సృష్టికి అసలైన ఉద్దేశ్యంగా వ్రాయబడినదో "Thou art worthy,O Lord, to receive gloryand honour and power: for thou hast created all things, and **for thy pleasure they are and were created.**"), **అది RSV లో**"Worthy art thou, our Lord and God, to receive glory and honour and power, for thou didst create all things,

and by thy will they existed and were created." గా మార్చబడినది।

ఇంకా ప్రజలను ఏ వర్గానికి చెందిన వారైనా సరే ఆ యా వర్గాల అసంకల్పితమైన సహేతుకం కాని అంధవిశ్వాసాలను, సిద్ధాంతాలను, పిడివాదాన్ని మారు మాట్లాడకుండా, ఎటువంటి ప్రశ్నలు వేయకుండా గ్రుడ్డిగా అనుసరించమని బలవంతం పెట్టడం జరిగినది. గోస్పెల్స్ ఆయా వర్గాల విశ్వాసాలకు అనుగుణంగా రూపొందించబడినవి మరియు సత్యాన్వేషకుడి 'ఏది సత్యమైన మార్గమనే' అన్వేషణ మరల మొదటిదశ కే చేరినది.

కొలొస్సయులకు వ్రాసిన లేఖలో క్రీస్తు కోసం ప్రపంచం సృష్టించబడినదనే పాల్ వివరణ ఇలా ఉన్నది- "క్రీస్తు కనిపించని దేవుని ప్రతిబింబం. ఆయన అన్నింటి కంటే పూర్వం నుండే అనంత జగత్తుకు పునాది వేయుటకు ఉనికిలో ఉన్నాడు. క్రీస్తు అన్నింటినీ సృష్టించాడు. పరలోకంలో ఉన్నవాటిని, భూమి పై అగుపడేవాటిని మరియు అగుపడనివాటిని, సింహాసనాలను, ప్రభుత్వాలను, పాలకులను, అధికారులను, అన్నిటినీ ఆయనే సృష్టించాడు. అన్నీ తన కోసం సృష్టించుకున్నాడు" (కొలొస్సయ్యులు 1:15)

## దేవుడి అవతారం

స్వయంగా దేవుడు మానవ రూపమెత్తి, ఆదం మరియు అతడి వంశీయుల ద్వారా తరతరాలుగా పెరిగి పోయిన ఘోరపాపాల ప్రక్షాళణ కోసం మానవుడి చేతులలో చంపబడటమే మానవ సృష్టి వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యమనేది బహుశా అనేక క్రైస్తవ వర్గాలు అంగీకరించే ఏకైక భావం. ఎటువంటి మానవ పశ్చాత్తాపం గాని లేదా పాప పరిహార క్రియ గాని ప్రక్షాళణ చేయలేనంతటి ఎక్కువగా ఆ ఘోరపాపం పెరిగి పోయిన దనేది వారి అభిప్రాయం. పాపాలతో నిండిన మానవుడి కంటే దేవుడు ఎంతో ఉన్నతుడు. కాబట్టి, దేవుడి స్వయం త్యాగం మాత్రమే మానవజాతిని పాపాల నుండి ముక్తి ఇప్పించగలదని వారి అభిప్రాయం .

చర్చ్ బోధనల ప్రకారం-కేవలం ఇలాంటి మానవ నిర్మిత కల్పిత గాథను నమ్మటమే మోక్షానికి ఏకైక మూలాధారమైనది. అంటే దేవుడి 'దివ్యమైన త్యాగాన్ని' గుర్తించటం మరియు జీసస్ ను దేవుడిగా స్వీకరించటమే క్రైస్తవుల దృష్టిలో సృష్టి యొక్క ఉద్దేశ్యమై పోయినది. దీనిని గోస్పెల్ లో తెలుపబడిన క్రింది పదాల ద్వారా గ్రహించ వచ్చును - "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను 3:16 )

ఏదేమైనప్పటికీ, ఒకవేళ ఇదే గనుక సృష్టి యొక్క ఉద్దేశ్యం మరియు శాశ్వతమైన నిత్యజీవితం పొందటానికి అవశ్యం అయినదైతే, దీనిని ఇతర ప్రవక్తలందరూ ఎందుకు ఉపదేశించలేదు? మానవులందరూ సరిసమానంగా సృష్టి యొక్క ఉద్దేశ్యాన్ని పూర్తి చేయటానికి మరియు శాశ్వతమైన నిత్యజీవితం పొందగలిగే అవకాశం ఇవ్వటానికి వీలుగా ఆదం మరియు ఆయన వంశస్థుల కాలంలోనే దేవుడు మానవుడిగా ఎందుకు మారలేదు? లేదా జీసస్ కంటే ముందు జన్మించిన వారు ఉనికి లోనికి రావటానికి మరేదైనా ఉద్దేశ్యం ఉన్నదా? ఇంకా జీసస్ పేరు వినటాన్ని కూడా తమ జాతకంలో వ్రాయబడని ప్రజలందరికీ, క్రైస్తవుల ఈ 'సృష్టి యొక్క ఉద్దేశ్యం' గురించి తెలుసుకునే అవకాశం లేదు కదా! సహజంగానే, మానవజాతి అవసరాలను పరిపూర్తి చేయలేని అటువంటి ఉద్దేశ్యం మరీ పరిమితమైనది.

## ప్రతిదీ దేవుడే

అనేక దేవుళ్ళు ఉన్నారని, అనేక దేవుడి అవతారాలు ఉన్నాయని, అనేక దివ్యపురుషులు ఉన్నారని మరియు ప్రతిదీ దేవుడే (బ్రహ్మ) నని హిందూ ధర్మగ్రంథాలు బోధిస్తున్నాయి. ప్రతి జీవి యొక్క స్వంత ఆత్మయే వాస్తవానికి బ్రహ్మదేవుడని విశ్వసింపజేసి కూడా, అన్యాయమైన మరియు దౌర్జన్యకరమైన కులవర్గీకరణలను మానవ

సమాజం పై బలవంతంగా రుద్దటం జరిగెను. ఇంకా పుట్టుకతోనే బ్రాహ్మణ కులవంశస్థులు ఆధ్యాత్మిక ఉన్నత స్థానం కలిగి ఉంటారని, కేవలం వారు మాత్రమే పూజారుల స్థానానికి అర్హులని, ఇంకా వారు మాత్రమే వేదాలను బోధించగలరని ప్రకటింపబడెను. (వేదాలు అంటే జ్ఞానం. ఇది హిందువుల కోసం పూర్వం అవతరించిన (స్మృతి-వినిన) అనేక పవిత్ర గ్రంథాలను ఏకంగా సూచించే ఒక సమిష్టి పదం. హిందువుల మిగిలిన ఇతర గ్రంథాలన్నీ స్మృతి (జ్ఞాపకం ఉంచుకున్న) గ్రంథాలుగా ప్రసిద్ధి చెందాయి. వాస్తవానికివి మానవులు రచించిన హిందువుల మూలసిద్ధాంతాల మరియు అభ్యాసముల క్రోడీకరణలు) (The New Encyclopaedia Britannica, vol. 20, p.530). ఇంకా ఈ ప్రాచీన గ్రంథాలు హిందువుల ఆదర్శప్రాయమైన సంస్కార విధులకు, ఆచార సంబంధమైన కర్మకాండలకు మరియు సామాజిక ప్రతిష్టలకు ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. ఇంకో వైపు శూద్రులు మత సంబంధమైన హోదాల నుండి, ఉన్నత స్థానాల నుండి తప్పించబడినారు. వారి జీవితాంతపు ఏకైక విధి, కర్తవ్యం, విద్యుక్త ధర్మం "కేవలం నమ్రతగా, దైన్యంగా, సాత్వికంగా మిగిలిన మూడు ఉన్నత కులస్థులకు మరియు వేల సంఖ్యలోని వాటి ఉపకులాలకు ఊడిగం, పరిచర్యలు చేయుటం, మాత్రమేనని." ప్రకటించారు. మానవ ధర్మశాస్త్రం 1.91 *(The New Encyclopaedia Britannica* vol 20, p.553)

"తమలోని దైవత్వాన్ని గ్రహించి, తెలుసుకుని పునర్జన్మ చక్రపు మోక్షమార్గం ప్రకారం జీవిస్తూ, క్రమంగా పరిపూర్ణమైన, అసలైన బ్రహ్మాత్మలో మానవాత్మ విలీనం కావటమే మానవజాతి సృష్టి ఉద్దేశ్యం" అని పరతత్వాన్ని అంటే మనశ్శరీరాల ద్వైత్వాన్ని నిరాకరించే హిందూ ధర్మ తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం. "తండ్రి, తన పిల్లల ద్వారా అనుభవించే సుఖసంతోషాల వంటి బాంధవ్య సుఖసంతోషాలనే తను కూడా పొందటానికి దేవుడు మానవుడిని సృష్టించాడు కాబట్టి, దేవుడిని ప్రేమించటమే మానవజాతి సృష్టి యొక్క ఉద్దేశ్యం" అని భక్తిమార్గాన్ని అనుసరించే వారి అభిప్రాయం. (భక్తిమార్గాన్ని అనుసరించే వారంటే - రాబోయే

జీవితంలో కృష్ణలోకంలో ప్రవేశిస్తారనే ఆశతో తన స్వంత దేవుళ్ళను కొలుస్తూ, భక్తితో విగ్రహారాధనలు చేసేవారు.। శ్రీమద్ భగవద్గీత

సామాన్య హిందువుల దృష్టిలో, సామాజిక మరియు ఆచార వ్యవహారాల హద్దులలో కులసాంప్రదాయాల కట్టుబాట్లకు లోబడి గడిపే కర్మసిద్ధాంతపు ప్రాపంచిక జీవితంలోనే మానవజాతి సృష్టి యొక్క ముఖ్యోద్దేశ్యం ఇమిడి ఉన్నది. The New Encyclopaedia Britannica, vol. 20.p. 520.

వేదగ్రంథాలలోని హిందూధర్మం చాలా వరకు అగ్ని పూజల చుట్టూ తిరుగుతున్నప్పటికీ, ఇతర హైందవ ధార్మిక గ్రంథాలలోని సిద్ధాంతాల మరియు అభ్యాసముల తీవ్ర ప్రాబల్యానికి లోనైనప్పటికీ, వాస్తవానికి ప్రాచీన వేదాల సంపూర్ణ అధికారం మరియు పవిత్రతే హిందూ ధర్మ శాఖలన్నింటికీ మరియు సాంప్రదాయాలన్నింటికీ కేంద్రబిందువుగా నిలిచిపోయినది. వేదాలనేవి నాలుగు దివ్యగ్రంథాల సంకలనం. వాటిలో అత్యంత ప్రాచీనమైనది ఋగ్వేదం. (వివేకం, విజ్ఞత, విచక్షణ, తెలివితేటల ప్రవచనాలు). దీనిలో చాలా అస్పష్టమైన రీతిలో, తికమక పెట్టే విధంగా దేవుడి గురించి వివరించబడినది. ఋగ్వేదంలో తెలుపబడిన ధర్మంలో - ఆకాశం మరియు వాతావరణానికి చెందిన దేవతలను సంతుష్ట పరచటమే ముఖ్యలక్ష్యమనే విధంగా బహుదైవారాధనను ప్రతిబింబిస్తున్నది. వీటిలో స్వర్గాధిపతి అయిన ఇంద్రదేవుడు, వరుణ దేవుడు, అగ్నిదేవుడు, సూర్యదేవుడు మొదలైనవారు ముఖ్యమైన దేవుళ్ళు. తర్వాత వేదాలలో ముఖ్యంగా ఋగ్వేదపు దేవుళ్ళలో ఆసక్తి, అభిరుచి తగ్గిపోయి, బహుదైవారాధనను త్యాగాలతో, బలితో కూడిన దేవుడు (ప్రజాపతి - సర్వలోకాల ప్రభువు, ఆయనే సర్వం) అంతటా ఉంటాడనే అద్వైతము ఆక్రమించినది. ఉపనిషత్తులలో (త్రైలోకాల సమీకరణాల గురించిన రహస్య ఉపదేశాలు) ప్రజాపతి సిద్ధాంతం బ్రహ్మదేవుడి భావాలతో కలిసిపోయినది. ఏవైనా ప్రత్యేక వ్యక్తిగత దైవత్వాలను విశ్వలోకపు అసలు వాస్తవికత మరియు సారాంశం అనే భావాలు ఆక్రమించాయి. ఆ విధంగా పౌరాణిక

గాథలు క్రమంగా సంక్షిప్తమైన తత్వశాస్త్రాలుగా రూపాంతరం చెందాయి.
The New Encyclopaedia Britannica, vol. 20. pp.529-530.

ఒకవేళ మానవులు కేవలం ఈ ప్రాచీన గ్రంథాల బోధనలను మాత్రమే మార్గదర్శకత్వం కోసం ఎన్నుకోవలసి వస్తే, వారు దేవుడు తనను తాను రహస్యంగా దాచి ఉంచటమే కాకుండా, మానవజాతి సృష్టి యొక్క ఉద్దేశ్యాన్ని కూడా రహస్యంగా దాచి ఉంచాడనే అంతిమ నిర్ణయానికి చేరుకుంటారు.

అత్యంత వివేకవంతుడైన సర్వలోక సృష్టికర్త గందరగోళం లేదా తికమక పెట్టే గ్రంథాలను అవతరింప జేసేవాడు ఎంతమాత్రమూ కాదు. కాలక్రమంలో అసలైన దివ్యసందేశాలను మానవుడు తన స్వంత ప్రయోజనాల కోసం దాచి వేయటమో లేక మార్పులు చేర్పులు చేయటమో జరిగినది. అంతేకాక మానవుడిని కష్టపెట్టాలని ఎట్టి పరిస్థితులలోను ఆలోచించని మహోన్నతుడు ఆ అనంత కరుణా మయుడైన సర్వలోక సృష్టికర్త. అందుకని ప్రజల బాధ్యతపై వదిలిన పూర్వగ్రంథాల పరిస్థితియే తన అంతిమ సందేశానికి ఎదురుకాకూడదని నిర్ణయించి, దాని బాధ్యతను స్వయంగా తనే తీసుకొనెను. 1400 సంవత్సరాలకు పూర్వం ఆయన తన అంతిమ దివ్యసందేశాన్ని మానవజాతి కోసం అవతరింపజేసిననాడే, తర్వాత కాలంలో వచ్చే తరతరాల ప్రజల కోసం అది సురక్షితంగా ఉండేటట్లు తానే స్వయంగా జాగ్రత్తలు తీసుకున్నాడు. దానిలో సృష్టికర్త స్పష్టంగా మానవజాతి సృష్టి యొక్క ఉద్దేశ్యాన్ని తెలియజేసినాడు. ఇంకా తన అంతిమ సందేశహరుడైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మానవుడు గ్రహించవలసిన అన్ని విషయాలను స్పష్టంగా ఉపదేశించాడు. ఈ యొక్క అంతిమ దివ్యావతరణ (ఖుర్ఆన్) మరియు అంతిమ సందేశహరుని ఉపదేశాల ఆధారంగా మనం రాబోయే పేజీలలో "సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించాడు?" అనే ప్రశ్న యొక్క సరియైన, సూక్ష్మమైన సమాధానాలను పరిశీలించుదాము.

# సృష్టికర్త ఎందుకు సృష్టించాడు ?

దేవుడి తరుపు నుండి, "సృష్టికర్త ఎందుకు సృష్టించాడు?" అనే మరీ మౌలికమైన, ప్రాథమిక ప్రశ్న అడగవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ ప్రశ్న ఎందుకు అడగవలసి ఉన్నదంటే, వాస్తవానికి మిగిలిన విశ్వంతో పోలిస్తే, మానవసృష్టి ఏమంత అద్భుతమైనది కాదనేది అర్థమవుతుంది. సమస్త మానవాళి కోసం అవతరింపజేయబడిన అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ లో సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు :

**"వాస్తవానికి ఆకాశాలను మరియు భూమిని సృష్టించటం, మానవులను సృష్టించటం కంటే ఎంతో గొప్ప విషయం, కానీ చాలా మంది ప్రజలకు ఇది తెలియదు"** [40:57]

వారు నివసిస్తున్న మిగిలిన విశ్వంతో పోలిస్తే మానవ సృష్టి ఏమంత జటిలమైనదీ, సంక్లిష్టమైనదీ కానే కాదు. కాని చాలా తక్కువ మంది ప్రజలు ఈ వాస్తవం పై దృష్టి వేస్తారు. దీనికి కారణం - భూలోకంలోని ఇతర జీవచరాలపై స్పష్టంగా కనబడే మానవజాతి యొక్క ఆధిక్యత, ఆకాశాలలో (రోదసీలో) మానవుడి పయనం, దినదినాభివృద్ధి చెందుతున్న వారి సాంకేతిక పరిజ్ఞానం మొదలైనవి. వెరసి మానవుడు ప్రతి కాలంలోను విశాల విశ్వంలో తనే అత్యద్భుతమైన ఒక గొప్ప సృష్టి అనే భ్రమలో పడి, అహంకారిగా మారినాడు. మానవుడు కనిపెట్టిన వాటిలో అధిక శాతం అందరినీ ఆశ్చర్యచకితులను చేసే అతడి పరిసరాల ప్రకృతిలోని మహాద్భుత విషయాలే. అంతేకాని, స్వయంగా మానవజాతి గురించి కనిపెట్టబడిన నూతన విషయాలు చాలా కొద్దిపాటి మాత్రమే అనేది ఇక్కడ మనం గమనించ వలసిన ముఖ్య విషయం. కాబట్టి, మానవుడి పరిశోధనలు భౌతిక ప్రపంచం పైనే ఎక్కువగా కేంద్రీకరించబడినాయి గాని మానవజాతి పై కాదు అనేది ఒక తిరుగులేని సత్యం. పై వచనంలో,

అల్లాహ్ మానవులను విశ్వంలోని తమ అసలు స్థానం వైపుకి మరల్చుతున్నాడు. దివ్యమైన సృష్టిని ఉనికిలోనికి తెచ్చిన అత్యద్భుత సృష్టి నిర్మాణ కార్యక్రమంలో మానవజాతి సృష్టి కేవలం ఒక చిన్న భాగం మాత్రమే. కాబట్టి, సృష్టికర్త మానవుడిని ఎందుకు సృష్టించాడు అనే విషయం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించే ముందు, "సృష్టికర్త ఎందుకు సృష్టించాడు?" అనే మరీ మౌలికమైన, ప్రాథమిక ప్రశ్నకు సరైన సమాధానం తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

## సృష్టికర్త

సృష్టి అనేది మౌలికంగా ఏకైక ఆరాధ్యుడి సృష్టికర్త అనబడే దివ్యమైన లక్షణం మరియు సుగుణం యొక్క పర్యవసానం. సృష్టి చేయలేని సృష్టికర్త అనేది పరస్పర వ్యతిరేక భావాల్నిచ్చే ఒక పద సమూహం. ఇక్కడ దైవానికి ఈ యొక్క సృష్టి అవసరం ఉన్నదని ఎంత మాత్రమూ కాదు. కాని సృష్టికి దైవం అవసరం ఎంతైనా ఉన్నదనేది అసలైన వాస్తవం. కాని, ఎలాగైతే ఒక రచయిత యొక్క గొప్పదనం అతడి రచనలలో కనబడుతుందో, అలాగే సృష్టికర్త యొక్క సృష్టించటం అనే దివ్య లక్షణంలోని సంపూర్ణత ఆయన సృష్టిలో కనబడుతుంది. సృష్టించటం అనేది వాస్తవిక దృక్పథంలో కేవలం అల్లాహ్ కు మాత్రమే చెందిన ఒక ప్రత్యేక ఏకైక లక్షణం. మానవులు సృష్టించటం అనే పనిని తమకు కూడా వర్తింపజేసుకున్నప్పటికీ, వారు చేస్తున్నది అసలైన సృష్టి కాదు. అల్లాహ్ ముందుగానే సృష్టించి, ఉనికిలో ఉంచిన మూలకాలతో మానవజాతి కేవలం రకరకాల ప్రయోగాలు చేస్తున్నదే తప్ప ఆ మూలకాలను లేదా అటువంటి వేరేవాటిని స్వయంగా సృష్టించటం లేదు. చెట్టు నుండి లభించిన కలపను సరైన కొలతలలో చెక్కి, రాళ్ళ నుండి పొందిన లోహాల మిశ్రమంతో తయారైన మేకులు, మరమేకులతో వాటిని బంధించి, టేబుల్ తయారు చేస్తున్నారు. మానవులు చెట్లను గాని, రాళ్లను గాని తయారు చేయటం లేదు. నిజానికి, మానవులు తయారు చేసిన వాటన్నింటిని పరిశోధించినట్లయితే, వాటి మూలాలు పూర్వం

నుండి సృష్టిలో ఉన్న, మానవజాతి సృష్టించలేని, అసలైన ప్రాథమిక మూలకాల వద్దకే చేరును. ఒక చిత్రకారుడు ముందుగా అతడు చూసిన దాని ప్రేరణతోనే ఏదైనా చిత్రాన్ని చిత్రిస్తాడు. ఎందుకంటే మన జ్ఞానేంద్రియాలు గ్రహించని వాటిని, ఊహించటం కూడా అసాధ్యమే. కాబట్టి కళాకారుడి ఆలోచనలు మరియు భావాలు ముందు నుండి సృష్టిలో ఉన్నవాటినే ప్రతిబింబిస్తాయి. కేవలం అల్లాహ్ మాత్రమే అసలు ఉనికిలో లేని వాటిని శూన్యం నుండి సృష్టించగల సమర్థుడు. ఈ ప్రాథమిక వాస్తవికతను కొందరు గ్రహించలేరు. సృష్టికర్త శూన్యం నుండి ఎలా సృష్టించగలడో అర్థం చేసుకోలేని కొందరు పురాతన మరియు నూతన తత్వశాస్త్రిజ్ఞులు, సృష్టించబడిన ఈ విశాల విశ్వం మరియు దానిలోని ప్రతిదీ వాస్తవానికి దేవుడి యొక్క భాగమే అని వాదిస్తున్నారు. [బ్రహ్మ గురించి హిందువుల విశ్వాసం కూడా ఇదే. ఋగ్వేదంలోని చివరి (పదవ) గ్రంథంలో పురుష శక్తి గురించిన శ్లోకాలలో ఇలా వ్రాయబడి ఉన్నది - మౌలికమైన తొలి బలికోసం (primordial sacrifice.) పురుష యొక్క శరీరం అగ్నికి ఆహుతై, ముక్కలు ముక్కలుగా బ్రద్దలైనప్పుడు, ఆయన శరీరభాగాల నుండి ఈ విశ్వ ప్రపంచం సృష్టింపబడినది. ఆయన శరీరం నుండి నాలుగు కులాలు ఉత్పత్తి అయ్యాయి: బ్రాహ్మణులు ఆయన యొక్క ముఖ భాగం నుండి, క్షత్రియులు భుజాల నుండి, వైశ్యులు తొడభాగం నుండి మరియు శూద్రులు కాళ్ళభాగం నుండి] (The New Encyclopaedia Britannica, vol. 20, p. 531).

అంటే, వారి అభిప్రాయం ప్రకారం, దేవుడు తనలోని ఒక భాగాన్ని తీసి, ఈ విశ్వప్రపంచాన్ని తయారు చేశాడు. దేవుడి సృష్టి సామర్థ్యాన్ని, ఉనికిలో ముందు నుండి ఉన్న మూలకాలనే ప్రయోగించి క్రొత్త క్రొత్త వాటిని తయారు చేసే మానవుడి సామర్థ్యంతో పోల్చటం పై ఆధారపడుతూ ఈ వాదన ముగిస్తున్నది. మానవుడి పరిమిత శక్తియుక్తులను తనకు వర్తింపజేసే అటువంటి పోలికలను దేవుడు తీవ్రంగా నిరాకరిస్తున్నాడు. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

**"ఆయనకు పోలింది ఏదీ లేదు. మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు."** [Quran, 42:11]

కాబట్టి, సృష్టించటం అనే కార్యం దేవుడి సృష్టికర్త అనే దివ్యమైన లక్షణానికి పర్యవసానం మాత్రమే. సృష్టికర్త, తన అంతిమ సందేశంలో అనేకచోట్ల తనే సృష్టికర్త అనీ, ప్రతిదీ కేవలం తనకే చెందుతుందనీ మానవజాతికి అర్థమయ్యేటట్లు స్పష్టంగా తెలియజేసాడు.

"అల్లాహ్ యే ప్రతి దానిని సృష్టించే వాడు మరియు ఆయనే ప్రతిదానికీ కార్యకర్త." [Quran, 39:62]

"వాస్తవానికి, మిమ్మల్ని మరియు మీరు (చెక్కి) చేసిన వాటిని సృష్టించింది అల్లాహ్ యే కదా!" [Quran, 37:96]

సృష్టికర్త అనుమతి లేకుండా ఈ విశ్వప్రపంచంలో ఏదీ జరగదనే వాస్తవాన్ని మానవుడు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. సృష్టికర్త వైపుకు మరలకుండా, దుష్టశక్తుల నుండి శరణు వేడుకోవటానికి లేదా శుభాల కోసం అర్థించటానికి వేరే శక్తులను ఆశ్రయించటమనేది అత్యంత ఘోరమైన తప్పిదం. చాలా మంది ప్రజలు కష్టకాలాన్ని తప్పించు కోవటానికి మరియు సుఖాలను పొందటానికి తమ అజ్ఞానం వలన మంత్రతంత్రాలు, తాయెత్తులు, జ్యోతిష్యం, చేతివ్రాతలు, మొదలైన వాటిపై ఆధారపడుతున్నారు. అయితే తన అంతిమ సందేశంలో సృష్టికర్త దుష్టశక్తుల నుండి కాపాడుకోవటానికి కేవలం తననే ప్రార్థించమని ఇలా ఆదేశిస్తున్నాడు: "ఇలా అను: "నేను ఉదయకాలపు ప్రభువు అయిన (అల్లాహ్) శరణు వేడుకుంటున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి." [Quran, 113:1-2]

సర్వలోక శక్తిమంతుడైన అల్లాహ్ దుష్టుడు కాదు, ఆయన మహోన్నతుడు. ఆయన ఒక విశ్వప్రపంచాన్ని సృష్టించాడు. దానిలోని కొన్ని సృష్టితాలకు ఆయన ఇతరులకు చెడును లేదా మంచిని చేసే శక్తిని ప్రసాదించాడు. ఏదేమైనప్పటికీ, ఆయన అనుమతి లేకుండా ఈ విశాల విశ్వంలో చెడుగాని, మంచిగాని జరుగదు. అందుకని, సహాయం కోసం మరియు సంరక్షణ కోసం సృష్టికర్త అయిన అల్లాహ్ ను వదిలి ఇతరులను వేడుకోవటంలో ఎటువంటి ఫలితమూ ఉండదు.

"ఏ ఆపద కూడా, అల్లాహ్ అనుమతి లేనిదే సంభవించదు." [Quran, 64:11]

ఇదే విషయాన్ని ఇంకా స్పష్టంగా వివరిస్తూ, సృష్టికర్త యొక్క అంతిమ సందేశహరుడైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు, "జాగ్రత్తగా వినండి. మొత్తం మానవజాతి అంతా కలిసి నీకు ఏమైనా సహాయం అందించాలని ప్రయత్నిస్తే, వారు కేవలం అల్లాహ్ మీ జాతకంలో ముందుగా వ్రాసిన మేరకు మాత్రమే సహాయపడగలరు. అలాగే, మొత్తం మానవజాతి అంతా కలిసి నీకు ఏదైనా హాని చేయాలని తలపెడితే, వారు కేవలం అల్లాహ్ మీ జాతకంలో ముందుగా వ్రాసిన మేరకు మాత్రమే హాని చేయగలరు." అత్తిర్మిథీ హదీథ్ గ్రంథంలో నమోదు చేయబడిన అబ్బాస్ రదియల్లాహు అన్హు యొక్క హదీథ్. *atTirmithee,* vol. 2, pp. 308-9. no. 2043.

## దయామయుడు, క్షమాశీలుడు

దివ్యమైన క్షమాగుణం, దయాగుణం మరియు కృపాగుణం కూడా మానవజాతి సృష్టిలోని భాగమే. మంచి, చెడుల సహజ పరిజ్ఞానంతో మానవులు ఉత్తములుగా మరియు స్వచ్ఛమైన వారుగా సృష్టింపబడినారు. సృష్టికర్త ఇంకా మానవులలో కోరికలను కూడా సృష్టించి, వాటిని దైవాజ్ఞలను అనుసరించి అదుపు చేసుకునే విధంగా మరియు తేలికగా లొంగిపోయి, వాటినే గ్రుడ్డిగా అనుసరించే విధంగా నిర్ణయించుకునే శక్తిసామర్థ్యాలను కూడా సృష్టించాడు. తనకు అవిధేయత చూపుతారని ముందుగా గ్రహించే సృష్టికర్త మానవుడిని సృష్టించాడు.

ఫలితంగా, ఆదిమానవుడైన ఆదంతో మొదలు మానవులు తమ పాపాల నుండి ఎలా పశ్చాత్తాపపడాలో మరియు ఎలా తమను తాము పరిశుద్ధపరచుకోవాలో ఆయన ఉపదేశించాడు. ఆదం మరియు ఈవ్ లు మానవజాతి మొత్తం అనుసరించటానికి సరిపడే జీవిత విధానాన్ని వదిలి వెళ్ళారు. వారు సృష్టికర్త ఆదేశాన్ని మరచి పోయారు మరియు సైతాను వారి కోరికలతో, మనోవాంఛలతో ఆడుకున్నాడు. సృష్టికర్తకు అవిధేయత చూపిన తర్వాత, చేసిన తప్పును గ్రహించి వెంటనే వారు ఆయన వైపుకే పశ్చాత్తాపంతో మరలినారు మరియు ఆయన వారిని క్షమించెను.

మానవజాతి అవిధేయత చూపటంలో మరియు సృష్టికర్త వైపునకు పశ్చాత్తాపంతో మరలిపోవటంలో ఏకైక దైవమైన అల్లాహ్ యొక్క సంపూర్ణ క్షమాగుణం మరియు అంతులేని దయాగుణం అనే దివ్యలక్షణాలు తప్పక కనబడతాయి. ఈ వాస్తవిక విషయం గురించి అంతిమ సందేశహరుడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులకు ఇలా ఉపదేశించెను. "ఒకవేళ మీరు ఎటువంటి పాపాలు చేయక, క్షమాపణ అర్థిస్తూ, అల్లాహ్ వైపునకు మరలుతున్నట్లయితే, ఆయన మీకు బదులుగా,పాపాలు చేస్తూ క్షమాపణ అర్థించే వేరే ప్రజలను ప్రపంచంలోనికి పంపేవాడు మరియు వారిని క్షమించేవాడు." అబూ అయ్యూబ్ అల్ అన్సారీ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన సహీముస్లిం హదీథ్ *Sahih Muslim*, vol. 4, pp. 1435-6, no. 6621.

అంతిమ సందేశంలో ఒక్కటి తప్ప మిగిలిన అధ్యాయాలన్నీ "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం - అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో" అనే పవిత్ర వచనాలతో ఆరంభమవుతాయి. మానవులు నిస్పృహకు గురికాకుండా ఉండటానికి అల్లాహ్ యొక్క దయాగుణం మరియు క్షమాగుణాల పై ఎక్కువగా ఆధారపడటాన్ని ప్రోత్సాహించబడినది. చేసిన పాపాలు ఎంతటి ఘోరమైనవైనా సరే, మానవులు గనుక మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడి, అల్లాహ్ ను క్షమాపణ వేడుకుంటే ఆయన వాటిని క్షమించి వేయగలడు.

"అల్లాహ్ విశ్వాన్ని సృష్టించినప్పుడు, ప్రతి విషయాన్ని ముందు గానే నమోదు చేసి భద్రపరచిన మహా గ్రంథంలో 'నా యొక్క దయాగుణం నా యొక్క కోపాగ్రహాన్ని తప్పని సరిగా అధిగమించినదనే' అల్లాహ్ యొక్క ప్రకటన గురించిన" హదీథ్ ను అబు హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించారు *Sahih Muslim*, vol. 4, p. 1437, no. 6628.

అబు హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు -

"అల్లాహ్ అమిత దయాగుణాన్ని నూరు భాగాలుగా విభజించినాడు. దానిలో నుండి ఒక భాగాన్ని జిన్నాతులు, మానవులు మరియు ఇతర సృష్టిజీవాల పై అవతరింపజేసినాడు. దీని కారణంగానే మనం పరస్పర ప్రేమాభిమానాలు, దయాదాక్షిణ్యాలు చూపుకుంటున్నాము. ఇంకా పశుపక్ష్యాదులూ, జంతుజీవాలూ తమ సంతానాన్ని ప్రేమతో పెంచు తున్నాయి. అయితే మిగిలిన 99 భాగాలను మాత్రం అల్లాహ్ తన యొక్క అసలైన, సత్యమైన ఆరాధ్యుల కోసం తీర్పుదినాన ఉపయోగించటానికి భద్రపరచి ఉంచినాడు." **Sahih Muslim, vol. 4, p. 1437, no. 6631.**

అల్లాహ్ తలచుకుంటే ఎటువంటి పాపాలూ అస్సలు చేయలేని దైవదూతల వలే మానవులను కూడా సృష్టించి ఉండేవాడు. కాని, అయన దైవదూతలను ముందుగానే సృష్టించి ఉండటం వలన, మానవజాతిని కూడా వారిలా సృష్టించటం ఆయన ఇష్టపడలేదు. కాబట్టి మానవులు తమ జీవిత పరీక్షలో భాగంగా తప్పులు, పాపాలు చేయగలిగే విధంగా సృష్టించబడినారు. ఎప్పుడైతే తాము చేసిన తప్పులను గ్రహించి, అల్లాహ్ యొక్క క్షమాభిక్ష వేడుకున్నారో, అప్పుడు అల్లాహ్ యొక్క దయా దాక్షిణ్యాల దివ్యగుణం ఉప్పొంగి, ఆయన వారిని క్షమించివేయును.

## అత్యుత్తమమైన అంతిమ తీర్పు Supreme Justice

ఈ ప్రపంచపు చివరి దశలోని తీర్పుదినాన మానవుల న్యాయవిచారణలో అల్లాహ్ యొక్క అత్యుత్తమ న్యాయప్రదర్శన మరియు అత్యుత్తమ నీతి, నిజాయితీలు ప్రదర్శితమగును. ఆయన యొక్క అపరిమితమైన దివ్యజ్ఞానం ఆధారంగా, భూలోకంలో నివసించవలసిన మొత్తం మానవజాతిని ఒకేసారి సృష్టించి, వెంటనే వారిలో నుండి కొందరిని స్వర్గంలోనికి, మిగిలిన వారిని నరకంలోనికి పంపి ఉండేవాడు. మానవజాతిని సృష్టించక ముందే - ఈ భూలోకంలో ఎలాంటి జీవితాన్ని వారు ఎన్నుకుంటారు, వారికి ఏ యే శుభాలను, ఏ

యే అవకాశాలను ఆయన ప్రసాదిస్తాడు మరియు వారు ఏ విశ్వాస లేక అవిశ్వాస స్థితులలో మరణిస్తారు వంటి విషయాలన్నీ అల్లాహ్ జ్ఞానంలో ఉన్నాయి. కాబట్టి, ఒక విధంగా చెప్పాలంటే కొందరు మానవులు స్వర్గలోకం కోసం సృష్టించ బడినారు మరియు మిగిలిన వారు నరకశిక్షల కోసం. ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖన ప్రకారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ప్రకటించినారు "అల్లాహ్ స్వర్గనరకాలను మరియు వాటి నివాసులను సృష్టించాడనే విషయం నీకు తెలియదా?" Sahih Muslim, vol. 4, p. 1400, no. 6435.

ఒకవేళ అల్లాహ్ వెనువెంటనే స్వర్గవాసులను స్వర్గంలోనికి ప్రవేశింపజేసి ఉండినట్లయితే, వారు ఆయన నిర్ణయాన్ని ఏ మాత్రమూ ప్రశ్నించేవారు కాదు. స్వర్గవాసులు అపరిమితమైన స్వర్గజీవితాన్ని సంతోషంగా స్వీకరించేవారు. ఇంకా వారు నరకంలో పడవేయనందుకు కృతజ్ఞతలు తెలుపుకునేవారు. అయితే, నరకంలోనికి పంపబడిన వారు, అక్కడికి ఎందుకు పంపబడినారో తెలుపమని తక్షణమే ప్రశ్నించేవారు. వారిని ఒకవేళ భూలోకంలోనికి పంపినట్లయితే ఏమి చేసి ఉండేవారో తెలుసుకోలేని తమ అజ్ఞానం వలన నరకవాసులు పక్షపాతానికి గురైనట్లు భావించేవారు. ఇంకా ఆ నరకవాసులు తమకు గనుక భూలోకంలో జీవించే అవకాశం ఇచ్చి ఉండినట్లయితే, తాము అల్లాహ్ పై విశ్వాసం చూపుతూ మంచి పనులు చేసి ఉండేవారమని తీవ్రంగా వాదించేవారు. అందుకని, అల్లాహ్ మానవులను తమ తమ ఇష్టానుసారం జీవించ గలిగే పూర్తి స్వేచ్ఛను, అవకాశాన్నీ ఇచ్చి ఈ భూలోకంలోనికి పంపినాడు. దీని ద్వారా నరకంలో పంపబడిన ప్రతి ఒక్కరూ, తామే స్వయంగా అటువంటి భయంకరమైన నరక జీవితాన్ని ఎన్నుకున్నామనే వాస్తవాన్ని తెలుసు కుంటారు. వారు తాము జీవించిన భూలోకంలో, తమపై అల్లాహ్ చూపిన దయాదాక్షిణ్యాలను, కరుణాకటాక్షాలను గుర్తిస్తారు. అల్లాహ్ యొక్క సూచనలను మరియు మార్గదర్శకత్వాన్ని తిరస్కరించి తాము చేసిన ఘోరమైన స్వయం కృతాపరాధాన్ని ఒప్పుకుంటారు. ఇంకా ఆయన

యొక్క తీర్పు అత్యంత న్యాయమైనదిగా మరియు అత్యంత ఉత్తమమైనదిగా వారు స్వీకరిస్తారు. ఎలాగైనా తమను మరల భూలోకానికి పంపి, మంచి పనులు, పుణ్యకార్యాలు చేయగలిగే మరో అవకాశాన్ని ప్రసాదించమని అల్లాహ్ ను వేడుకుంటారు. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"(పునరుత్థాన దినమున) ఈ అపరాధులు, తమ ప్రభువు సమక్షంలో, ఏ విధంగా తమ తలలు వంచుకొని నిలబడి ఉంటారో, నీవు చూడగలిగితే! వారు: "ఓ మా ప్రభూ! మేమిప్పుడు చూశాము మరియు విన్నాము, కావున మమ్మల్ని తిరిగి (భూలోకానికి) పంపించుము. మేము సత్కార్యాలు చేస్తాము, నిశ్చయంగా, మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది." అని అంటారు. [Quran, 32:12]

అయితే, ఎలాగోలా అల్లాహ్ గనుక వారిని మరల ఈ భూలోకంలోనికి పంపినా, వారు నరకంలో చూసిన భయంకర శిక్షలను మరచి, మళ్ళీ అవే పాపాలను, చెడును ఎన్నుకుని, ఈ రెండో అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోక, మునుపు లాగే మరల నరకశిక్షలకు అర్హులుగా నిలబడతారు. దీనినే అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఒకవేళ వారిని (గత జీవితంలోకి) తిరిగి పంపినా, వారికి నిషేధించబడిన వాటినే వారు తిరిగి చేస్తారు. నిశ్చయంగా, వారు అసత్యవాదులు!" [Quran, 6:28]

## దివ్యమైన ప్రేమ Divine Love

విశ్వాసులైనా లేక అవిశ్వాసులైనా, జీవన మాధుర్యాన్ని పొందుతూ ఈ లోకంలో కేవలం కొన్ని క్షణాలు గడిపినా గాని, వారు అల్లాహ్ యొక్క దివ్యమైన ప్రేమను తప్పక గుర్తిస్తారు. చెడును వదిలి మంచి పనులు చేసే పుణ్యపురుషుల కోసం సృష్టించబడిన స్వర్గంలో కూడా ఇది గుర్తింపబడుతుంది. అల్లాహ్ తన అంతిమ సందేశంలో - మంచి పనులు చేసేవారినీ (5:13), న్యాయబద్ధంగా జీవించే వారినీ (5:42), పుణ్యకార్యాలు చేసే వారినీ (9:4), సహనంతో జీవించే వారినీ (3:146), అల్లాహ్ నే పూర్తిగా నమ్ముకున్న వారినీ (3:159), తరచుగా తన వైపు పశ్చాత్తాపంతో మరలుతూ, మాటిమాటికీ పరిశుద్ధపరచుకునే వారినీ

(2:222) తను తప్పక ప్రేమిస్తానని ప్రకటించినాడు. అయితే, ఏది మంచి, ఏది న్యాయబద్ధమైనది, ఏది పుణ్యకార్యం అనే వాటిని అల్లాహ్ యే స్వయంగా నిర్వచించి, తన దివ్యగ్రంథాల ద్వారా మరియు తన ప్రవక్తల ద్వారా మానవాళికి తెలియజేసెను. ఫలితంగా, తన సందేశహరులను, ప్రవక్తలను మనస్ఫూర్తిగా అనుసరించే వారిని అల్లాహ్ అత్యధికంగా ప్రేమిస్తాడు. దివ్యఖుర్ఆన్ లోని ఆలె ఇమ్రాన్ (ఇమ్రాన్ కుటుంబం) అనే మూడో అధ్యాయంలో విశ్వాసులకు ఇలా ఉపదేశించమని అల్లాహ్ తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను ఆదేశించినాడు:

"మీకు (నిజంగా) అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత." [Quran, 3:31]

అల్లాహ్ తప్పనిసరిగా, విధిగా చేయమని ఆదేశించిన వాటిలో ప్రవక్తలను అనుసరించటం మాత్రమే కాకుండా, వారి యొక్క అదనపు ఆరాధనలను ఆచరించాలనే తపన, ఆతృత, ఆసక్తిని కూడా మనస్ఫూర్తిగా అనుసరించవలసి ఉన్నది.

అల్లాహ్ యొక్క ప్రేమ, ఆయన యొక్క శుభాశీస్సులలో, దీవెనలలో, కరుణలో కూడా ఇమిడి ఉన్నది. దానిని ఆయన యోగ్యులైన వారికి మాత్రమే కాకుండా యోగ్యులు కాని వారికి కూడా ప్రసాదిస్తాడు. కాని ఆ మహోన్నత దివ్య ప్రేమ, నిజాయితీగా పశ్చాత్తాప పడుతూ, తన వైపుకు మరలుతున్న వారి పాపాలను ఆసక్తిగా క్షమించే ఆయన దివ్యలక్షణంలో ప్రత్యేకంగా కనబడుతుంది. ఆదం మరియు ఈవ్ అలైహిస్సలాంలను సృష్టించిన తొలికాలంలోనే, తమ పాపాల ప్రక్షాళణ చేసుకునే పశ్చాత్తాప విధానాన్ని ఈ భూలోకంలోనికి రాబోయే మొత్తం మానవాళికోసం ఒక మంచి ఉదాహరణగా చూపెట్టినాడు. మానవుడి పాపాలు ఎంత ఘోరాతి ఘోరమైన స్థితికి చేరుకున్నప్పటికీ, చిత్తశుద్ధితో పశ్చాత్తాప పడే ద్వారాన్ని, అల్లాహ్ ఈ ప్రళయదినం వరకు తెరిచే ఉంచాడు. అనస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు - "సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: ఓ ఆదం సంతానమా, నీవు కేవలం నన్నే వేడుకున్నంత కాలం మరియు నన్నే అర్థించినంత కాలం నీవు చేసిన పాపాలను క్షమించి వేయటంలో నేను వెనుకాడను. ఓ ఆదం సంతానమా, ఒకవేళ నీ పాపాల గుట్ట మబ్బుల ఎత్తుకు చేరినా, నీవు గనుక నా క్షమాపణ వేడుకున్నట్లయితే, నేను తప్పక క్షమిస్తాను. ఓ ఆదం సంతానమా, నీవు గనుక నా ఏకైక దైవత్వంలో భాగస్వామ్యం కల్పించక, షిర్క్ చేయక మొత్తం భూమండలమంతటి బరువైన పాపాలతో నా దగ్గర కు వచ్చినా, దానికి సరితూగే క్షమాభిక్షను నేను తప్పక ప్రసాదిస్తాను."
**Sahih Sunan at Tirmithee, vol. 3, pp. 175-6, no. 2805.**

## దివ్యమైన దీవెనలు, శుభాశీస్సులు Divine Grace

స్వర్గవాసులు కేవలం తమ పుణ్యకార్యాల ఆధారంగా స్వర్గం లోనికి ప్రవేశింపలేరు. కాని, అల్లాహ్ యొక్క కరుణాకటాక్షాలు మరియు దయాదాక్షిణ్యాలే అంతిమంగా వారిని స్వర్గంలోనికి చేర్చుతాయి. అబుహురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయమై ఇలా బోధించారు. "మంచి పనులు చేయటానికి పూర్తిగా మీకు సాధ్యమైనంత వరకు ప్రయత్నించవలెను మరియు ఆనందంగా ఉండవలెను. కేవలం తమ పనుల, ఆచరణల ఆధారంగా ఎవ్వరూ స్వర్గంలో ప్రవేశించలేరు."

ఆయన సహచరులు ఇలా ప్రశ్నించారు "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! మీరు కూడానా?" ఆయన ఇలా జవాబిచ్చారు "అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు దయాదాక్షిణ్యాలు లేకుండా నేను కూడా ప్రవేశించలేను, *Sahih Muslim,* vol. 4, p. 1473, no. 6765. మరియు జ్ఞాపకం ఉంచుకోండి, చిన్నవైనా, ఎడతెగకుండా చేసే పనులే అల్లాహ్ కు అత్యంత ఇష్టమైనవి."*Sahih Muslim,* vol. 4, pp. 1473-4, no. 6770,

ఏదేమైనా అల్లాహ్ యొక్క దయ ధర్మబద్ధమైనది. హేతుబద్ధమైనది. అది సరైన విశ్వాసం మరియు సత్కార్యాలు - రెండింటి పై ఆధారపడి ఉంటుంది. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఎవడు ఒక సత్కార్యం చేస్తాడో, అతనికి దానికి పదిరెట్లు ప్రతిఫలం ఉంటుంది. మరియు ఎవడు ఒక పాపకార్యం చేస్తాడో, అతనికి దానంతటి శిక్షయే ఉంటుంది మరియు వారికెలాంటి అన్యాయం జరుగదు" [Quran, 6:160]

ఒకవేళ అల్లాహ్ మానవుల యొక్క లెక్కలను కచ్చితంగా తీసుకున్నట్లయితే, ఏ ఒక్కరి మంచి పనులూ, వారి చెడుపనులను మించి తూగవు. ఏదేమైనా, అల్లాహ్ తన అపారమైన దయ వలన మన చెడు పనుల విలువను హెచ్చుతగ్గులు చేయక అలాగే ఉంచి, మంచి పనుల విలువను మాత్రం అనేక రెట్లు పెంచుతున్నాడు. అల్లాహ్ యొక్క దయ వలన నిజమైన విశ్వాసులు స్వర్గంలోనికి ప్రవేశిస్తారు. అంటే మంచి పనుల వలన ఎటువంటి ప్రయోజనమూ లేదని దీని అర్థం కాదు. ఆచరణలకు ఉన్నతమైన స్థానం తప్పక ఉన్నది, కాని కేవలం అవి మాత్రమే నిర్ణయాత్మకమైన స్థానానికి చేర్చలేవు. అల్లాహ్ యొక్క దయ వాటిని అధిగమిస్తుంది.

అంటే, మానవజాతి సృష్టి మరియు వారు చేసే తప్పొప్పులు మొదలైనవి అల్లాహ్ యొక్క దయాదాక్షిణ్యాల, కరుణాకటాక్షాల, న్యాయబద్ధతల ప్రాధాన్యతను అర్థం చేసుకోవటానికి వీలుకల్పిస్తున్న పరిస్థితులు.

అల్లాహ్ ఈ విధంగా తన దివ్యగుణాలను బహిర్గతమవటాన్ని ఎందుకు ఎన్నుకున్నాడని మానవజాతి ప్రశ్నించకూడదు. ఇది మాత్రమే ఉత్తమమైన పద్ధతని భావించాలి. ఎందుకంటే, అల్లాహ్ స్వయంగా తనే అత్యంత వివేకవంతుడు మరియు అత్యంత జ్ఞానవంతుడని ప్రకటించి ఉన్నాడు. అల్లాహ్ తెలియ జేయాలని ఎన్నుకుని, మానవజాతి వైపుకు పంపిన దానిని మాత్రమే మానవులు అర్థం చేసుకోగలరు.

"ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమునూ వారు గ్రహించజాలరు." [Quran, 2:255]

ఆ విధంగా, వారు తమను తాము అల్లాహ్ తో సరిసమానం చేసుకోవటానికి ప్రయత్నించకూడదు. ఒకవేళ అల్లాహ్ తాను ఎందుకు అలా చేయాలని నిర్ణయించుకున్నాడో మానవులకు తెలయజేయాలని అనుకుంటే, ఆయన నిర్ణయాన్ని ప్రశ్నించే పని మానవులది కాదు. అలాంటి ప్రశ్నలకు అంతం ఉండదు. కాబట్టి అవి మానవుల శక్తిసామర్థ్యాలకు, ఊహలకు అందనివి. తీర్పుదినాన మానవులే తమ యొక్క సంకల్పాల గురించి, పలుకుల గురించి మరియు ఆచరణల ప్రశ్నించబడతారు. అంతేగాని ఆయన ప్రశ్నించబడడు. ఖుర్ఆన్ లో ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: "తాను చేసేదానిని గురించి ఆయన(అల్లాహ్) ప్రశ్నించబడడు,కాని వారు ప్రశ్నించబడతారు" [Quran, 21:23]

అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు-
"అల్లాహ్ యొక్క సృష్టి వైపునకు దృష్టి సారించండి, పరిశీలించండి, పరిశోధించండి కాని అల్లాహ్ వైపునకు కాదు." *Silsilah alAhaadeeth asSaheehah*, vol. 4, p. 12, no. 1788. మరొక హదీథ్ లో అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా కూడా ఇదే విషయాన్ని ఉల్లేఖించారు. Tabaraanee in *alAwsat* and alBayhaqee in *Shu ıab alEemaan.*

అల్లాహ్ యొక్క వాస్తవాలపై పరిశోధించటం అంటే అపరిమితమైన, హద్దులులేని దానిపై దృష్టి సారించటం అన్నమాట. మరియు, సృష్టించబడిన సృష్టితాలలోని పరిమితమైన విశ్వం గురించి, నక్షత్రాల గురించి, గ్యాలెక్సీల గురించి పరిశోధించటానికే మన ఆలోచనా శక్తి సరిపోవటం లేదు. మరి అటువంటప్పుడు సృష్టించబడని వాటి కనీస దరిదాపుల గురించి ఆలోచించటానికి కూడా మన మెదడు యొక్క శక్తియుక్తులు సరిపోవు.

జవాబు లభించని అల్లాహ్ గురించిన ప్రశ్నలను దైవవిశ్వాసుల హృదయాలలో సైతాను కలిగిస్తుంటాడని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హెచ్చరించి ఉన్నారు. అబు హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు "మీలో ప్రతి ఒక్కరి వద్దకు సైతాను వచ్చి ఇలా ప్రశ్నించటం మొదలు పెడతాడు: 'ఫలానా దానిని మరియు ఫలానా దీనిని ఎవరు సృష్టించారు?' అలా ప్రశ్నిస్తూ, ప్రశ్నిస్తూ, చివరిగా సైతాను ఇలా అడుగుతాడు: 'నీ ప్రభువును ఎవరు సృష్టించారు?' కాబట్టి ఎప్పుడైతే సైతాను అలాంటి ప్రశ్నలు అడగటం మొదలుపెడతాడో, వెంటనే అల్లాహ్ యొక్క శరణు వేడుకోవలెను (అప్పుడు ఇలా దృఢంగా పలకవలెను: అల్లాహ్ పై మరియు ఆయన ప్రవక్తలపై నా యొక్క విశ్వాసాన్ని ధృవీకరిస్తున్నాను]Sahih Muslim, vol.1, p.77, nos. 242 &243. ఇంకా అలాంటి ఆలోచనలను నివారించ వలెను. Sahih Muslim, vol.1, p.77, no.244 & Sahih Al Bukhari, vol.4,p320,no.496.

# సృష్టికర్త మానవజాతిని ఎందుకు సృష్టించాడు?

మానవ దృష్టికోణం నుండి "మానవుడిని సృష్టికర్త ఎందుకు సృష్టించాడు?" అనే ప్రశ్ననే మరొక విధంగా "ఏ ప్రయోజనం కోసం మానవుడు సృష్టింపబడినాడు?" అని అడగ వచ్చును. అంతిమ సందేశంలో ఈ ప్రశ్నకు ఎటువంటి సందేహాలకు తావివ్వని చాలా స్పష్టమైన జవాబు ఇవ్వబడినది. ప్రతి మానవుడు సృష్టికర్త గురించిన జ్ఞానంతో, స్పృహతో జన్మిస్తాడని ముందుగానే మానవులకు సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ తెలియజేసెను. ఈ విషయం గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"(జ్ఞాపకం చేసుకోండి!) నీ ప్రభువు ఆదమ్ సంతతివారి వీపులనుండి వారి సంతానాన్ని తీసి, వారికి వారినే సాక్షులుగా నిలబెట్టి:''ఏమీ? నేను మీ ప్రభువు ను కానా?'' అని అడుగగా! వారు: ''అవును! (నీవే మా ప్రభువని) మేము సాక్ష్యమిస్తున్నాము.'' అని జవాబిచ్చారు.(స'హీ'హ్ బు'ఖారీ, కితాబుల్ జనాయ''జ్, మరియు ముస్లిం, కితాబుల్ ఖద్ర్:''ప్రతి బిడ్డ సహజ స్వభావంతో పుడ్తాడు, అంటే అల్లాహ్ కు విధేయతతో. కానీ, అతని తల్లిదండ్రులు అతనిని యూదుడు, క్రైస్తవుడు, మజూసి లేక ఇతర ధర్మం వాడిగా మార్చుతారు) తీర్పుదినమున మీరు: ''నిశ్చయంగా, మేము దీనిని ఎరుగము.'' అని అనగూడదని. లేక: ''వాస్తవానికి ఇంతకు పూర్వం మా తాతముత్తాతలు అల్లాహ్‌కు సాటి (భాగస్వాములు) కల్పించారు. మేము వారి తరువాత వచ్చిన, వారి సంతతివారం (కాబట్టి వారిని అనుసరించాము). అయితే? ఆ అసత్యవాదులు చేసిన కర్మలకు నీవు మమ్మల్ని నశింపజేస్తావా?'' అని అనగూడదని'' [Quran, 7:172-3]

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా వివరించారు - అల్లాహ్ ఆదం అలైహిస్సలాం ను సృష్టించి, ఆయన నుండి నో'మాన్ అనే చోట 12వ నెల, 9వ తేదీన(అరాఫాత్ దినం) వాగ్దానం తీసుకున్నాడు. ఆ తర్వాత సృష్టికర్త ఆయన నుండి జన్మించబోయే తరతరాల మొత్తం

సంతతి యొక్క ఆత్మలను బయటికి తీసి, తన ముందు సమావేశ పరచి, వారి నుండి కూడా వాగ్దానం తీసుకున్నాడు. ఆ ఆత్మలతో ఆయన ముఖాముఖి మాట్లాడినాడు. తనే వారి యొక్క ప్రభువనే వారి అంగీకారానికి వారినే సాక్ష్యంగా ప్రకటించినాడు.( *Silsilah al Ahaadeeth as Saheehah*, vol. 4, p. 158, no. 1623.) పర్యవసానంగా, ప్రతి ఆత్మపై ముద్రింప బడి ఉన్న దైవ విశ్వాసానికి అంటే అల్లాహ్ పై తన యొక్క విశ్వాసానికి ప్రతి మానవుడు స్వయంగా బాధ్యుడవు తున్నాడు. ఈ యొక్క జన్మత: పుట్టుకతో సహజంగా గ్రహించే మానవజాతి సృష్టి యొక్క ఉద్దేశ్యపు నిర్వచనం గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు:

"నేను జిన్నాతులను మరియు మానవులను సృష్టించింది, కేవలం వారు నన్ను ఆరాధించటానికే!" **[Quran, 51:56]**

[అదృశ్య రూపంలో ఉండే జిన్నాతులను అల్లాహ్ అగ్నిమూలకాలతో సృష్టించినాడు. మానవజాతి వలెనే వారికి కూడా మంచి చెడు ఎన్నుకునే స్వేచ్ఛను ఇచ్చాడు. పర్యవసానంగా, వారిలో కొందరు ఉత్తములైన విశ్వాసులు మరియు ఇంకొందరు చెడునడత గలిగిన అవిశ్వాసులు. వారిలోని దుష్టులు సాధారణంగా రాక్షసులు, దుష్టశక్తులు, దయ్యాలు మొదలైన పేర్లతో పిలవ బడుతున్నారు.]

ఆ విధంగా, అల్లాహ్ ను ఆరాధించటమనే ముఖ్యోద్దేశ్యంతోనే మానవులు సృష్టించబడినారు. కాని అల్లాహ్ కు మానవుల ఆరాధన యొక్క అవసరం లేదు. ఆయన తన అవసరాలను పూర్తి చేసుకోవటం కోసం మానవులను సృష్టించలేదు. ఒక్క మానవుడు కూడా ఆయనను ఆరాధించకపోయినా, ఆయన యొక్క మహోన్నత స్థానానికి ఎటువంటి హాని కలగదు. అలాగే, ప్రతి ఒక్క మానవుడు ఆయనను ఆరాధించినా, ఆయన యొక్క మహోన్నత స్థానానికి ఎటువంటి లాభమూ చేకూరదు. ఆయన సంపూర్ణుడు. కేవలం ఆయన మాత్రమే ఎటువంటి అవసరాలు లేకుండా ఉనికిలో ఉన్నాడు. సృష్టించబడిన వాటన్నింటికీ అవసరాలు ఉన్నాయి.కాబట్టి, మానవజాతికే ఆయనను ఆరాధించే అవసరం ఉన్నది.

## ఆరాధన యొక్క అర్థం The Meaning of Worship

మానవుల ఆరాధన యొక్క ఆవశ్యకతను అర్థం చేసుకోవాలంటే ఎవరైనా ముందుగా 'ఆరాధన' అనే పదం యొక్క అర్థాన్ని తప్పని సరిగా తెలుసుకోవలెను. ఆరాధన అంటే గౌరవించటం, 'ఏదైనా ఆరాధ్యుడిని గౌరవించటం కోసం ఆచరించే భక్తిపరమైన కార్యములు.' ఈ అర్థం ప్రకారం, ఆయనను స్తుతించటం ద్వారా సృష్టికర్తకు భయభక్తులు చూపమని మానవులకు ఆజ్ఞాపించబడినది. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు"[Quran 110:3]

సృష్టికర్తను స్తుతించటం ద్వారా, ప్రకృతి సహజంగా సృష్టికర్తనే స్తుతిస్తున్న ఇతర సృష్టితాలతో సామరస్యం చూపటాన్ని మానవుడు ఎన్నుకుంటున్నాడు. అల్లాహ్ ఈ పద్ధతిని ఖుర్ఆన్ లో అనేకచోట్ల ప్రస్తావించినాడు. ఉదాహరణకు:

"సప్తాకాశాలు, భూమి మరియు వాటిలో ఉన్న సమస్తమూ ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయన పవిత్రతను కొనియాడనిది, ఆయన స్తోత్రం చేయనటువంటిది ఏదీ లేదు, కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. (మెరుపులు 13:13, రాత్రింబవళ్ళు 21:20 మరియు పర్వతాలు 38:18 ఆయనను స్తుతిస్తున్నట్లు) నిశ్చయంగా, ఆయన ఎంతో సహనశీలుడు, క్షమాశీలుడు."
[Quran, 17:44]

అంతిమ దివ్యసందేశం అవతరించిన అరబీ భాషలోఆరాధనను ఇబాదాహ్ అంటారు. అబ్ద్ అంటే దాసుడు అనే పదానికి ఇబాదాహ్ అనే పదం చాలా దగ్గరగా ఉన్నది. తన యజమాని కోరిన ప్రతి పనినీ దాసుడు పూర్తిచేస్తాడని భావిస్తాము.

పర్యవసానంగా, అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ ప్రకారం ఆరాధన అంటే 'విధేయతపూర్వకంగా భయభక్తులతో అల్లాహ్ యొక్క

అభీష్టానికి సమర్పించుకోవటం' ఇదే సృష్టికర్త పంపిన అందరు ప్రవక్తల సందేశపు అసలు భావం. ఉదాహరణకు, ఆరాధన యొక్క ఈ అర్థాన్నే, ప్రత్యేకంగా గోస్పెల్ లో ప్రవక్త జీసస్ అలైహిస్సలాం ఇలా తెలిపారు "ప్రభువా ప్రభువా యని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును." మత్తయి 7:21

ఇక్కడ చిత్తప్రకారం అంటే ఏవైతే సృష్టికర్త మానవులు చేయాలని అభిలషిస్తున్నాడో అవన్నీ. ఎందుకంటే, సృష్టికర్త ఇష్టం, అనుమతి లేకుండా సృష్టిలో ఏదీ సంభవించదు, జరుగదు. సృష్టికర్త యొక్క ఇష్టాయిష్టాలు తన ప్రవక్తల ద్వారా పంపిన దివ్యసందేశాలలో ఆయన ప్రకటించెను. వాటినే ప్రవక్తలు తమ తమ సహచరులకు ఉపదేశించారు. ఫలితంగా, దివ్యసందేశానికి విధేయత చూపటమే ఆరాధన యొక్క పునాది. ఈ భావం ప్రకారం, ఆయనను స్తుతించటానికి సంబంధించిన ఆదేశాలను అనుసరించటం వలన సృష్టికర్తను స్తుతించటం కూడా ఆరాధనగా గుర్తింపబడును.

## ఆరాధన యొక్క ఆవశ్యకత The Need for Worship

ఎందుకు మానవులు సృష్టికర్త యొక్క దివ్యాజ్ఞలను విధేయతగా పాటిస్తూ, ఆయనను ఆరాధించవలెను మరియు స్తుతించవలెను? ఇది ఎందుకంటే, దివ్యాజ్ఞలకు విధేయత చూపటమే మానవుడి ప్రస్తుత జీవితపు మరియు రాబోయే పరలోక జీవిత సాఫల్యపు ద్వారానికి తాళం చెవి లాంటిది. ఆది దంపతులు ఆదం అలైహిస్సలాం మరియు ఈవ్ లు స్వర్గంలో సృష్టించబడినారు. తర్వాత దివ్యాజ్ఞలను ఉల్లఘించటం వలన స్వర్గంలో నుండి బహిష్కరించబడినారు. స్వర్గంలో తిరిగి ప్రవేశించ టానికి ఉన్న ఏకైక మార్గం - దివ్యాజ్ఞలను విధేయతగా పాటించటమే. జీసస్ అలైహిస్సలాం (మెస్సయ్యా) గోస్పెల్ లో ఇదే విషయాన్ని అంటే దివ్యాజ్ఞలకు విధేయత చూపటమే స్వర్గద్వారానికి తాళమని

బోధించెను: ఒక వ్యక్తి యేసు దగ్గరకు వచ్చి, "బోధకుడా, నిత్యజీవం పొందాలంటే నేను ఏ మంచి పని చెయ్యాలి?" అని అడిగాడు. యేసు,"మంచిని గురించి నన్నెందుకు అడుగుతున్నావు? ఒకే ఒక మంచి వాడున్నాడు,అతడే దేవుడు.కాబట్టి నీవు నిత్యజీవం పొందాలంటే ఆయన ఆజ్ఞల్ని పాటించు ." మత్తయి 19:16-17

ఇంకో చోట జీసస్ అల్లైహిస్సలాం దివ్యాజ్ఞలకు తప్పని సరిగా విధేయత చూపమని ఇలా ఉపదేశించెను "ఒక చిన్న ఆజ్ఞనైనా సరే రద్దు చేసిన వాడును, తనలాగే చెయ్యమని బోధించిన వాడును దేవుని రాజ్యంలో తక్కువ వాడుగా ఎంచబడతాడు. కాని ఈ ఆజ్ఞల్ని అనుసరిస్తూ వాటిని బోధించిన వాడు దేవుని రాజ్యంలో గొప్పవానిగా ఎంచబడతాడు." మత్తయి 5:19

దివ్యాజ్ఞలు మానవజీవితంలోని అన్ని దశలకూ మార్గదర్శకత్వం చూపుతున్నాయి. అవి మంచి చెడులను నిర్వచిస్తున్నాయి మరియు జీవన వ్యవహారాలన్నింటితో కూడిన సంపూర్ణ వ్యవస్థను మానవులకు అందజేస్తున్నాయి. తన సృష్టికి ఏది మంచిది, ఏది మంచిది కాదు అనే విషయం కేవలం సృష్టికర్తకు మాత్రమే తెలుసును. మానవ ఆత్మ, శరీరం మరియు సమాజపు సంరక్షణకు హాని కలిగించే ప్రతి చెడు పనినీ దివ్యాజ్ఞలు నిషేధిస్తున్నాయి. తమ జీవితాన్ని సరైన పద్ధతిలో పరిపూర్ణం గా జీవించటానికి, మానవజాతి దివ్యాజ్ఞలకు విధేయత చూపుతూ సృష్టికర్తను ఆరాధించవలెను.

## సృష్టికర్తను ధ్యానించటం Remembrance of God

దివ్యాజ్ఞలలో తెలిపిన వివిధ ఆరాధనా పద్ధతులు మానవుడు ఎల్లప్పుడూ సృష్టికర్తను జ్ఞాపకం చేసుకుంటూ ఉండే విధంగా రచించ బడినాయి. అత్యంత ముఖ్యమైన విషయాలను కూడా మానవులు ఒక్కోసారి మరచిపోవటం సహజమైన విషయం. మానవులు తరచుగా

తమ భౌతిక అవసరాలను పూర్తి చేసుకోవటంలో నిమగ్నమైపోయి, ఆధ్యాత్మిక అవసరాలను కూడా పూర్తిచేసుకోవాలనే విషయాన్ని అస్సలు మరచి పోతున్నారు. నిజమైన దైవవిశ్వాసి యొక్క దినచర్యలను క్రమపరచటానికి, నిత్య ప్రార్థనలు (ప్రతి రోజు ఐదు సార్లు చేసే నమాజులు) ఆజ్ఞాపించబడినాయి. ఇది రోజువారీ జీవితం ఆధారంగా ఆధ్యాత్మిక మరియు భౌతిక అవసరాలను మిళితం చేస్తున్నది. ప్రతి రోజు అవసరమయ్యే భుజించటం, పనిచేయటం మరియు నిద్రపోవటం అనే పనులను ప్రతిరోజు అవసరమయ్యే సృష్టికర్తతో మానవవుడి సంబంధాల పునర్జీవంతో ముడివేయటం జరిగినది. రోజువారీ ప్రార్థనల (నమాజుల) గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"నిశ్చయంగా, నేనే అల్లాహ్‌ను! నేను తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు, కావున నన్నే ఆరాధించు మరియు నన్ను స్మరించడానికి నమాజ్‌ను స్థాపించు." [Quran, 20:14]

ఉపవాసం గురించి దివ్యఖుర్ఆన్ లోని రెండవ అధ్యాయమైన అల్ బఖరాహ్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఓ విశ్వాసులారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది - ఏ విధంగానైతే మీ పూర్వీకులకు విధిగా నిర్ణయించబడి ఉండెనో - బహుశా మీరు దైవభీతిపరులై ఉంటారని!" [Quran, 2:183]

సృష్టికర్తను సాధ్యమైనంత అధికంగా జ్ఞాపకం చేస్తూ ఉండాలని విశ్వాసులను ప్రోత్సహించబడినది. సృష్టికర్త యొక్క ధ్యానంలో తప్ప, జీవితపు అన్ని ఆచరణలలో అది ఆధ్యాత్మికమైనది అయినా లేక భౌతికమైనది అయినా సరే, మధ్యేమార్గాన్ని అనుసరించమని దివ్యాజ్ఞలు ప్రోత్సహిస్తున్నాయి. సృష్టికర్తను మరీ విపరీతంగా జ్ఞాపకం చేయటం దాదాపు అసాధ్యమైన పని. కాబట్టి, తన అంతిమ సందేశంలో విశ్వాసులను సాధ్యమైనంత తరచుగా ధ్యానం చేయమని సృష్టికర్త ప్రోత్సహిస్తున్నాడు.:

"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌ను (ఏకాగ్రచిత్తంతో) అత్యధికంగా స్మరించండి." [Quran, 33:41]

సృష్టికర్తను మరచిపోయినప్పుడే పాపాలు జరుగును అనే వాస్తవం కారణంగా సృష్టికర్త ధ్యానాన్ని తరచుగా చేయమని స్పష్టంగా ఆజ్ఞాపించబడినది. దైవభక్తి, భయం పోగొట్టుకున్నప్పుడే, దుష్టశక్తులు విచ్చలవిడిగా, సులభంగా మనపై దండయాత్ర చేస్తాయి. ఫలితంగా సృష్టికర్తనే మరపింపజేసే అసమంజసమైన భావాలతో మరియు కోరికలతో మన ఆలోచనలను దారి తప్పించటానికి సైతాను అనుచరగణం ప్రయత్నిస్తుంటాయి. ఒక్కసారి గనుక సృష్టికర్తను మరచిపోతే, ప్రజలు సులభంగా, మనస్ఫూర్తిగా అరాచక శక్తులతో కలసిపోగలరు. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ ఇలా సంబోధిస్తున్నది:

"షైతాన్ వారిపై ప్రాబల్యం పొందినందు వలన వారిని అల్లాహ్ ధ్యానం నుండి మరపింపజేశాడు. అలాంటి వారు షైతాన్ పక్షానికి చెందినవారు. జాగ్రత్త! షైతాన్ పక్షానికి చెందినవారు, వారే! నిశ్చయంగా నష్టపోయే వారు." [Quran, 58:19]

దివ్యాజ్ఞల ద్వారా సృష్టికర్త మత్తుపదార్థాలను మరియు జూదాన్ని నిషేధించినాడు. దీనికి కారణం అవి సృష్టికర్తను మానవుడు మరచి పోయేటట్లు చేస్తాయి. డ్రగ్స్ మరియు జూదాల వంటి దురలవాట్లకు మానవ మెదడు మరియు శరీరం తేలికగా అలవాటు పడిపోతుంది. అలా ఒక్కసారి అలవాటైన తర్వాత, వాటినే అంటిపెట్టుకోవాలనే మానవ కోరికలు వారిని, దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ఇలా ప్రకటిస్తున్నాడు:

"నిశ్చయంగా, షైతాన్ మద్యపానం మరియు జూదం ద్వారా మీ మధ్య విరోధాలు మరియు విద్వేషాలు రేకెత్తించాలని మరియు మిమ్మల్ని అల్లాహ్ ధ్యానం నుండి మరియు నమాజ్ నుండి తొలగించాలని కోరుతున్నాడు. అయితే మీరిప్పుడైనా మానుకోరా?" [Quran, 5:91]

కాబట్టి, మానవజాతి తమ ముక్తిమోక్షాల కొరకు మరియు పెంపుదల కొరకు తప్పక సృష్టికర్తను జ్ఞాపకం చేస్తుండవలెను. ప్రతి మానవుడిలోనూ కొన్ని బలహీన సమయసందర్భాలు ఉంటాయి. అటువంటి పరిస్థితిలో వారు పాపాలు చేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఒకవేళ సృష్టికర్తను జ్ఞాపకం చేసుకునే పద్ధతులు, విధానాలు లేకపోయినట్లయితే, చేసే ప్రతి పాపపు పనితో వారు ఇంకా లోతుగా అక్రమాల ఊబిలోనికి చొచ్చుకునిపోయి ఉండేవారు. దివ్యాజ్ఞల ద్వారా సృష్టికర్త మానవులను అటువంటి అజ్ఞాన పరిస్థితి నుండి కాపాడినాడు. కాబట్టి, ఎవరైతే దివ్యాజ్ఞలను అనుసరిస్తారో, వారు అనుక్షణం సృష్టికర్తను జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. ఆ పవిత్ర ధ్యానమే వారికి పాపాల నుండి ప్రాయశ్చితం వేడుకోవటానికి మరియు తమను తాము సరిదిద్దు కోవటానికి అవకాశం ఇస్తుంది. ఇదే విషయాన్ని అంతిమ దివ్యగ్రంథం ఇలా ప్రకటిస్తున్నది:

"మరియు వారు, ఎవరైతే, అశ్లీల పనులు చేసినా, లేదా తమకు తాము అన్యాయం చేసుకున్నా, అల్లాహ్‌ను స్మరించి తమ పాపాలకు క్షమాపణ వేడుకుంటారో! మరియు అల్లాహ్ తప్ప, పాపాలను క్షమించగలవారు ఇతరులు ఎవరున్నారు?..." [Quran, 3:135]

## ఇస్లాం ధర్మం The Religion of Islam

ఈనాడు మానవజాతి కోసం అందుబాటులో ఉన్న సంపూర్ణ ఆరాధనా పద్ధతి ఇస్లాం ధర్మంలో కనుగొనబడినది. 'ఇస్లాం' అనే పదానికి అసలు అర్థం 'సృష్టికర్త యొక్క అభీష్టానికి విధేయతాపూర్వకంగా, శాంతియుతంగా సమర్పించుకోవటం'. మూడు ఏకదైవత్వ ధర్మాలలో ఇది మూడోది అని ప్రస్తావించబడుతున్నప్పటికీ, ఇస్లాం ధర్మం నూతనమైనది కాదు. ఇది ప్రవక్తలందరూ మొత్తం మానవజాతి కోసం తీసుకు వచ్చిన ధర్మం.

అబ్రహాం, మోసెస్ మరియు జీసస్ అలైహిస్సలాంల యొక్క ధర్మం కేవలం ఇస్లాం మాత్రమే. అల్లాహ్ ఈ విషయాన్నే ప్రవక్త అబ్రహాం అలైహిస్సలాంను సంబోధించి ఇలా పలుకు తున్నాడు:

"ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు ('హనీఫ్), అల్లాహ్‌కు విధేయుడు (ముస్లిం) మరియు అతడు ఏ మాత్రం (అల్లాహ్‌కు) సాటి కల్పించేవాడు (ముష్రిక్) కాడు." [Quran, 3:67]

సృష్టికర్త ఒక్కడే మరియు మానవజాతి ఒక్కటే కాబట్టి మానవజాతి కోసం సృష్టికర్త పంపిన ధర్మం కూడా ఒక్కటే. ఒక ధర్మం యూదుల కోసం, ఇంకో ధర్మం భారతీయుల కోసం, ఇంకో ధర్మం ఐరోపా వాసుల కోసం అలా వేర్వేరు ప్రజల కోసం వేర్వేరు ధర్మాలను ఆయన పంపలేదు. మానవుల ఆధ్యాత్మిక మరియు సామాజిక అవసరాలు సమానమైనవే. ఇంకా, ఆదిదంపతుల సృష్టికాలం నుండి నేటి వరకు మానవుడి సహజత్వంలో ఎటువంటి మార్పూ లేదు. కాబట్టి, ఇస్లాం ధర్మానికి బదులుగా వేరే ఇతర ఏ ధర్మమూ సృష్టికర్త స్వీకరణకు యోగ్యమైనది కాదు. తన అంతిమ సందేశంలో ఈ విషయాన్నే సృష్టికర్త ఇలా స్పష్టం చేస్తున్నాడు:

"నిశ్చయంగా, అల్లాహ్‌కు సమ్మతమైన ధర్మం కేవలం అల్లాహ్‌కు విధేయులవటం (ఇస్లాం) మాత్రమే." [Quran, 3:19]

"మరియు ఎవడైనా అల్లాహ్‌కు విధేయత (ఇస్లాం) తప్ప ఇతర ధర్మాన్ని అవలంబించగోరితే అది ఏ మాత్రమూ స్వీకరించబడదు మరియు అతడు పరలోకంలో నష్టపడేవారిలో చేరుతాడు." [Quran, 3:85]

## ప్రతి పనీ ఆరాధనయే Every Act Is Worship

ఇస్లామీయ జీవన విధానంలో మానవుడి ప్రతి ఆచరణా, పనీ, కార్యమూ ఆరాధనగా రూపాంతరం చెందే అవకాశం ఉన్నది. వాస్తవానికి,

తమ మొత్తం జీవితాన్ని పూర్తిగా తనకే సమర్పించమని విశ్వాసులను అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఇలా అను: "నిశ్చయంగా, నా నమాజ్, నా బలి (ఖుర్బానీ), నా జీవితం మరియు నా మరణం, సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే!" " [Quran, 6:162]

కాని, ఏదైనా సమర్పణ అల్లాహ్ కు స్వీకారమైనది కావాలంటే ప్రతి ఆచరణా రెండు ముఖ్యషరతులను తప్పక పూర్తిచేయవలసిఉన్నది:

మొదటి షరతు; ఏ పనైనా చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ మెప్పుకోసమే చేయవలెను. అంతేగాని ఇతరుల పొగడ్తల కోసం లేక కీర్తి ప్రతిష్టల కోసం కాదు. విశ్వాసి ఏదైనా పని చేసేటప్పుడు, అది అల్లాహ్ ను జ్ఞాపకం చేసుకోవలెను మరియు అది అల్లాహ్ చే లేక అంతిమ సందేశహరుడైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చే నిషేధించిన పని కాకుండా జాగ్రత్త పడవలెను.

ఇలా మంచి పనులను ఆరాధనలుగా రూపాంతరం చెందటానికి వీలుగా, ప్రతి పని మొదలు పెట్టేటప్పుడు అది ఎంత చిన్నదైనా సరే కనీసం ఒక ప్రార్థన చేయవలెనని అల్లాహ్ తన అంతిమ సందేశహరుడైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను ఆదేశించారు. ఏ పరిస్థితులలోనైనా అర్థించ గలిగే అత్యంత చిన్న ప్రార్థన:

## బిస్మిల్లాహ్ - అల్లాహ్ పేరుతో,

ఇంకా వివిధ ప్రత్యేక సందర్భాల కోసం, కొన్ని ప్రత్యేక ప్రార్థనలు తెలుపబడినాయి. ఉదాహరణకు, ఎప్పుడైనా నూతన దుస్తులు ధరించినప్పుడు, క్రింది ప్రార్థన చేయమని తన సహచరులకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించినారు.:

“ఓ అల్లాహ్, సకల కృతజ్ఞతలు నీకే. నీవే నాకు ఈ దుస్తులను ప్రసాదించావు. వీటి ద్వారా కలిగే శుభాలు నాకు ప్రసాదించమని కోరుతున్నాను మరియు ఏ శుభాల కోసం ఇవి తయారుచేబడినవో ఆ శుభాలను నాకు ప్రసాదించమని కోరుతున్నాను. వీటి ద్వారా సంభవించ బోయే చెడు నుండి నీ శరణు కోరుతున్నాను మరియు ఏ చెడు కోసం ఇవి తయారు చేయబడినావో దాని నుండి నీ శరణు కోరుతున్నాను.”

*Sunan Abu Dawud,* vol. 3, p.1125, no. 4009 and authenticated in *Saheeh Sunan Abee Daawood,* vol. 2, p. 760, no. 3393.

రెండవ షరతు; ఏ పనైనా సరే అది సున్నహ్ (అంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరించిన పద్ధతి) ప్రకారం ఉండవలెను. ప్రవక్తలందరూ సృష్టికర్త ద్వారా మార్గదర్శకత్వం ప్రసాదింపబడినారు కాబట్టి, తమ తమ సహచరులను ప్రవక్తలందరూ తమనే అనుసరించమని బోధించినారు. వారు ఉపదేశించే వన్నీ, దివ్యమైన సత్యాదేశాలే. ఎవరైతే వారి విధానాన్ని అనుసరించారో మరియు సత్యాన్ని స్వీకరించారో అటువంటి వారే అపరిమితమైన స్వర్గ జీవితాన్ని పొందుతారు. ఇదే విషయాన్ని ప్రవక్త జీసస్ అలైహిస్సలాం గోస్పెల్ లో ఇలా ప్రకటించారు., యేసు “మార్గము, సత్యము, జీవము, నేనే! నా ద్వారా తప్ప తండ్రి దగ్గరకు ఎవ్వరూ రాలేరు.” యోహాను 14:6

అలాగే, అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నేలపై ఒక గీత గీసి, ఇలా పలికారు, “ఇది అల్లాహ్ యొక్క మార్గము” ఆ తర్వాత ఆయన ముందు గీసిన గీతకు కుడివైపు మరియు ఎడమ వైపు, దాని నుండి బయటకు వచ్చే అనేక గీతలు గీసి ఇలా పలికారు, “ఇవి అసత్యమార్గాలు. ప్రతి దానిపై ఒక సైతాను కూర్చొని ఉండి, దానినే అనుసరించమని ప్రజలను ఆహ్వానిస్తుంటాడు” ఆ తర్వాత ఆయన దివ్యఖుర్ఆన్ లోని ఈ వచనాన్ని పఠించారు: “నిశ్చయంగా, ఇది నా దారి, తిన్నగా సరైన మార్గదర్శకత్వం వహించేది, కాబట్టి దానిని అనుసరించండి. మరియు

ఇతర మార్గాలను అనుసరించకండి, అవి మిమ్మల్ని అల్లాహ్ యొక్క మార్గం నుండి దారి తప్పిస్తాయి. అల్లాహ్ విషయంలో జాగ్రత్త వహించటం కోసం, అది అల్లాహ్ పంపిన దివ్యాజ్ఞ. (6:153)" Collected by Ahmad, anNasaa'ee and ad Daarimee, and authenticated by Ahmad Shaakir in *alMusnad,* vol. 6, pp. 89-90, no. 4142.

కాబట్టి, ప్రవక్తలు చూపిన మార్గమే, సృష్టికర్త స్వీకరించే ఏకైక ఆరాధనా పద్ధతి. దానిని వదిలి ధర్మంలో నూతన పోకడలు, కల్పిత మార్గాలు కనిపెట్టడాన్ని అత్యంత ఘోరమైన పాపాలలో ఒకటిగా సృష్టికర్త ప్రకటిస్తున్నాడు. ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు "అన్నింటిలో అత్యంత ఘోరమైనది ధర్మం లో నూతన పోకడలు కనిపెట్టడం. ధర్మంలో కనిపెట్టబడిన ప్రతి నూతన పోకడ ఒక శాపం వంటిది, అది నరకం వైపునకు తీసుకుపోతుంది." *Sahih Muslim,* vol. 2, p. 410, no. 1885.

ధర్మంలో నూతన పోకడలు, కల్పిత మార్గాలు నిషేధించబడినవి. ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు. "నా ఉపదేశాలలో లేని, నూతన కల్పితాలను ఎవరైనా ధర్మంలో కనిపెట్టి నట్లయితే, అవి తిరస్కరించబడును" *Sahih Al Bukhari,* vol. 3, pp. 535-6, no. 861, and *Sahih Muslim,* vol. 3, p. 931, no. 4266.

మౌలికంగా ఇటువంటి నూతన కల్పితాలే పూర్వపు ప్రవక్తల దివ్యసందేశాలను చిన్నాభిన్నం చేశాయి మరియు నేడు ఉనికిలో ఉన్న అనేక అసత్యధర్మాల ఆవిర్భావానికి కారణమయ్యాయి. ఇటువంటి నూతన కల్పితాలను అరికట్టడానికి అనుసరించవలసిన సాధారణ నియమం ఏమిటంటే కేవలం సృష్టికర్త తన సందేశహరుల ద్వారా ప్రత్యేకంగా పంపిన ఆరాధనా పద్ధతులను తప్పించి, మిగిలిన వాటినన్నింటినీ పూర్తిగా నిషేధించవలెను.

## మహోన్నతమైన సృష్టి

ఎవరైతే ఏకైక ఆరాధ్యుడిని ఎటువంటి భాగస్వాములు మరియు సంతానం లేని వాడుగా విశ్వసించి, పైన తెలిపిన విధంగా మంచి పనులు చేస్తారో వారు సృష్టి మొత్తానికే కిరీటం గా గుర్తింపబడతారు. ఇంకా వారు సృష్టికర్త యొక్క అత్యుత్తమ సృష్టి గా మారే అవకాశం ఉన్నది. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసేవారు, వారే సృష్టిలో అందరి కంటే ఉత్కృష్ట జీవులు.." [Quran, 98:7]

## ఘోరాతి ఘోరమైన మహాపాపం The Gravest Sin

'సృష్టి యొక్క ఉద్దేశ్యంతో విభేదించటమనేది' మానవుడు చేయ గల అత్యంత ఘోరమైన మహాపాపం. ఒకసారి ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను "అల్లాహ్ దృష్టిలో అత్యంత ఘోరమైన పాపం ఏది?" అని అబ్దుల్లాహ్ రదియల్లాహు అన్హు ప్రశ్నించగా, వారిలా జవాబిచ్చినారు "అల్లాహ్ యే మీ సృష్టికర్త అయినప్పటికీ, ఆయనకు భాగస్వామం కల్పించటం(షిర్క్ చేయటం)" *Sahih Muslim,* vol.1, pp.50-1, no. 156.

సృష్టికర్తతో పాటు లేక సృష్టికర్తను వదిలి, ఇతరులను ఆరాధించటాన్ని అరబీ భాషలో షిర్క్ చేయటం అంటారు. కేవలం ఇది మాత్రమే ఎట్టి పరిస్థితిలోను, అస్సలు క్షమించబడని అత్యంత ఘోరమైన మహాపాపం. ఒకవేళ మానవుడు అటువంటి ఘోరమైన మహాపాపం నుండి పశ్చాత్తాప పడకుండా, క్షమాపణ కోరకుండా మరణించినట్లయితే, అల్లాహ్ వారి మిగిలిన పాపాలన్నింటినీ క్షమిస్తాడు గాని, షిర్క్ ను మాత్రం అస్సలు క్షమించడు. ఈ విషయమై అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

" నిశ్చయంగా, అల్లాహ్ తనకు భాగస్వామి(సాటి)ని కల్పించటాన్ని ఏ మాత్రమూ క్షమించడు. మరియు అది తప్ప దేనిని (ఏ పాపాన్ని) అయినా,

ఆయన తానుకోరిన వారిని క్షమిస్తాడు. మరియు అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించిన వాడే, వాస్తవానికి మహాపాపం చేసినవాడు!" [Quran, 4:48]

అల్లాహుత'ఆలాకు సాటి (భాగస్వాములను) కల్పించటం మహా దుర్మార్గం మరియు క్షమించరాని పాపం. కావున ఇది ఎంత మాత్రం క్షమించబడదు. ముష్రికులకు స్వర్గం నిషేధించబడింది. ఇంకా చూడండి, 31:13. నిశ్చయంగా, బహుదైవారాధన (షిర్క్) గొప్ప దుర్మార్గం, ('స'హీ'హ్ బు'ఖారీ, పుస్తకం-4, 'హదీస్', 551).

సృష్టికర్తను కాకుండా వేరే వాటిని ఆరాధించటం అంటే సృష్టికర్త యొక్క దివ్యగుణాలను, సృష్టితాలకు ఇస్తున్నామన్న మాట. దీనిని ప్రతి మతం, కులం తమకు తోచిన ప్రత్యేక పద్ధతులలో చేస్తున్నారు. అదరగొట్టే వాక్చాతుర్యం గల చాలా కొద్ది మంది ప్రజల గుంపు ప్రాచీన కాలం నుండి సృష్టికర్త ఉనికినే తిరస్కరిస్తున్నారు. [హీనయాన బౌద్ధత్వం (400-250 BC), బౌద్ధత్వంలో పురాతనమైన మరియు చాలా కఠినమైన విధానం. ఇది గౌతమ బుద్ధుడి మరణానంతరం ఉనికి లోనికి వచ్చినది. ఇది స్పష్టంగా సృష్టికర్తే లేడని ప్రకటిస్తున్నది. వర్ధమాన క్రమపరచిన జైన మతం కూడా సృష్టికర్త లేడనే ప్రకటిస్తున్నది. కాని దాని బోధనల ప్రకారం ముక్తి పొందిన ఆత్మలు అమరత్వాన్ని మరియు సర్వజ్ఞత్వాన్ని పొందుతాయని తెలుపబడినది. 19వ మరియు 20వ శతాబ్దాలలో "దేవుడి తాత్వికం మరణించినది" అనే ప్రకటనను అనేక మంది యూరోపా ఖండ తత్వవేత్తలు చాటిచెప్పారు. ఫిలిప్ మెయిన్లాండర్ Philipp Mainlander (1841-1876) అనే జర్మనీ తత్వవేత్త, ప్రష్యాకు చెందిన ఫ్రెడ్రిక్ నీట్జసచ్ Friedrich Nietzsche (1844-1900), ఫ్రాన్సుకు చెందిన జీన్ పాల్ సర్త్ర Jean Paul Sartre (1905-1980) మొదలైన వారందరూ సృష్టికర్త లేడని వాదించారు. (Dictionary of Philosophy and Religion, pp. 72, 262 3. 327 and 508-9).]

తమ సృష్టికర్త తిరస్కారాన్ని బలపరచు కోవటానికి వారు ఈ విశ్వప్రపంచానికి ఆరంభమనేదే లేదనే పిచ్చి వాదనలు చేయసాగారు. వారి వాదనలు అర్థం పర్థం లేనివి. ఎందుకంటే ప్రపంచంలో కనిపించే సృష్టి యొక్క ప్రతి భాగం ఏదో ఒక సమయంలో ఆరంభమైనదే. కాబట్టి ఆయా సమయాలను జమ చేస్తే వచ్చే మొత్తం కాలమే సృష్టి ఆరంభపు కాలమనే విషయం వాస్తవానికి దగ్గరలో ఉన్నది. సృష్టి ఉనికిలోనికి రావటానికి కారణభూతమైనది ఏదైనా సరే, అది సృష్టిలోని భాగమై ఉండదు మరియు దానికి ఆరంభం ఉండకూడదు అనే భావన కూడా

సహేతుకమైనదే. విశ్వానికి ఆరంభమే లేదని అంటే ఏ పదార్థం నుండైతే విశ్వం తయారైనదో, అది అమరమైనదని నాస్తికులు ప్రతిపాదించారు. ఏదీ లేనప్పుడు కూడా సృష్టికర్తే ఉన్నాడు అంటే సృష్టికర్తే ఆరంభం అనే దివ్యగుణాన్ని పై వాదనలు సృష్టికి ఇస్తున్నాయి. వీటిలో షిర్క్ బయట పడుతున్నది. అసలైన నాస్తికుల సంఖ్య చరిత్రలో చాలా తక్కువ. దీనికి కారణం పైకి సృష్టికర్త లేడని వాదిస్తున్నా, లోలోపల వారు సృష్టికర్త ఉన్నాడనే వాస్తవాన్ని ఖచ్చితంగా నమ్మేవారు. అంటే దశాబ్దాల కొద్దీ కమ్యూనిష్టు సిద్ధాంతం ప్రచారం చేయబడినా, రష్యన్ లలో మరియు చైనీయులలో అధికశాతం దేవుడిని నేటికీ నమ్ముతున్నారు. ఖుర్ఆన్ లో ఇదే విషయాన్ని అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"మరియు వారి హృదయాలు వాటిని అంగీకరించినా వారు అన్యాయంగా, అహంకారంతో తిరస్కరించారు." [27:14]

తమ కోరికలు, వాంఛలు, ఆశలు తీర్చుకోవటం తప్ప, ఈ ప్రాపంచిక జీవితానికి ఇంకా వేరే ఉద్దేశ్యమేమీ లేదనేది నాస్తికుల మరియు భౌతికవాదుల అభిప్రాయం. కాబట్టి, ఏకైక ఆరాధ్యుడైన సృష్టికర్త కాకుండా, తాము విధేయత చూపే మరియు స్వయంగా తమకు తాము సమర్పించుకునే వారి కోరికలు, వాంఛలు కూడా దైవంగా మారిపోయాయి. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఎవడు తన మనోవాంఛలను తనకు దైవంగా చేసుకొని ఉన్నాడో, అలాంటి వానిని నీవు చూశావా?" [25:43]

సృష్టికర్తతో పాటు అమరత్వాన్ని ప్రకటించి, క్రైస్తవులు ప్రవక్త జీసస్ అలైహిస్సలాం కు సృష్టికర్త యొక్క దివ్యగుణాలను కట్టబెట్టారు. ఆ తర్వాత వారు ఆయనను 'దేవుడి కుమారుడు' అని పిలవబడే దివ్య వ్యక్తిత్వాన్నిచ్చారు. [యోహాను 1:1&14 "సృష్టికి ముందు నుండి జీవం గల వాక్యం ఉండెను. ఆ వాక్యము దేవునితో ఉండెను. ఆ వాక్యమే దేవుడు. ఆయన సృష్టికి ముందు దేవునితో ఉండేవాడు. ఆయన ద్వారా అన్నీ సృష్టించబడ్డాయి.

సృష్టింపబడినదేదీ ఆయన లేకుండా సృష్టింపబడలేదు. ఆయన జీవానికి మూలం. ఆ జీవం మానవజాతికి వెలుగు నిచ్చెను. వెలుగు చీకట్లో వెలుగుతోంది. కాని చీకటి దాన్ని అర్థం చేసుకోలేదు. దేవుడు ఒక వ్యక్తిని పంపాడు. అతని పేరు యోహాను. తన ద్వారా మానవులు విశ్వసించాలని అతడు వెలుగును గురించి చెప్పటానికి వచ్చాడు. అతడు ఆ వెలుగు కాదు. ఆ వెలుగును గురించి చెప్పటానికి వచ్చిన సాక్షి మాత్రమే అతడు. ప్రతి ఒక్కరికి వెలుగునిచ్చే ఆ నిజమైన వెలుగు ప్రపంచం లోకి వస్తూ ఉన్నాడు. ఆయన ప్రపంచంలోకి వచ్చాడు. ఆయన ద్వారా ప్రపంచం సృష్టింపబడినా, ప్రపంచం ఆయన్ని గుర్తించలేదు. ఆయన తన స్వంత వాళ్ళ దగ్గరకు వచ్చాడు. కాని వాళ్ళాయనను ఒప్పుకోలేదు. అయినా, తనను ఒప్పుకున్న వాళ్ళందరికి, అంటే తనను నమ్మిన వాళ్ళకందరికి దేవుని సంతానమయ్యే హక్కును ఇచ్చాడు. కాని వీళ్ళు మానవుల రక్తం వలన కాని, శారీరక వాంఛల వల్ల కాని, మనుష్యుల నిర్ణయం వల్ల కాని, జన్మించలేదు. వీళ్ళు దేవుని సంతానం. ఆ జీవం గల వాక్యము మానవరూపం దాల్చి, మానవుల మధ్య జీవించాడు. ఆయనలో కృప, సత్యము సంపూర్ణంగా ఉన్నాయి. ఆయన తండ్రికి ఏకైక పుత్రుడు. కనుక ఆయనలో ప్రత్యేకమైన తేజస్సు ఉంది. ఆ తేజస్సును మేము చూసాము." (RSV).] ఇంకో వైపు హిందువులు అనేక యుగాలలో దేవుడే మానవుడిగా అవతరించాడని నమ్ముతున్నారు. వారు ఏకైక సృష్టికర్త దివ్యగుణాలను ముగ్గురు దేవుళ్ళలో విభజించారు - బ్రహ్మదేవుడిని సృష్టికర్తగా, విష్ణుదేవుడిని రక్షకుడిగా మరియు శివుడిని వినాశకారుడిగా ప్రత్యేకించారు.

## సృష్టికర్త యొక్క ప్రేమ Love of God

మానవులు తమ ప్రేమ, నమ్మకం, భయభక్తులను అల్లాహ్ పై కాకుండా సృష్టి పై చూపటం ద్వారా బహుదైవారాధన (షిర్క్) చేయటం ఆరంభిస్తున్నారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"అయినా ఈ మానవులలో కొందరు ఇతరులను, అల్లాహ్‌కు సాటిగా కల్పించుకుని, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమిస్తారు. కాని విశ్వాసులు అందరి కంటే అత్యధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు." [2:165]

ఎప్పుడైతే ఈ భావాలు మరియు ఇలాంటి ఇతర భావాలు దృఢంగా సృష్టి వైపునకు మరలుతాయో, అవి మానవుడిని ఇతరుల ప్రశంసల కోసం సృష్టికర్తకు అవిధేయుడిగా చేస్తాయి. కాని కేవలం అల్లాహ్ మాత్రమే మానవుల యొక్క సంపూర్ణ భావాల సమర్పణకు యోగ్యుడు మరియు అర్హుడు. కాబట్టి, మానవులు ఆయననే ప్రేమించ వలెను మరియు భయభక్తులు చూపవలెను. అనస్ ఇబ్నె మాలిక్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా బోధించారు.

"ఎవరైతే ఈ మూడు గుణాలు కలిగి ఉంటారో, వారు ఈమాన్ అంటే దైవవిశ్వాసం యొక్క మాధుర్యాన్ని రుచి చూస్తారు: అతడు అల్లాహ్ ను మరియు ఆయన సందేశహరుడిని అన్నింటి కంటే అధికంగా ప్రేమిస్తాడు; అతడు ఇతరులను కేవలం అల్లాహ్ యొక్క స్వీకరణ కోసమే ప్రేమిస్తాడు; మరియు అల్లాహ్ అతడికి దివ్యజ్ఞానం ప్రసాదించిన తర్వాత, అతడు తిరిగి అవిశ్వాసం వైపు మరలటాన్ని అగ్నిలో పడవేయటాన్ని అసహ్యించుకున్నట్లుగా అసహ్యించు కుంటాడు." Sahih Muslim, vol. 1, p. 30, no. 67.

మానవులు తోటి వారిని ప్రేమించటానికి లేక ఇతర సృష్టితాలను ప్రేమించటానికి గల మొత్తం కారణాలే, మానవులు సృష్టికర్తను ఆయన సృష్టి కంటే అధికంగా ప్రేమించటానికి కారణమగును. మానవులు జీవితాన్ని, సాఫల్యాన్ని ఇష్టపడతారు మరియు ప్రేమించుతారు. ఇంకా మరణాన్ని మరియు అపజయాన్ని ఇష్టపడరు మరియు ప్రేమించరు. అల్లాహ్ యే జీవితానికి మరియు సాఫల్యానికి అంతిమ మూలకారణం గనుక, ఆయన మానవుల సంపూర్ణ ప్రేమకు, భయభక్తులకు ఏకైక అర్హుడవుతున్నాడు. మానవులు తమకు అవసరం కలిగినప్పుడు లాభం కలిగించే మరియు సహాయసహకారాలు అందించే వారిని కూడా ప్రేమిస్తారు. అన్ని రకాల లాభాలు (7:188) మరియు సహాయం (3:126)

సృష్టికర్త నుండే వస్తుంది కాబట్టి సృష్టిలోని వాటన్నింటి కంటే అధికంగా ఆయనను ప్రేమించ వలెను.

"మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలచినా లెక్కించ జాలరు." [14:34]

ఏదేమైనా, సృష్టికర్త పై చూపవలసిన అత్యుత్తమ ప్రేమాభిమానాలు, మామూలుగా సృష్టిపై చూపించే ప్రేమాభిమానాలలోని భాగంగా కుదించకూడదు. ఎలాగైతే పశుపక్ష్యాదుల పై మానవులు చూపే ప్రేమ కంటే ఇతర మానవుల పై చూపే ప్రేమ అధికంగా ఉంటుందో, సృష్టికర్త పై చూపే ప్రేమ తోటి మానవులపై, ఇతర సృష్టితాల పై చూపే ప్రేమ కంటే లెక్కించ లేనంత అధికంగా ఉండవలెను. బిలియన్ల కొద్దీ డాలర్లు ఒకవైపు పశుపక్ష్యాదుల సంరక్షణ కొరకు వెచ్చిస్తున్నారు. అయితే మరో వైపు అధిక సంఖ్యలో మానవులు ఆకలి దప్పులతో మరియు వివిధ రోగాలతో మరణిస్తుంటే చూసీ చూడనట్లు ఉపేక్షిస్తున్నారు. ఇది 20వ శతాబ్దంలో జరుగుతున్న అత్యంత ఘోరమైన నేరాలలో ఒకటి।

మానవుడు సృష్టికర్త పై చూపే ప్రేమ, మౌలికంగా ఆయన ఆదేశాలను పూర్తి విధేయతతో పాటించడంలోనే ప్రదర్శితమగును. ఈ విషయం దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటింపబడినది.

"మీకు (నిజంగా) అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు." 3:31

ఇది ప్రగతి నిరోధక సిద్ధాంతం ఎంతమాత్రమూ కాదు. తోటివారిని ప్రేమించే మానవుడి ప్రేమలో కూడా విధేయత ఇమిడి ఉంటుంది. అంటే ఒకవేళ తను ప్రేమించే వ్యక్తి తనను ఏదైనా చేసి పెట్టమని కోరితే, వారిపై ఉన్న ప్రేమాభిమానాల స్థాయికి తగ్గట్టుగా, దానిని పూర్తి చేయటానికి మనం శాయశక్తులా ప్రయత్నిస్తాము.

అలాగే సృష్టికర్త పై ప్రేమా, ఎవరినైతే సృష్టికర్త స్వయంగా ప్రేమిస్తున్నాడో, వారి పై నా ప్రదర్శింప బడవలెను. ఎవరైతే సృష్టికర్తను

ప్రేమిస్తారు వారు సృష్టికర్త ప్రేమిస్తున్న వారిని అసహ్యించుకోవటం మరియు ఎవరినైతే సృష్టికర్త అసహ్యించు కుంటున్నాడో, అటువంటి వారిని ప్రేమించటం అనేది ఎట్టిపరిస్థితిలోను అస్సలు స్వీకరించబడని విషయం. అబు ఉమామాహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా బోధించారు,

"ఎవరైతే కేవలం అల్లాహ్ కోసం మాత్రమే ప్రేమిస్తాడో మరియు అల్లాహ్ కోసం మాత్రమే అసహ్యించు కుంటాడో, కేవలం అల్లాహ్ కోసం మాత్రమే దానం చేస్తాడో మరియు అల్లాహ్ కోసం మాత్రమే దానం చేయ కుండా ఆగిపోతాడో అతడు తన దైవవిశ్వాసాన్ని సంపూర్ణం చేసు కున్నాడు." *Abu Dawud,* vol. 3, p.1312, no 3664 & vol.3, p. 886, no.3915

కాబట్టి, ఎవరి దైవవిశ్వాసమైతే దృఢంగా ఉంటుందో వారు, సృష్టికర్తను ప్రేమిస్తున్న వారినందరినీ తప్పక ప్రేమిస్తారు. సృష్టికర్త పుణ్యపురుషుల పట్ల దైవవిశ్వాసుల హృదయాలలో ప్రేమను జనింప జేస్తాడని ఖుర్ఆన్ లోని మర్యం అధ్యాయంలో ఇలా ప్రకటింపబడెను.

"నిశ్చయంగా, విశ్వసించి సత్కార్యాలు చేసే వారికి అనంత కరుణా మయుడు హృదయాలలో ప్రేమను (వాత్సల్యాన్ని) కలుగజేస్తాడు." [19:96]

అబుహురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖన ప్రకారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ విషయమై ఇలా ఉపదేశించారు - "ఒకవేళ అల్లాహ్ కు ఎవరైనా దాసుడి పై ప్రేమ కలిగినట్లయితే, ఆయన తన దూత అయిన జిబ్రయీల్ అలైహిస్సలాం ను పిలిచి ఫలానా ఫలానా మానవుడిని తాను ప్రేమిస్తున్నానని, అతడిని కూడా ప్రేమించమని ఆదేశిస్తాడు. దీనితో జిబ్రయీల్ అలైహిస్సలాం కూడా ఆ వ్యక్తిని ప్రేమించటం మొదలుపెడతాడు. తర్వాత ఆ దైవదూత స్వర్గవాసులను పిలిచి: 'అల్లాహ్ ఫలానా మరియు ఫలానా వారిని ప్రేమిస్తున్నాడని, అందుకని ఆదైవదూతలను కూడా వారిని ప్రేమించమని తెలుపుతాడు' కాబట్టి, స్వర్గవాసులు కూడా వారిని ప్రేమించటం మొదలుపెడతారు. ఆ

తర్వాత భూలోకవాసుల హృదయాలలో కూడా వారి పట్ల ప్రేమాభి మానాలు జనింపజేయబడతాయి." *Sahih AlBukhari,* vol. 4, p. 291, no. 431, and *Sahih Muslim,* vol. 4, p. 1385, no. 6373.

## ఆరాధనలు

కేవలం సృష్టికర్త మాత్రమే ఆరాధనలకు సమాధానమిస్తాడు, కాబట్టి అన్ని రకాల ఆరాధనలు ఆయన దిక్కు వైపునకే ఉండవలెను. చిత్తశుద్ధితో పిలిచే ప్రతి పిలుపు తప్పక ఆయనకు చేరుతుంది.

"నా దాసులు, నన్ను గురించి నిన్ను అడిగితే: "నేను (వారికి) అతి సమీపం లోనే ఉన్నాను. పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును విని, జవాబిస్తాను." [2:186]

ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయం యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ ఇలా బోధించారు.

"ఒకవేళ మీరు ఆరాధనలలో ఏదైనా కోరుకోవాలనుకుంటే, కేవలం అల్లాహ్ ను మాత్రమే వేడుకోవలెను. మరియు ఒకవేళ మీరు సహాయం అడగాలనుకుంటే, కేవలం అల్లాహ్ నుండే సహాయం అర్థించవలెను." AtTirmithee, vol. 2, pp. 308-9, no. 2043. An Nawawi's Forty Hadith, p. 68, no. 19 and Mishkat AlMasabih, vol. 2, p. 1099.

కాబట్టి, మానవులకు చేసే ప్రార్థనలు, మరణించిన లేదా జీవించి ఉన్న మానవుల ద్వారా చేసే ప్రార్థనలు షిర్క్ లోని భాగమగును. ఎవరి వైపుకు అయితే ప్రార్థనలు ప్రత్యేకించబడినాయో, వారే ఆరాధనకు లక్ష్యమవుతున్నారు. అన్నోమాన్ ఇబ్నె బషీర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు. "అర్థించటం/వేడుకోవటమే ఆరాధన" *Sunan Abu Dawud,* vol. 1, p. 387, no. 1474 and *Abee Daawood,* vol. 1, p. 277. no. 1312.

" నిశ్చయంగా, మీరు అల్లాహ్‌ను విడిచి ఎవరినైతే పిలుస్తున్నారో, వారు కూడా మీలాంటి దాసులే!" [7:194]

కాబట్టి, కేథలిక్ క్రైస్తవులు వారి గురువులను పూజించటం కూడా షిర్క్. ఒకవేళ ఏదైనా పోగొట్టుకుంటే, దానిని కనుక్కోవటానికి దెబస్ లోని సెయింట్ అంథోనీను ప్రార్థించేవారు. *The World Book Encyclopedia,* vol. 1. p. 509.

సెయింట్ జూడ్ థడ్డాయిస్ దేనినైనా సరే రక్షించే సెయింట్ గా ప్రసిద్ధిగాంచెను. వివాహ బంధంలోని లేక వివాహ బంధం బయట, నయం కాని వ్యాధుల నుండి కాపాడటానికి కూడా ఆయన ప్రార్థించేవాడు. *The World Book Encyclopedia,* vol. 11, p. 146.

సెయింట్ క్రిష్టోఫర్ ప్రయాణికుల రక్షక సెయింట్ గా ప్రసిద్ధి చెందాడు. ఆయనను ప్రజలు రక్షణ కోసం ప్రార్థించేవారు. కాని 1969 లో సెయింట్ క్రిష్టోఫర్ పేరు వివిధ సెయింట్ ల పట్టికలో నుండి ముందస్తు ప్రకటన లేకుండానే పోప్ ఆజ్ఞాపత్రం ద్వారా తొలగించబడినది. దీనికి కారణం ఆయన యొక్క సంఘువ్యతిరేక కార్యకలాపాలు ధృవీకరింప బడటం. *The World Book Encyclopedia,* vol. 3, p. 417.

జీసస్ అలైహిస్సలాం తల్లి అయిన మేరీమాత కు చేసే పూజలు మరియు మైకెల్ అలైహిస్సలాం మొదలగు దైవదూతలకు చేసే పూజలు కూడా షిర్క్ (ఏకైక దైవారాధనకు వ్యతిరేకమే). [క్రైస్తవుల పండుగ అయిన సెయింట్ మైకెల్ పశ్చిమ చర్చిలలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29వ తేదీన జరుగును మరియు తూర్పు చర్చిలలో (ఆర్థోడాక్స్) నవంబరు 8వ తేదీన జరుగును. రోమన్ కేథలిక్ చర్చిలో, ఇది సెయింట్స్ మైకెల్, గాబ్రియాల్ మరియు రాఫెల్ దైవదూతల పండుగ గా జరుగును; ఆంగ్లికన్ చర్చిలలో సెయింట్ మైకెల్ మరియు దైవదూతలందరి పండుగగా జరుగును.(The New Encyclopaedia Britannica, vol. 8, p. 95)]

కొందరు క్రైస్తవులు సెయింట్ లను పూజించక పోయినా, జీసస్ అలైహిస్సలాం ను ఆయన పేరు మీద డైరక్టుగా లేక ఆయన ద్వారా

పూజిస్తూ షిర్క్ లో మునిగి ఉన్నారు. అలాగే, ఏ ముస్లిం అయినా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను పూజిస్తే, ఆరాధిస్తే షిర్క్ చేసినట్లే. ఈ విషయాన్ని తన సహచరులకు స్పష్టంగా తెలుపమని, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖుర్ఆన్ లో ఇలా ఆదేశించాడు.

"(ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: "అల్లాహ్ కోరితే తప్ప నా స్వయానికి నేను, లాభం గానీ, నష్టం గానీ చేసుకునే అధికారం నాకు లేదు. నాకు అగోచర విషయ జ్ఞానం ఉండి ఉన్నట్లైతే నేను లాభం కలిగించే విషయాలను నా కొరకు అధికంగా సమకూర్చుకునేవాడిని. మరియు నాకు ఎన్నడూ ఏ నష్టం కలిగేది కాదు. నేను విశ్వసించే వారికి కేవలం హెచ్చరిక చేసేవాడను మరియు శుభవార్త నిచ్చే వాడను మాత్రమే!" [7:188]

అబూ హురైరా రదియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించినారు - ఎప్పుడైతే "మరియు నీ దగ్గరి బంధువులను హెచ్చరించు," 26: 214 అనే వచనం ఖుర్ఆన్ లో అవతరించగానే, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన బంధువులతో ఇలాపలికారు: "ఓ ఖురైష్ ప్రజలారా, అల్లాహ్ శుభాసీస్సుల దీవెనలను(మంచి పనులు చేయటం ద్వారా) దృఢపరచుకోండి. అల్లాహ్ కు వ్యతిరేకంగా నేను మీకు ఎటువంటి సహాయసహాకారాలు అందించలేను ...ముహమ్మద్ యొక్క (తన) కూతురైన ఓ ఫాతిమా, (ఈ ప్రపంచం లోనే) నీకేమి కావలసినా నన్ను అడుగు. కాని పరలోకంలో అల్లాహ్ కు వ్యతిరేకంగా నేను నీకే సహాయమూ చేయలేను." *Sahih AlBukhari,* vol. 4, pp. 478-9, nos. 727 & 728, and *Sahih Muslim,* vol. l, p. 136, no. 402.

# సృష్టికర్త మానవజాతిని భూమి పైనే ఎందుకు సృష్టించాడు ?

మానవజాతి నివసించే ఈ భూలోకాన్ని కూడా అందులో చేర్చటానికి వీలుగా, సృష్టికర్త మానవజాతిని సృష్టించటం వెనుక గల ఉద్దేశ్యం ఏమిటి అనే ప్రశ్నను ఇంకొంచెం పొడిగించ వలెను. దీనితో ఆ ప్రశ్న ఇలా ఉంటుంది-The question would then be, "సృష్టికర్త మానవులను ఈ భూలోకం పైనే ఎందుకు సృష్టించాడు?" మరల, ఈ ప్రశ్నకు సమాధానం దివ్యఖుర్ఆన్ లో సులభంగా రెండు చోట్ల ఇలా దొరుకుతున్నది.

"ఆయనే! మీలో మంచిపనులు చేసేవారెవరో పరీక్షించటానికి, చావు - బ్రతుకులను సృష్టించాడు. మరియు ఆయన సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు." [67:2]

"నిశ్చయంగా - ప్రజలలో మంచి పనులు చేసేవారు ఎవరో పరీక్షించటానికి - మేము భూమిపై ఉన్న వస్తువులను ఆకర్షణీయ మైనవిగా చేశాము." [18:7]

కావున, ఈ భూలోకంలో మానవజాతి సృష్టి వెనుక ఉన్న ముఖ్యోద్దేశ్యం వారి ప్రవర్తన, నడవడిక, శీలం, నడతలను పరీక్షించటమే. మరికొన్ని వివరాలకు ఖుర్ఆన్ లోని 11:7 వచనాన్ని చదవండి. ఈ ప్రాపంచిక జీవితం మరియు మరణం, ధనికత్వం మరియు బీదరికం, అనారోగ్యం మరియు ఆరోగ్యం మొదలైనవి మంచి ఆత్మలను చెడు ఆత్మల నుండి వేరు పరచటానికి సృష్టించబడినవి. ఈ ప్రపంచంలోని మానవుడి ప్రవర్తన అతడి దైవవిశ్వాసానికి కొలత లాంటిది.

ఈ భూలోక పరీక్షలు మానవజాతి నడత గురించి సృష్టికర్త కనిపెట్టడం కోసం ఎంతమాత్రమూ కాదు. ఎందుకంటే మానవజాతి సృష్టి కంటే ముందే, మానవులు ఏమేమి చేస్తారనేది ఆయన జ్ఞానంలో

ఉండినది. ఈ పరీక్షలు తీర్పుదినాన నరకంలో పోయే వారి పరిస్థితిని స్వయంగా ధృవీకరించుకోవటానికి మరియు స్వర్గంలో పోయే వారికి అల్లాహ్ యొక్క దయాదాక్షిణ్యాల ఆవశ్యకతను తెలియజేయటానికి మాత్రమే. ఈ పరీక్షలు మానవుడి ప్రపంచ జీవితంలో రెండు ప్రాథమిక ఉద్దేశ్యాలను పూర్తి చేస్తున్నాయి. మొదటిది - మానవుడి ఆధ్యాత్మిక ఎదుగుదల, రెండోది కఠిన శిక్ష లేక ప్రతిఫలం.

## ఆధ్యాత్మిక పెరుగుదల Spiritual Growth

ఈ భూలోక జీవితపు పరీక్షలు ప్రాథమికంగా మానవుల ఆధ్యాత్మిక పెరుగుదల కోసం సహాయ పడుతున్నాయి. తీక్షణమైన అగ్ని మేలు బంగారాన్ని దాని ముడి పదార్థం నుండి సహజంగా వేరు చేస్తున్నట్లే, ఈ పరీక్షలు విశ్వాసుల నైతిక ప్రవర్తనను, మంచి నడవడికను శుద్ధి పరుస్తాయి. అవి విశ్వాసులను వారి తక్కువ స్థాయి కోరికలకు బదులుగా ఉన్నతమైన ఆధ్యాత్మిక లక్షణాలు ఎన్నుకోవటానికి బలవంతం చేస్తాయి. ప్రతి పరీక్షలో నెగ్గక పోయినా, విశ్వాసులు భవిష్యత్తులోని పరీక్షలలో ఉపయోపడే విధంగా, తమ వైఫల్యాల నుండి కూడా ఆధ్యాత్మిక గుణపాఠాలు నేర్చుకుంటారు.

## ఔదార్యం మరియు సంతుష్ట భావం

ఉదాహరణకు, దాదాపు మానవ సమాజాలన్నింటిలో ఔదార్యం మరియు సంతృప్తి ఉన్నతమైన లక్షణాలుగా పరిగణింప బడుతున్నాయి. కాని సమాజంలోని ప్రజలందరూ సమానంగా ధనసంపదలు కలిగి ఉన్నట్లయితే, పై రెండు లక్షణాలలో ఏ ఒక్కటీ అభివృద్ధి చెందదు. ఎప్పుడైతే మానవ ఆత్మ నిరుపేదలతో కష్టసుఖాలు పంచుకోవటంలోని ఔన్నత్యాన్ని గ్రహిస్తుందో మరియు ధనసంపదలను ఇంకా ఎక్కువగా కూడబెట్టాలనే తన వాంఛలను, కోరికలను అదుపులో ఉంచటానికి

పోరాడుతుందో, అప్పుడే అది ఔదార్యాన్నీ, ఉదార స్వభావాన్నీ పొందుతుంది.

ఇంకో వైపు, మానవాత్మ ఎప్పుడైతే ఈర్ష్యాద్వేషాలను మరియు అత్యాశ, దురాశలను ఓడిస్తుందో అప్పుడే, సంతృప్తి అనేది దానిలో అభివృద్ధి చెందుతుంది. ధనసంపదలను ఈ ప్రపంచంలో అసమానంగా పంచి, సృష్టికర్త ఈ అధ్యాత్మిక పోరాటానికి రంగాన్ని తెలివిగా సిద్ధం చేశాడు. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"మరియు అల్లాహ్ జీవనోపాధి విషయంలో మీలో కొందరికి మరి కొందరిపై ఆధిక్యతను ప్రసాదించాడు." [16:71]

అత్యాశ మరియు లోభత్వం లేక పిసినారితనం అనేవి మానవుడి సహజ వాంఛల చెడురూపాలు. ధనసంపదలనేవి మానవుడికి ఇవ్వబడిన ధర్మనిక్షేపాలని విశ్వాసులకు సృష్టికర్త తెలియజేసెను. ఆస్తిపాస్తులు మానవుడి పుట్టుకకు ముందు నుండే ఉనికిలో ఉన్నాయి మరియు మానవుడి మరణం తర్వాత కూడా అవి ఈ ప్రపంచంలో అలాగే ఉంటాయి. సంపదను దివ్యాజ్ఞలకు అనుగుణంగా వినియోగించినట్లయితే, అది తన యజమానికి ఇహపరలోకాల లాభాలను, ప్రయోజనాలను ఇస్తుంది. కాని దానిని గనుక స్వార్థప్రయోజనాలకోసం వినియోగించినట్లయితే, అది దాని యజమానికి ఈ లోకంలోను మరియు పరలోకంలోను శాపంగా మారుతుంది. ఆస్తిపాస్తులు మరియు సంతానం ద్వారా ఎదురయ్యే భయంకర అపాయముల నుండి జాగ్రత్త పడమని దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త విశ్వాసులను ఇలా హెచ్చరించెను:

"మరియు వాస్తవానికి మీ ఆస్తిపాస్తులు, మీ సంతానం, పరీక్షా సాధనాలనీ మరియు నిశ్చయంగా, అల్లాహ్ వద్ద గొప్ప ప్రతిఫలం ఉన్నదనీ తెలుసుకోండి!" [8:28]

ఆస్తిపాస్తులు మరియు సంతానం పై వారి వ్యామోహం దైవ విధేయత నుండి దారి తప్పించ కుండా జాగ్రత్త పడమని దివ్యఖుర్ఆన్ లో ఇంకో చోట సృష్టికర్త విశ్వాసులను ఇలా హెచ్చరించెను.

"ఓ విశ్వాసులారా! మీ సంపదలు, మీ సంతానం మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండి నిర్లక్ష్యంలో పడవేయరాదు సుమా!" [63:9]

"మీకిచ్చిన దానితో మిమ్మల్ని పరీక్షించటానికి - మీలో కొందరికి మరికొందరి పై ఉన్నత స్థానాన్ని ఇచ్చాడు." [6:165]

అపరిమితమైన ఆస్తిపాస్తులు కూడగట్టాలనే కోరికలు ఈ జీవితంలో తీరక పోవచ్చు. ఎంతో అధికంగా ఉన్నా, మానవుడు ఇంకా ఎక్కువ కావాలని కోరుకుంటాడు. ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు.

"మానవుడి వద్ద ఒక లోయ నిండా బంగారం ఉన్నట్లయితే, అతడు మరొకటి కావాలని కోరుకుంటాడు. అతడి నోటిని (సమాధి లోని) దుమ్ము తప్ప వేరే ఏదీ సంతృప్తి పరచజాలదు.మరియు చిత్తశుద్ధితో పశ్చాత్తాప పడే వారిని అల్లాహ్ క్షమిస్తాడు." *Sahih AlBukhari,* vol. 8, pp. 297-8, no. 447.

దానధర్మాలు చేయటం ద్వారా అనవసరమైన కోరికలను, వాంఛలను అధిగమించవచ్చును. కావున, ధనవంతుల నుండి వసూలు చేసి, బీదలలో పంచి పెట్టమని అల్లాహ్ తన ప్రవక్తలను ఆదేశించినాడు.

"నీవు వారి సంపదల నుండి దానం (సదఖహ్) తీసుకొని, దానితో వారి పాపవిమోచనం చెయ్యి మరియు వారిని సంస్కరించు." [ 9:103]

దానధర్మాలనేవి ఇస్లాంలో మొదటి నుండి 'జకాహ్' (తప్పని సరి దానం, విధిదానం) అనే పేరుతో సంస్థాగతంగా క్రమబద్ధీకరించ బడెను. (జకాహ్ అంటే పరిశుద్ధ పరచేది మరియు పెంచేది అని అర్థం) ప్రతి విశ్వాసి తన

వద్ద నిలువ ఉన్న అదనపు ధనసంపదలలో నుండి నిర్ణీత భాగం ప్రతి సంవత్సరం అవసరం ఉన్నవారికి, నిరుపేదలకు తప్పని సరిగా దానం చేయటాన్ని ఇస్లాం లో ఒక మౌలికమైన ఆరాధనగా ప్రకటించబడెను. జకాహ్ ఇవ్వక పోవటాన్ని ఘోరమైన మహాపాపముగా ప్రకటించబడెను. వారి దగ్గర ఉన్న ధనసంపదలు వారికి చెందవని, వాటిని తమ ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టడం తగదనే వాస్తవాల్ని విశ్వాసులు గ్రహించటానికి ఈ జకాహ్ దానం సహాయపడుతున్నది. ఆయా ధనసంపదలకు వారు తాత్కాలిక సంరక్షకులు మాత్రమేనని, దానిలో నుండి నిర్ణీత భాగాన్ని నిరుపేదలకు తప్పని సరిగా ఇవ్వాలనే విషయాల్ని అది వారికి బోధిస్తున్నది. ఫలితంగా, తమ ఆస్తిపాస్తులలో నుండి అవసరాలు తీరని నిరుపేదలకు చెందిన కనీస భాగాన్ని గుర్తించినవారే నిజమైన విశ్వాసులని సృష్టికర్త దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటించెను.

"మరియు వారి సంపదలో యాచించే వారికి మరియు ఆవశ్యకత గలవారికి హక్కు ఉంటుంది." [51:19]

కాని, దానధర్మాలు కేవలం సృష్టికర్త మెప్పుకోసమే, పూర్తి చిత్తశుద్ధితో చేయవలెను. ఇతరులకు చూపటానికి లేక ఇతరులను అదుపు చేయటానికి కాదు. ప్రాపంచిక ప్రయోజనాల కోసం దానధర్మాలు చేసినట్లయితే, వాటి ప్రతిఫలాన్ని పూర్తిగా పోగొట్టుకుంటారు, నష్టపోతారు. దివ్యఖుర్ఆన్ లో ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఓ విశ్వాసులారా! (కేవలం) పరులకు చూపటానికి, తన ధనం ఖర్చుచేస్తూ అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించని వాని మాదిరిగా, మీరూ చేసిన మేలును చెప్పుకొని (ఉపకారం పొందిన వారిని) కష్టపెట్టి, మీ దానధర్మాలను వ్యర్థపరచుకోకండి." [ 2:264]

ధనసంపదల అత్యాకాంక్షలతో ఈర్ష్యాద్వేషాలు కూడా కలిస్తే, అగ్నిలో ఆజ్యం పోసినట్లవుతుంది. అందుకని, ఇతరులకు లభించని శుభాలను స్వంతం కోసం కోరకూడదని దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ఇలా ఆదేశించెను:

"మరియు అల్లాహ్ మీలో కొందరికి మరికొందరిపై ఇచ్చిన ఘనతను మీరు ఆశించకండి." [4:32]

ఇదే విషయాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా ఇలా బోధించారు."మీ కంటే తక్కువ అదృష్టవంతుల గలవారి వైపునకు చూడండి. మరియు మీ కంటే పై వారి వైపునకు చూడకండి. ఇలా చేయటం ద్వారా అల్లాహ్ మీకు ప్రసాదించిన వాటిని తిరస్కరించకుండా ఉంటారు" *Sahih Al Bukhari,* vol. 8, p. 328, no. 497 and *Sahih Muslim* vol. 4, p. 1530, no. 7070.

ఎప్పుడైతే మానవులు తమ కంటే ఎక్కువ ధనవంతుల పై దృష్టి సారించటం మొదలు పెడతారో, వారిలో ఈర్ష్యాద్వేషాలు పెరగటం ప్రారంభమవుతుంది. సృష్టికర్త తమ కు అన్యాయం చేస్తున్నాడని వారు భావిస్తారు మరియు ఇతరుల ముందు చెబుతారు. ఇతరుల వద్ద ఉన్నదే తమ దగ్గర కూడా ఉండాలనే తమ వాంఛలను పూర్తి చేయటానికి, అంతిమంగా వారు అనేక పాపాలు చేయవచ్చు. అలా కాకుండా, ఇస్లాం వారిని తమ కంటే తక్కువ స్థాయిలో ఉన్నవారి వైపుకు చూడమని సలహా ఇస్తున్నది. ఎంతటి కష్టపరిస్థితులైనా సరే, వాటి కంటే ఎక్కువ ఘోరమైన స్థితిలో ఉన్న ఇతరులు మీకు కనబడతారు. కాబట్టి, తమ కంటే తక్కువ స్థాయిలో ఉన్నవారి వైపునకు చూడటం ద్వారా సృష్టికర్త వారికి ప్రసాదించిన అనేక శుభాలు జ్ఞప్తికి వస్తాయి. ఈర్ష్యాద్వేషాల నుండి కాపాడుకోవటానికి చేస్తున్న ఆధ్యాత్మిక పోరాటంలో ఉన్నత స్థాయి సంతుష్ట భావాలు అభివృద్ధి చెందుతాయి. ఇంకా ప్రవక్తల బోధనల ప్రకారం భౌతిక సంపదల స్వాధీనం ఈ ప్రపంచపు వాస్తవమైన

సంపదల స్వాధీనం కాదు. అబుహురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు "ఐశ్వర్యం అనే దానిని కొలవ వలసినది సంపదలో కాదు, కాని సంతృప్తిలో" *Sahih Al Bukhari,* vol. 8. p. 304, no. 453.

మానవులు తమకు ఎదురయ్యే ఏ పరిస్థితులకైనా సరే సర్దుబాటు చేసుకుంటూ, అభివృద్ధి ప్రయత్నాలను నిర్లక్ష్యం చేస్తూ జీవించటమనేది సంతృప్తి చెందటం అనబడదు. దీని అర్థమేమిటంటే, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవటానికి తమ శక్తిసామర్థ్యాల మేరకు పూర్తిగా ప్రయత్నించి, ఆ తర్వాత తమ జాతకంలో అల్లాహ్ వ్రాసిపెట్టి ఉన్నదానిని మనస్ఫూర్తిగా స్వీకరించ వలెను. అంటే పూర్తి ప్రయత్నాలు చేసిన తర్వాత ఫలితాన్ని అల్లాహ్ చేతులలో పెట్టడం ద్వారా మన హృదయాలకు వాంఛల నుండి, కోరికల నుండి విశ్రాంతి లభిస్తుంది. ఈ విషయమై దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు.

"కేవలం అల్లాహ్ ధ్యానమే హృదయాలకు తృప్తిని ఇస్తుంది."[13:28]

## ఆపదలు, విపత్తులు, కష్టనష్టాలు Calamities

ఈ ప్రాపంచిక జీవితపు పరీక్షలు, దురదృష్టాల మరియు ఆపదల రూపంలో కూడా రావచ్చును. ఆ సమయంలో సహనంతో మరియు అల్లాహ్ పై దృఢమైన విశ్వాసంతో ఉన్నట్లయితే, ఆ క్లిష్టపరిస్థితులు విశ్వాసుల ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదపడతాయి మరియు వారి పాపాలను తుడిచివేస్తాయి, పరిశుద్ధ పరుస్తాయి. అంటే అటువంటి క్లిష్టపరిస్థితుల పరీక్షా సమయంలో సరైన మార్గం వైపునకు మరలి రావలసినదిగా దారి తప్పిన విశ్వాసులకు జ్ఞాపకం చేస్తుంది. అవి అవిశ్వాసులను పరలోకంలోనే కాకుండా ఈ జీవితంలో కూడా కష్టనష్టాలకు గురిచేస్తాయి మరియు శిక్షిస్తాయి.

# సహనం, ఓర్పు

వైపరీత్యాల, ఆపదల వంటి కష్టకాలాల పునాదులపై సహనమనే ఉన్నతమైన అధ్యాత్మిక లక్షణం అభివృద్ధి చెందును. కాబట్టి, సత్యమార్గ జీవితంలో అనేక దుర్ఘటనలు, విషాద స్థితిగతులు, కష్టనష్టాలు ఎదురవుతాయనేది ఆశ్చర్యకరమైన విషయం కాదు. సాద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ఒకసారి ఆయన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను మానవులలో అత్యంత కిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న వారెవరని ప్రశ్నించారు. జవాబుగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా పలికారు "ప్రవక్తలు, ఆ తర్వాత ప్రవక్తలను ఎక్కువగా ప్రేమించే విశ్వాలు, ఇంకా ఆ తర్వాత వారిని పోలిన ఇతరులు. అతడి స్థాయికి తగ్గట్టుగా మానవుడు పరీక్షింపబడతాడు. అతడి విశ్వాసం దృఢమైనదే అయితే, అది ఈ తీవ్రమైన పరిస్థితులలో ఇంకా పెరుగుతుంది. కాని ఒకవేళ అతడి విశ్వాసంలో బలహీనత ఉన్నట్లయితే, అతడు దానికి తగ్గట్టుగా పరీక్షింపబడతాడు" *atTirmithee,* vol. 2, p. 286, no. 1956 and Ibn Maajah

నిజమైన సహనమనేది క్లిష్టపరిస్థతులలో సృష్టికర్త పై ఉంచే దృఢమైన విశ్వాసం వలన ఉత్పత్తి అగును. తమ దైవం పై దృఢమైన విశ్వాసం ఉంచటమనేది ఆరాధనలోని ఒక ముఖ్యమైన షరతు మరియు నిజమైన విశ్వాసపు సహజ పర్యవసానం. సృష్టికర్త అనుమతి లేకుండా విశ్వంలో ఏదీ జరుగదు అనే సత్యాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించటమే దైవవిశ్వాసం కాబట్టి, కేవలం సృష్టికర్త మాత్రమే మానవజాతి పూర్తిగా నమ్మటానికి తగిన యోగ్యతలు కలవాడు. కాబట్టి, కేవలం సృష్టికర్త వాగ్దానం మాత్రమే ఏనాడూ భంగం కాదు. మానవులు ఎంతటి పుణ్యాత్ములైనా సరే, వారు తప్పటడుగులు వేయకుండా ఉండలేరు. ఎల్లప్పుడూ, మానవులు తమలోని సహజమైన కొన్ని తప్పుడు అలవాట్ల కారణంగా, పరస్పరం ఒకరినొకరు తక్కువ స్థాయికి దిగజార్చటానికి

ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ విషయాన్నే దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ యాకూబ్ అలైహిస్సలాం గురించి ఇలా ప్రస్తావించాడు:

"అంతిమ తీర్పు కేవలం అల్లాహ్‌కే చెందుతుంది. నేను ఆయనను మాత్రమే నమ్ముకున్నాను. మరియు ఆయనను నమ్ముకున్నవారు కేవలం ఆయన పైననే ఆధారపడి ఉంటారు." [12:67]

తనపై ఉంచిన నమ్మకంతో మానవులు కఠినాతికఠినమైన పరీక్షలను కూడా ఎదుర్కోన వచ్చునని సృష్టికర్త మానవజాతికి భరోసా ఇస్తున్నాడు. వారి యొక్క కష్టకాలంలో ఆయన అండదండలు సరిపోవును.

"మరియు అల్లాహ్ మీద నమ్మకం ఉంచుకున్నవానికి ఆయనే చాలు." [65:3]

'మానవుడికి ఉత్తమమైనదేమిటో కేవలం అల్లాహ్ కు మాత్రమే తెలుసును మరియు మానవులు దేనినైతే తమకోసం మంచిదని భావిస్తారో అది దీర్ఘకాలంలో వారి కోసం మంచిది కాకపోవచ్చును' అనే దృఢనమ్మకం పై దైవవిశ్వాసం అనేది ఏర్పడినది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"మరియు మీకు నచ్చని విషయమే మీకు మేలైనది కావచ్చు మరియు మీకు నచ్చే విషయమే మీకు హానికరమైనది కావచ్చు! మరియు అల్లాహ్‌కు అంతా తెలుసు, కాని మీకు ఏమీ తెలియదు." [2:216]

సృష్టికర్త మానవులకు పెట్టే పరీక్షలు ఒక్కొక్క మానవుడి కోసం ప్రత్యేకంగా వారి వారి వ్యక్తిగత అవసరాలు మరియు పరిస్థితులకు అనుగుణంగా తయారుచేసెను. మానవుల శక్తిసామర్థ్యాలను అనుసరించి, వారిలో నుండి ఉత్తమమైన గుణగణాలను వెలికి తీయడానికి సృష్టికర్త ప్రతి మానవుడి కోసం ఈ పరీక్షలను తీర్చిదిద్దెను. మానవుల శక్తిసామర్థ్యాలకు మించి వారిని పరీక్షించడమనేది అన్యాయమగును.

అలా చేయటాన్ని సృష్టికర్త సముచితమైనదిగా భావించడు. దివ్యఖుర్ఆన్ లోని అనేక వచనాలలో ఎవరికీ అన్యాయం చేయనని సృష్టికర్త స్పష్టపరచెను, నొక్కి వక్కాణించెను. ఉదాహరణకు దివ్యఖుర్ఆన్ లోని ఈ వచనం - "నీ ప్రభువు ఎవ్వరికీ అన్యాయం చేయడు." [18:49]

సృష్టికర్త న్యాయమైనవాడవటం వలన, మానవులు ఈ భూలోక జీవితంలో ఎదుర్కొనే పరీక్షలు వారి వారి శక్తిసామర్థ్యాలకు మించినవై ఉండవు. ఈ విషయాన్ని ధృవీకరించటానికి, సృష్టికర్త దివ్యఖుర్ఆన్ లో దీనినే మాటిమాటికీ ప్రకటిస్తున్నాడు. ఉదాహరణకు దివ్యఖుర్ఆన్ లో ఒకచోట సృష్టికర్త ఇలా ధృవీకరిస్తున్నాడు:

"అల్లాహ్, ఏ ప్రాణి పైననూ దాని శక్తికి మించిన భారం వేయడు"[2:286]

ఇంకా, మానవులు భూలోక జీవితంలో ఎదుర్కొనే కష్టకాలాల మధ్యలో తప్పక విరామం సమయం ఉంటుందని సృష్టికర్త వాగ్దానం చేస్తున్నాడు. ఒకవేళ కష్టకాలాలు అంతరాయం లేకుండా ఉన్నట్లయితే వాటిని మానవుడు భరించలేడు. కాబట్టి, ప్రతి ఒక్క కష్టకాలం తర్వాత తప్పక తెరిపి, ఉపశమనం, ప్రశాంతత ఉంటుంది. ఈ విషయాన్నే అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

" నిశ్చయంగా, ఎల్లప్పుడు కష్టంతో పాటు సుఖం కూడా ఉంటుంది; నిశ్చయంగా కష్టంతో పాటు సుఖం కూడా ఉంటుంది." [94:5-6]

## నిరాశ, నిస్పృహ, నిరుత్సాహం

దీని కారణంగా, ఇస్లాం ధర్మంలో ఆత్మహత్య స్పష్టంగా, పూర్తిగా నిషేధించ బడినది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: "మరియు మీరు ఒకరినొకరు చంపుకోకండి." [4:29]

తమ శక్తిసామర్థ్యాలకు మించిన కష్టనష్టాలను సృష్టికర్త తమపై మోపాడని సాధారణంగా ఆత్మహత్య చేసుకునే వారు ఆరోపిస్తుంటారు. సృష్టికర్త వారికి అన్యాయం చేసాడనే అసత్యపు ఆరోపణలు చేస్తారు. అలా వారు దారి తప్పి, ఘోరమైన అవిశ్వాసపు స్థాయికి చేరుకుంటారు. ఇటువంటి విశ్వాస తిరస్కరణల వలన, సృష్టికర్త గురించిన వారి భావాలు దుష్టమైన భావాలుగా మారిపోతాయి. ఇంకా వారు క్రమంగా నిస్పృహ, నిరాశ, నిరుత్సాహపు అట్టడుగు స్థాయికి చేరుకుంటారు. "జీవితం" చాలా అన్యాయమైపోయినదని, ఇక బ్రతికి ఉండటంలో ఎలాంటి ప్రయోజనమూ లేదని వారు తరచుగా పలుకుతారు.

"నిశ్చయంగా, సత్యతిరస్కారులు తప్ప, ఇతరులు అల్లాహ్ అనుగ్రహం పట్ల నిరాశ చెందరు." [12:87]

తత్ఫలితంగా, తన గురించి చెడు ఆలోచనలు, దుష్టభావాలు కలిగిన వారు శాశ్వతమైన కఠిన నరకశిక్షను ఎదుర్కొన వలసి ఉన్నదని, సృష్టికర్త మానవజాతికి సందేశం పంపెను. దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"మరియు ఆయన, కపటవిశ్వాసులు అయిన పురుషులను మరియు కపటవిశ్వాసులైన స్త్రీలను; మరియు బహుదైవారాధకులైన పురుషులను మరియు బహుదైవారాధకులైన స్త్రీలను; అల్లాహ్‌ను గురించి చెడుభావనలు, భావించే వారందరినీ శిక్షించేందుకు. వారిపై చెడు అన్ని వైపుల నుండి ఆవరించి ఉంటుంది. మరియు అల్లాహ్ యొక్క ఆగ్రహం వారిపై విరుచుకుపడుతుంది. మరియు ఆయన వారిని శపించాడు (బహిష్కరించాడు); మరియు వారి కొరకు నరకాన్ని సిద్ధపరచి ఉంచాడు." [48:6]

## ఆశ పడటం Hope

ఇంకో వైపు, న్యాయం మరియు కరుణ గురించి సృష్టికర్త చేసిన వాగ్దానాలు విశ్వాసులలో తమ జీవితపు కష్టకాలాన్ని ఓర్పుతో

ఎదుర్కొనటానికి అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. అంటే, అల్లాహ్ యొక్క కరుణలో ఆశలు ఉంచడమనేది దైవవిశ్వాసపు ఒక ముఖ్యభాగం. ఎవరైతే అల్లాహ్ పై విశ్వాసం ఉంచి, సరైన మార్గాన్ని అనుసరించటానికి ప్రయాస పడుతుంటారో, వారే అల్లాహ్ యొక్క కరుణ పై ఆశలు ఉంచటానకి అర్హులు. సహనంతో, ఓర్పుతో ఉండేవారికి సహాయసహకారాలు అందిస్తానని అల్లాహ్ ఇలా వాగ్దానం చేస్తున్నాడు.:

"ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజ్ ద్వారా సహాయం అర్థించండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం గల వారితో ఉంటాడు." [2:153]

"నిశ్చయంగా, విశ్వసించిన వారు మరియు (అల్లాహ్ మార్గంలో తమ జన్మభూమిని విడిచి) వలస పోయేవారు మరియు అల్లాహ్ మార్గంలో ధర్మపోరాటం చేసేవారు; ఇలాంటి వారే! అల్లాహ్ కారుణ్యం ఆశించటానికి అర్హులు. మరియు అల్లాహ్ క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత." [2:218]

చిత్తశుద్ధితో సృష్టికర్త పై విశ్వాసం ఉంచి, సహనంతో జీవించి నట్లయితే, స్వర్గలోకం బహుమానంగా తప్పక లభించును.సృష్టికర్త ఇదే విషయాన్ని సహనశీలురైన దైవవిశ్వాసులకు లభించబోయే బహుమానం గురించి ఇలా తెలియజేస్తున్నాడు:

"...మరియు మనఃస్థైర్యంతో ఉండేవారికి శుభవార్త నివ్వు. ఎవరైతే విపత్కరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు: "నిశ్చయంగా మేము అల్లాహ్ కే చెందినవారము! మరియు మేము ఆయన వైపునకే మరలి పోతాము!" అని అంటారో;" [2:155-6]

మనం చేసే చెడు పనుల వలననే మనపై కష్టకాలం వచ్చి పడుతుందనే నమ్మకం పై కూడా సహనం ఆధారపడి ఉంటుంది. [వాస్తవానికి, భూలోకం పై నేడు కనబడుతున్న మొత్తం అరాచకానికి అసలు కారణం మానవుల స్వయం కృతాపరాధమే. ఇదే విషయాన్ని అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లోని 30:41

వచనంలో తెలిపి ఉన్నాడు. ఇది ముందు పేజీలలో రాబోతున్నది.] ఈ విషయమై దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"మీ పై ఏ ఆపద వచ్చినా, అది మీ చేతులారా మీరు సంపాదించు కున్నదే! మరియు ఆయన మీ (తప్పులను) ఎన్నింటినో క్షమిస్తాడు." [42:30]

మానవుల యొక్క అధికశాతం చెడును, దుష్టత్వాన్ని, పాపాలను సృష్టికర్త క్షమించివేశాడనేది వాస్తవం. ఒకవేళ సృష్టికర్త మానవులను వారు చేస్తున్న పనుల, ఆచరణల ఆధారంగా గనుక శిక్షించదలిచితే, మానవులందరూ మరియు ఈ భూమి మీద ఉన్న ఏ సృష్టి మిగలదు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు:

"ఒకవేళ అల్లాహ్ మానవులను వారు చేసిన కర్మలకు గానూ పట్టుకోదలిస్తే! (భూమి) మీద ఏ ఒక్క ప్రాణిని కూడా ఆయన వదిలిపెట్టి ఉండేవాడు కాదు!" [35:45]

కాబట్టి, శుభసమయాలు మరియు కష్టకాలపు పరీక్షలు - రెండూ దైవవిశ్వాసులకు లాభం చేకూరుస్తాయి. నిజమైన విశ్వాసుల జీవితాలు మానవ స్వభావ తీవ్ర ఉద్వేగాల అంచులు తాకకుండా, మధ్యేమార్గంలో ఉంటాయి. వారు జీవితపు విజయాలలో, సాఫల్యాలలో సృష్టికర్తనే మరచిపోయేటంతగా మరీ ఉప్పొంగిపోరు మరియు వారు జీవతపు ఆటుపోట్లలో, కష్టాలలో సృష్టికర్త దయాదాక్షిణ్యాలపై ఆశలు వదులు కునేటంతగా నిరాశ చెందరు.

దీనికి విరుద్ధంగా వారు, వారికి లాభం చేకూర్చే వారి ఏకైక ప్రభువైన సకల లోకాల సృష్టికర్త ధ్యానం చేస్తారు మరియు ఆయన నిర్ణయాలపై నమ్మకం ఉంచుతారు. సుహైబ్ ఇబ్నె సినాన్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా బోధించారు, "విశ్వాసి యొక్క పరిస్థితి చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. అతడి మొత్తం జీవితం లాభదాయకమే, ఇది కేవలం

విశ్వాసుల విషయంలో మాత్రమే అలా జరుగును. అతడి ముందుకు మంచి సమయం గడుపుతున్నప్పుడు, అతడు సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు, అలా చేయటం అతడికి ఇంకా మంచిని, పుణ్యాలను చేకూరుస్తుంది. అతడి ముందుకు కష్టకాలం దాపురించినప్పుడు, సహనంతో ఉంటాడు, అలా చేయటం అతడికి మంచిని, పుణ్యాలను చేకూరుస్తుంది." *Sahih Muslim,* vol. 4, p. 1541, no. 7138.

ఇదే సృష్టికర్త ముందుగానే నిర్ణయించిన తమ జాతకంలోని మంచిచెడులను స్వీకరించిన వారి పరిస్థితి. కాబట్టి, తమకు జరిగే మంచి చెడులు సృష్టికర్త తరపు నుండి వచ్చేవే అనే నమ్మకం ఇస్లాం ధర్మంలో దైవవిశ్వాసపు (ఈమాన్) ఆరో మూలస్థంభం.

ఇంకో వైపు, విశ్వాసులు ఎటువంటి ఒడిదుడుకులు లేని జీవితాన్ని గడుపుతున్నట్లయితే, తమలో ఏదో ఒక లోపం ఉన్నట్లుగా వారు భావించేవారు. అటువంటి పరిస్థితులలో, నిజమైన విశ్వాసి కొంత సమయం తనకోసం కేటాయించుకుని, తన జీవితపు యదార్థాలపై దృష్టి సారించవలెను. వారి విషయంలో పరీక్షలు తప్పని సరి కాకపోవచ్చు లేదా వారికి ఆ పరీక్షల గురించి తెలియక పోవచ్చు లేదా వారు సత్యమార్గం నుండి దారితప్పిపోయి ఉండవచ్చును. పైకి కనబడే అవిశ్వాసుల విలాసవంతమైన, భోగభాగ్యాలతో, సంతానంతో కూడిన ఆహ్లాదకరమైన జీవితం, వారు ఎదుర్కోన బోతున్న భయంకర కఠిన శిక్షకు ముందున్న విరామం లాంటిది. దీనిని తూఫాను రావటానికి ముందుండే నిశ్శబ్ద వాతావరణంతో పోల్చవచ్చును. దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ఈ విషయమై ఇలా ప్రకటిస్తున్నాడు -

"మరియు వారి సిరిసంపదలు మరియు వారి సంతానం నిన్ను ఆశ్చర్యానికి గురిచేయ నివ్వకూడదు. నిశ్చయంగా, అల్లాహ్! వాటితో ఈ ప్రపంచంలో

వారిని శిక్షించాలనీ మరియు వారు సత్యతిరస్కారులు గా ఉన్న స్థితిలోనే వారి ప్రాణాలను కోల్పోవాలనీ సంకల్పించాడు." [9:85]

అంటే విశ్వాసులు తప్పక కష్టాలతో కూడిన, ఆపదలతో నిండిన జీవితాన్నే గడపాలని కాదు. దీనికి కారణం సృష్టికర్త బోధించిన ఒక ప్రార్థన: "ఓ అల్లాహ్, పూర్వపు ప్రజలపై నీవు మోపిన భారాన్ని మా పై మోపకుము." 2:286

అటువంటి వారు జీవిత పరీక్షల నుండి తమను తప్పించినందుకు సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలుపుకోవలెను. ఏది ఏమైనా, సుఖ సమయాలలో వారు మరింత జాగ్రత్తగా ఉండవలెను. ఎందుకంటే జీవితపు విజయాలు మరియు సుఖసంతోషాలు మానవుడిని జీవిత పరీక్షల గురించి అంధులను చేస్తాయి.

## హెచ్చరిక Reminder

జీవిత పరీక్షలు ఒక్కోసారి దారి తప్పిన వారికి శిక్షల హెచ్చరికగా పనిచేస్తాయి. ఇంకా వారిని సరైన మార్గం వైపునకు మళ్ళటాన్ని ప్రోత్సహిస్తాయి. చెడు మార్గం పై నడిచేవారు, వారి చుట్టూ ఉన్న దుష్ట సహవాసుల సలహాలనే వింటుంటారు. కాని, ఏదైనా ఆపద వారి పై వచ్చి పడినప్పుడు లేదా వారి దగ్గరి స్నేహితుల పై లేదా బంధువుల పై వచ్చి పడినప్పుడు, వారిలో చెడును గుర్తించే అణువంత విశ్వాసమున్నా సరే, అది వారిని ఒక్కసారిగా కుదిపి వేస్తుంది.

"మరియు ఆ పెద్ద శిక్షకు ముందు మేము (ఇహలోకంలో) వారికి సమీప శిక్షను రుచిచూపుతాము. బహుశా, వారు (పశ్చాత్తాపపడి సత్కార్యాల వైపునకు) మరలి వస్తారేమోనని!" [32:21]

తమ మార్గభ్రష్టత్వాన్ని జ్ఞప్తికి తెచ్చే ఆపదల పరీక్షలు ఒక్కోసారి మానవులు తమ తోటి వారిపై చేసే అత్యాచారాల రూపంలో కూడా

వస్తాయి. ఉదాహరణకు ఇస్లాం జీవన విధానానికి దూరమైపోయిన బోస్నియా ముస్లింలపై సెర్బులు చేసిన చెప్పలేనన్ని ఘోరమైన అత్యాచారాలు, కువైత్ దేశాన్ని అన్యాయంగా సద్దాం హుస్సేన్ ఆక్రమించుకోవటం మరియు సాధారణ ఇరాకీ పౌరులపై అమెరికా బాంబులు కురిపించటం మొదలైనవి. తోటి మానవుల చేతులలో ఏ ఏ కష్టనష్టాలకు, బాధలకు గురౌతున్నారో, అవి వారు స్వయంగా కొని తెచ్చుకున్నవే. ఈ విధంగా, ఇతరుల చేతిలో దౌర్జన్యాలకు, అత్యాచారాలకు గురవటం కూడా సరైన సత్యమార్గం వైపునకు మరలటానికి సృష్టికర్త చేస్తున్న హెచ్చరిక యే.

"మానవులు తమ చేజేతులా సంపాదించుకున్న దాని ఫలితంగా భూమి లో మరియు సముద్రంలో కల్లోలం వ్యాపించింది. ఇది వారిలో కొందరు చేసిన దుష్కర్మల ఫలితాన్ని రుచి చూపటానికి, బహుశా ఇలాగైనా వారు (అల్లాహ్ వైపునకు) మరలుతారేమోనని!" [30:41]

## కపటత్వం Hypocrisy

పైకి విశ్వాసం ప్రకటిస్తున్న కపటులను కూడా ఇలాంటి ఆపదలు బయట పెడతాయి. ఇంకా, అవిశ్వాసులు తమ స్వంత ఇష్టానుసారమే నరకాన్ని ఎన్నుకున్నారనే విషయాన్ని కూడా ఇవి స్పష్టంగా ఋజువు చేస్తాయి. తప్పుడు కారణాల ఆధారంగా అనేక మంది ప్రజలు ఇస్లాం ధర్మం స్వీకరిస్తున్నారు. ఇలాంటి వారు ఇస్లాం ధర్మ స్వీకరణకు మునుపున్న జీవితం కంటే ఎక్కువ కష్టాలు తమకు ఎదురయినట్లయితే, వారు తిరిగి తమ పాత ధర్మం వైపునకు మరలిపోతున్నారు. ఇదే విషయాన్ని సృష్టికర్త తన అంతిమ సందేశమైన దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

"ప్రజలు: ''మేము విశ్వ సించాము!'' అని అన్నంత మాత్రాన్నే తాము విడిచిపెట్టబడతారని మరియు తాము పరీక్షింపబడరని భావిస్తున్నారా?

మరియు వాస్తవానికి, మేము వారికి పూర్వం గతించిన వారిని కూడా పరీక్షించి ఉన్నాము. కావున నిశ్చయంగా సత్యవంతులు ఎవరో మరియు అసత్యవంతులు ఎవరో అల్లాహ్ వ్యక్తపరుస్తాడు." [29:2-3]

## శిక్షలు Punishment

ఎవరైతే సృష్టికర్త నిర్ణయించిన హద్దులు దాటిపోతారో, వారు ఇహపరలోకాల జీవితాలలో తమకు తాము స్వయంగా శిక్షలకు గురి చేసుకుంటున్నారు. ఖుర్ఆన్ లో అనేకచోట్ల, దివ్యమైన మార్గదర్శకత్వాన్ని తిరస్కరించిన అనేక ప్రాచీన జాతులు సర్వనాశనం అయిన విధానాన్ని స్పష్టంగా వివరించెను. సృష్టికర్త యొక్క ఆదేశాలను వ్యతిరేకించటం వలన వారు ఎదుర్కొన్న పర్యవసానాలను ఈ గాథలు చాటి చెబుతూ, మనల్ని అటువంటి తప్పులు చేయవద్దని హెచ్చరిస్తున్నాయి. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ఇలా ప్రకటిస్తున్నాడు:

"దైవప్రవక్త ఆజ్ఞను ఉల్లంఘించే వారు, తాము ఏదైనా ఆపదలో చిక్కుకు పోతారేమోననీ లేదా బాధాకరమైన శిక్షకు గురిచేయ బడతారేమోనని భయపడాలి." [Quran, 24:63]

శిక్షలు అనేక విధాలుగా రావచ్చును. ఎయిడ్స్ వ్యాధి ఈనాడు దాదాపు అన్ని దేశాల ప్రజలు ఎదుర్కొంటున్న భయంకరమైన శిక్ష. [Acquired immune deficiency syndrome (AIDS) అనేది వైరస్ ద్వారా వ్యాపించే ఒక రకమైన భయంకర వ్యాధి. అది శరీరపు రోగనివారణ వ్యవస్థపై దాడి చేసి, దానిని చిన్నాభిన్నం చేస్తుంది. ఆ విధంగా అది రోగిని కోలుకోలేని భయంకర పరిస్థితులకు గురిచేసి, క్రమంగా చనిపోయేటట్లు చేస్తుంది. (*Chambers Pocket Dictionary*, p. 19.) వైద్యచరిత్రలో ఈ వ్యాధి మొదటి సారి 1980 వ సంవత్సరపు దరిదాపులలో కనబడినది. (1981లో మొట్టమొదటి సారిగా ఇది కనిపెట్టబడినది) (*The New Encyclopaedia Britannica*, vol. 10, p. 676.) ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధికి గురైనవారిలో అధికులు అక్రమ లైంగిక సంబంధాలు కలిగిన పాపాత్ములే.

ఆరంభంలో స్వలింగ సంపర్కులు దీనికి గురయ్యారు. ఆ తర్వాత అక్రమ సంబంధాలు కలిగిన వారు, promiscuous heterosexuals, మత్తు పదార్థాలు సేవించేవారు దీనికి గురయ్యారు. ఈ గ్రూపులన్నీ వివాహ బంధంలోని స్త్రీపురుషుల మధ్యనే లైంగిక సంభోగం జరగాలనే దివ్యాజ్ఞల పై మరియు మత్తుపదార్థాలను నిషేధిస్తున్న ధర్మాదేశాలపై విచ్చలవిడిగా తిరుగుబాటు చేసాయి. అంతేకాక ఎయిడ్స్ రక్తం ఎక్కించటం ద్వారా మంచి ప్రవర్తన కలిగిన వారిలోను, తల్లిదండ్రుల ద్వారా పసిపిల్లలలోను వ్యాపిస్తున్నది కదా! అని కొందరు ప్రశ్నించ వచ్చును. అయితే వైద్య పరిశోధనల సర్వేలలో అటువంటి వారి సంఖ్య ఇతర గ్రూపులతో పోల్చితే, చాలా తక్కువగా ఉన్నదని తేలినది. ప్రపంచం పై సృష్టికర్త యొక్క శిక్ష వచ్చిపడినప్పుడు, అది కేవలం దుష్టుల మరియు పాపాత్ముల పై కే కాకుండా, మొత్తం సమాజం పై వచ్చిపడుతుంది. ఇదే విషయాన్ని దివ్యఖురాన్ లో సృష్టికర్త ఇలా ప్రకటిస్తున్నాడు.

"మరియు మీలోని దుర్మార్గులకు మాత్రమే గాక (అందరికీ) సంభవించ బోయే ఆ విపత్తు గురించి భీతిపరులై ఉండండి. మరియు అల్లాహ్ శిక్ష విధించటంలో చాలా కఠినుడని తెలుసుకోండి." [8:25]

14 శతాబ్దాల క్రితమే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ వ్యాధి గురించి భవిష్యం చెప్పారు. ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, "ఎప్పుడైతే అక్రమ లైంగిక సంభోగాలు promiscuity ప్రజలలో విచ్చలవిడిగా జరుగుతాయో, ఒక ప్లేగు మరియు anguish వారిలో వ్యాపిస్తుంది. ఇది వారి పూర్వ ప్రజలకు తెలియనిదై ఉంటుంది. *Saheeh Sunan Ibn Maajah,* vol. 2, p. 370, no. 3246.

అయితే, ఎయిడ్స్ అనేది వ్యాధుల పరంపరలోని ఒక వ్యాధి మాత్రమే. ఎయిడ్స్ ప్రబలక ముందు, హెర్పస్ herpes అనబడే మరొక వ్యాధి రూపంలో హెచ్చరిక వచ్చినది. 1960 - 70 సంవత్సరముల కాలంలో

అక్రమ లైంగిక సంభోగం sexually promiscuous చేస్తున్న వారిలో ఇది ఎక్కువగా వ్యాపించినది. దాదాపు 1975వ సంవత్సరంలో అమెరికా దానిని epidemic గా ఘోషించినది. దానిని నయం చేసే విధానం నేటికీ కనిపెట్ట బడలేదు. దాదాపు 1980 సంవత్సరానికి దగ్గరలో అది అంత fatal గా ఉండకపోవటం వలన, ప్రజలు దానిపై నుండి తమ దృష్టిని మరల్చుకున్నారు. ఇది ఎయిడ్స్ లాంటిదే అయినా, నయం చేసే పద్ధతి కనిపెట్టబడని, ఇంకో రకమైన భయంకర వ్యాధి. [ఈ రోగ లక్షణాలు బయట పడినప్పుడు, జ్వరం మరియు శారీరక అస్వస్థత తో పాటు జననేంద్రియాల దగ్గర మంటగా, నొప్పిగా ఉండటం మరియు పొత్తి కడుపుకూ మరియు తొడకూ నడుమ ఉండే పల్లపు భాగంలో చీము కారే పుళ్ళు పెరగటం. *(The New Encyclopaedia Britannica,* vol. 21, p. 536.)]

# సృష్టికర్త విశ్వజగత్తును ఎందుకు సృష్టించాడు ?

మానవజాతికి సంబంధించినంతవరకు, విశాల విశ్వం మరియు దానిలోని సృష్టితాల సృష్టి యొక్క ఉద్దేశ్యం అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ లో ప్రత్యేకంగా నిర్వచించబడినది. ఈ విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో సృష్టికర్త ఇలా ప్రకటిస్తున్నాడు:

"అల్లాహ్! ఆయనే భూమ్యాకాశాలను సృష్టించాడు. మరియు ఆకాశం నుండి నీటిని కురిపించి, దానినుండి మీకొరకు ఆహారంగా ఫలాలను పుట్టించాడు. మరియు తన ఆజ్ఞతో, ఓడలను మీకు ఉపయుక్తంగా చేసి సముద్రంలో నడిపించాడు. మరియు నదులను కూడా మీకుపయుక్తంగా చేశాడు. మరియు ఎడతెగకుండా, నిరంతరం పయనించే, సూర్య చంద్రులను మీకు ఉపయుక్తంగా చేశాడు. మరియు రాత్రింబవళ్ళను కూడా మీకు ఉపయుక్తంగా ఉండేటట్లు చేశాడు." [14:32-33]

"ఆయనే (రాత్రి చీకటిని) చీల్చి ఉదయాన్ని తెచ్చేవాడు. మరియు రాత్రిని విశ్రాంతి కొరకు చేసినవాడు మరియు సూర్యుణ్ణి మరియు చంద్రుణ్ణి (కాల) గణన కొరకు నియమించిన వాడు. ఇవన్నీ ఆ సర్వశక్తిమంతుని, సర్వజ్ఞుని, నియామకాలే! మరియు ఆయనే మీ కొరకు చీకట్లలో - భూమి మీద మరియు సముద్రంలో - మార్గాలను తెలుసుకోవటానికి, నక్షత్రాలను పుట్టించాడు. వాస్తవానికి, ఈ విధంగా మేము జ్ఞానవంతుల కొరకు మా సూచనలను వివరించి తెలిపాము." [6:96-97]

విశాల విశ్వంలోని వస్తువులు, విషయాలు మానవజాతి సేవ కోసం సృష్టించబడినాయి. అవి మానవుడు కనిపెట్టిన ఓడలు, విమానాలు మొదలైనవి కావచ్చు లేదా స్వయంగా ప్రకృతి కావచ్చు. ఇవన్నీ మానవజాతి ప్రయోజనాల కోసం, వినియోగం కోసం సృష్టికర్త సృష్టించెను. కాని, తగిన బాధ్యతలు లేకుండా అటువంటి శుభాలను,

బహుమానాలను ప్రసాదించలేదు. సృష్టికర్త యొక్క ఇంతటి గొప్ప ఔదార్యాన్ని మరియు దీవెనలను గుర్తించి, కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఆయనను స్తుతించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఎప్పుడైనా వాహనం ఎక్కినప్పుడు, ఇలా ప్రార్థించమని సృష్టికర్త దివ్యఖుర్ఆన్ లో ఉపదేశించెను:

"మీరు వాటి వీపుల మీద ఎక్కటానికి; తరువాత మీరు వాటిమీద కూర్చున్నప్పుడు, మీ ప్రభువు అనుగ్రహాన్ని తలచుకొని ఇలా ప్రార్థించటానికి: "ఆ సర్వలోపాలకు అతీతుడైన (అల్లాహ్) వీటిని మాకు వశపరచాడు, లేకపోతే వాటిని (వశపరచుకునే) సామర్థ్యం మాకు లేదు. మరియు నిశ్చయంగా, మేము మా ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉన్నది!"" [43:13-14]

సృష్టికర్త విధించిన నియమాలను అనుసరించి సృష్టిని పరిపాలించే బాధ్యత కూడా మానవజాతి పై ఉన్నది. ఇది ఇతర సృష్టితాలకు సంబంధించిన మానవుడి కర్తవ్యం. సృష్టికర్త నియమనిబంధనలను అనుసరించి, సృష్టిలోని ప్రతిదాన్ని వినియోగించుకోమని మానవజాతికి ఆదేశం ఇవ్వబడినది. అబు సయీద్ అల్ ఖుద్రీ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, "ప్రపంచం సుందరంగా మరియు పచ్చగా ఉన్నది. దానిని పరిపాలించమని మహోన్నతుడైన అల్లాహ్ మిమ్మల్ని ఆదేశించి, మీరు ఆ కర్తవ్యాన్ని ఎలా నిర్వహిస్తున్నారో గమనించును." *Sahih Muslim,* vol. 4, p. 1432, no. 6606.

మానవులు తమ ఇష్టానుసారం ఈ ప్రపంచంతో వ్యవహరించటానికి అనుమతి ఇవ్వబడలేదు. కాబట్టి, ప్రకృతికి సంబంధించిన భౌతికవాద లౌకిక సమాజపు తిరస్కార ప్రవర్తన దివ్యసందేశాలను వ్యతిరేకిస్తున్నది.

భౌతికవాద సమాజం ప్రకృతిని జయించ వలసిన ప్రతిపక్షంగా పరిగణిస్తున్నది. ఎవరెస్టు శిఖరాల సౌందర్యాన్ని ప్రశంసించటంతో సరిపోదు. ప్రతి సంవత్సరం దాని శిఖరాలను అధిరోహించి, దానిని జయించాలనే ప్రయత్నంలో అనేక ప్రాణాలు పోతున్నాయి. ప్రపంచంలోని చిత్రవిచిత్ర జంతువులను ఆశ్చర్యకరంగా విస్మయంతో చూడటంతోటే సరిపుచ్చటం లేదు. పాశ్చాత్య డ్రాయింగ్ రూములను అలంకరించటానికి వాడే ట్రోఫీల తయారీ కోసం అనేక అపూర్వమైన వాటిని గడచిన శతాబ్దపు సఫారీలలో వేటాడి నామరూపాలు లేకుండా చేశారు. నేడు సఫారీ వేటలు ఆపివేయబడినప్పటికీ, ఖడ్గమృగాల వంటి జంతువుల సంఖ్య నానాటికీ తగ్గిపోతూ, పూర్తిగా నశించేపోయే తీవ్ర ప్రమాదం పొంచి ఉన్నది. దీనికి కారణం దూరప్రాచ్య దేశాల సంప్రదాయక ఔషధాలలో మరియు కామోద్దీపకమైన వీర్యవర్ధక మందులలో మూలకాలుగా ఉపయోగపడే వాటి కొమ్ములకున్న ప్రత్యేకత.

## పశుపక్ష్యాదులు

అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ ఆదేశాలలో ఆటపాటల కోసం జంతువులను వేటాడటం నిషేధించబడినది. ఇది సృష్టికర్త దృష్టిలో పాపమైనదిగా పరిగణించబడెను. ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు, "ఏ జీవిపైనా దాడి చేయువద్దు" *Sahih Muslim*, vol. 3, p. 1079, no. 4813.

ఆహారం కోసం, మానవజాతి సంరక్షణ కోసం లేదా వారి దుస్తుల కోసం తప్ప సజీవంగా ఉన్న ఏ జంతువు ప్రాణాన్నీ తీయకూడదు. ఇది ఇస్లాం ధర్మంలో నిషేధించబడినది. విలాసం కోసం మరియు ఆనందం కోసం వాటిని చంపటమనేది మౌలికంగా ఒక దుష్టచర్య. ఇంకా, సమాజానికి కష్టనష్టాలు కలుగజేసేటటు వంటి నేరాలు చేసిన మానవుల

ప్రాణాలు తీయటం లేదా ఆహారం కోసం జంతువులను జిబా చేయటం వంటివి వాటికి సాధ్యమైనంత తక్కువ నొప్పి, బాధ కలిగేటట్లుగా జాగ్రత్త వహించవలెను.

[హిషామ్ ఇబ్నె జైద్ ఇలా తెలిపారు - హకమ్ ఇబ్నె అయ్యూబ్ గారి ఇంటిని తను మరియు తన తాతగారైన అనస్ ఇబ్నె మాలిక్ రదియల్లాహు అన్హు దర్శించినప్పుడు, కొందరు ఒక కోడిని వారి బాణాలకు లక్ష్యంగా చేయటం చూశారు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అలా జంతువులను కట్టి పడవేసి లక్ష్యంగా చేయటాన్ని నిషేధించినట్లు అనస్ రదియల్లాహు అన్హు వారికి బోధించారు. *Sahih Muslim,* vol. 3, p.1078,no. 4182]

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధించిన క్రింది రెండు విషయాలను షద్దాద్ ఇబ్నె ఔస్ రదియల్లాహు అన్హు ఇలా జ్ఞాపకం ఉంచుకున్నారు,

"ప్రతి పనిలో సృష్టికర్త మంచిని ఉంచాడు; కాబట్టి మీరు ఇతరులతో ప్రవర్తించేటప్పుడు మంచి పద్ధతిలో ప్రవర్తించండి. మీలో ప్రతి ఒక్కరూ తమ కత్తిని బాగా పదునుగా చేసుకోండి మరియు జిబా చేసిన(గొంతుకోసిన)జంతువులు కష్టరహితంగా, సులభంగా చనిపోయేటట్లు చూడండి." *Sahih Muslim,* vol. 3, p. 1078. no. 4810.

పశ్చిమ దేశాలలోని కొంతమంది పశువుల అభిమానులు ఇస్లామీయ పద్ధతి ప్రకారం చేసే జిబహ్ (గొంతు దగ్గరి రక్తనాళాన్ని కోయటం) ను వ్యతిరేకించినప్పటికీ, దానికి ప్రత్యామ్నాయమైన కరెంటు షాక్ లేదా తలపై బాది చంపటం మొదలైనవి వాటి వలన ఆ పశువుల చావు మరీ బాధాకరంగా మారుతున్నది. అత్యంత పదునైన కత్తితో గొంతు దగ్గరి రక్తనాళాన్ని కోయటం ద్వారా, ఆ పశువుకు బాధ తెలియదు. ఎందుకంటే, గుండె నుండి తలకు రక్తాన్ని తీసుకుపోయే పెద్ద ధమని తెగిపోవటం వలన, మొదడుకు రక్తప్రసరణ ఆగిపోయి, వెంటనే అది స్పృహ తప్పిపోతుంది.

ముస్లిం ఇళ్ళలో నిషేధింపబడిన కుక్క వంటి వాటితో సహా అన్ని రకాల పశుపక్ష్యాదులపై శ్రద్ధచూపటాన్ని పుణ్యకార్యంగా దివ్యసందేశం ప్రకటించినది. [ముస్లింలు పెంపుడు జంతువులుగా కుక్కలను పెంచటాన్ని నిరుత్సాహపరచబడినది. కాని, కాపలా కుక్కలకు, గొర్రెల మందను అదుపు చేయటానికి వినియోగించే కుక్కలకు మరియు వేటకుక్కలకు అనుమతి ఇవ్వబడినది.ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా ఉపదేశించారు, "ఎవరైతే పశువుల మందను అదుపు చేయటానకి లేక వేటాడటానికి కాకుండా, కుక్కలను ఉంచుతారో వారు, ప్రతిరోజు తమ పుణ్యాలలో నుండి రెండు పర్వతాలకు సమాన మైనంతటి పుణ్యాలను పోగొట్టుకొనును."(*Sahih Muslim,* vol. 3, p. 826,no.3815] అబుహురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన వేరొక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు,"కాలి నడకన ప్రయాణిస్తున్న ఒకతనికి దాహం కలిగెను. దారి ప్రక్కన ఉన్న బావిలోనికి దిగి తన దాహం తీర్చుకునెను. అతను బావి పైకి రాగానే, దప్పికతో బాధపడుతూ, నాలుక బయటకు చాచి దీనంగా చూస్తూ, బురద మట్టి తింటున్న ఒక కుక్క ను చూసినాడు. అతడు తనలో తాను ఇలా అనుకున్నాడు 'కొంతసేపు క్రితం నేను దాహంతో ఉన్నట్లే, ఈ కుక్క కూడా తీవ్రమైన దప్పికతో ఉన్నట్లుంది.' వెంటనే అతడు బావిలోనికి దిగి, తన కాలిబూటులో (పాదరక్షలలో) నీటిని నింపినాడు. దానిని తన పళ్ళ మధ్యన గట్టిగా పట్టుకుని, నిచ్చెన ఎక్కి పైకి వచ్చినాడు. ఆ నీటిని కుక్కకు త్రాగించినాడు. అల్లాహ్ అతడికి కృతజ్ఞతలు తెలిపినాడు మరియు అతడి పాపాలన్నీ క్షమించివేసినాడు (మరియు స్వర్గవాసుడిగా చేసినాడు)" *Sahih AlBukhari,* vol. 1, p. 120, no. 174.

అప్పుడు తోటి సహచరులు ఇలా ప్రశ్నించారు, "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! జంతువుల అవసరాలు తీరిస్తే కూడా మనకు పుణ్యాలు లభిస్తాయా?" వారిలా సమాధానమిచ్చారు,"ప్రతి జీవి యొక్క సేవలో పుణ్యాలు ఉన్నాయి."*Sahih AlBukhari,* vol. 3, pp. 322-3, no. 551, and *Sahih Muslim,* vol. 4, pp. 1215-6, no. 5577.

అబుహురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు. "తన పాదరక్షలలో నీటిని నింపి, దానిని తన కొంగుతో కట్టి, బావి పైకి తెచ్చి అక్కడ దాహంతో ఉన్న కుక్కకు త్రాగించిన కారణంగా, ఇస్రాయిల్ సంతతిలోని ఒక వ్యభిచారిణిని [*Sahih AlBukhari,* vol. 4, pp. 448-9, no. 673] అల్లాహ్ క్షమించివేసినాడు."*Sahih AlBukhari,* vol. 4, pp. 3389 no. 538, and *Sahih Muslim,* vol. 4, p. 1216.no. 5579.

దీనికి విరుద్ధంగా, జంతువులకు హాని కలిగించటం ఇస్లామీయ ధర్మశాస్త్రంలో ఒక మహాపాపంగా పరిగణింపబడుతుంది. అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ప్రకటించారు - "ఒక పిల్లిని బంధించి, చనిపోయే వరకు దానిని హింసించిన కారణంగా ఒక స్త్రీ కఠిన శిక్షలు అనుభవించి, నరకంలోనికి పంపబడినది. ఆవిడ ఆ పిల్లికి ఆహారం పెట్టలేదు, నీరు ఇవ్వలేదు, ఇంకా భూమిపై సంచరించే ఎలుకలను కనీసం తినటానికైనా దానిని బయటికి వదిలి పెట్టలేదు." *Sahih AlBukhari,* vol. 4, p. 456. no. 689. and *Sahih Muslim,* vol. 4, p. 1215.no. 5573.

జంతువులకు కష్టం కలిగించవలసిన కొన్ని ప్రత్యేక సందర్భాలు అప్పుడప్పుడు ఎదురగును. ఉదాహరణకు వాటిని అవతలికి పోయేటట్లు తోలేటప్పుడు లేదా కొట్టేటప్పుడు వాటికి కలిగే కష్టం, గుర్తు పట్టడానికి వీలుగా వేసే చిహ్నాలు ముద్రించేటప్పుడు కలిగే కష్టం మొదలైనవి. కాని, ఇటువంటి పరిస్థితులలో కూడా, అల్లాహ్ వాటిని కాపాడమని, వాటి క్షేమం గురించి జాగ్రత్త వహించమని ఆజ్ఞాపించినాడు. జాబిర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా ఉపదేశించారు "జంతువుల ముఖాలపై కొట్టడం మరియు వాటి ముఖాలపై గుర్తులు ముద్రించటం నిషేధించబడినది."*Sahih Muslim,* vol. 3, p. 1163, no. 5281.

# వృక్షసంపద

జంతువుల అవసరాలు తీర్చటంతోనే మానవజాతి యొక్క ప్రాపంచిక బాధ్యతలు తీరిపోవటం లేదు. వృక్షజీవనానిక కూడా దివ్యాదేశాలలో ఉత్తమ స్థానం ఇవ్వబడినది. ఎంత ఎక్కువగా అంటే, యుద్ధరంగంలోని ముస్లిం సైనికులు పళ్ళుఫలాలు ఇచ్చే చెట్లను, తోటలను నాశనం చేయకూడదని నిషేధించబడినది. *Muwatta ImamMalik,* p. 200, no. 958, and *Invaa' alGhaleel,* vol. 5, p. 13-4, no. 1190.

ఇంకా, మొక్కలను నాటడం కూడా దానధర్మాలలోని ఒక భాగంగా గుర్తించబడినది. జాబిర్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించారు. "మొక్కలను నాటిన ప్రతి ముస్లింకు దానధర్మాలు చేస్తే లభించే పుణ్యాలు ప్రసాదించబడును. వాటి నుండి ఇతరులు తినేదానికి, దొంగిలించిన దానికీ, జంతువులు తినేదానికి మరియు పక్షులు తినేదానికి- వీటన్నింటికీ పుణ్యాలు లభించును. ఎవరైనా దాని నుండి ఏదైనా తీసుకుంటే, ఆ మొక్కను నాటిన వానికి దానధర్మం చేసినంతటి పుణ్యాలు లభించును" *Sahih Muslim,* vol. 3, p. 818, no. 3764.

మొక్కలను నాటడంలో ఏ ప్రయత్నమూ వదల వద్దని ఇస్లాం ధర్మం ప్రోత్సహిస్తున్నది. అది ఒక విశ్వాసి తన జీవితపు చివరి ఘడియలలో చేయగలిగిన చిట్టచివరి ఆరచణ అయినా సరే. అనస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధిస్తున్నారు - "ప్రళయదినపు సూచనలు బయట పడినప్పుడు, ఒకవేళ మీలో ఎవరి చేతిలోనైనా లేత మొక్క ఉన్నట్లయితే, ప్రళయం ఆరంభమయ్యే లోపుగానే, అతడు దానిని తప్పనిసరిగా నాటటానికి ప్రయత్నించ వలెను." *AlMusnad, vol 3, pp 183, 184 &191, alBukhaaree in alAdab alMufrad* no. 479, and *Silsilah alAhaadeeth asSaheehah,* vol. 1, p. 11, no. 9.

అంటే, తాము పుట్టించబడిన పరిసర ప్రాంతాలలోని అన్నిరకాల సృష్టితాల బాగోగులను శ్రద్ధగా చూసే గురుతర బాధ్యత మానవుల పై ఉన్నది. ఇది సృష్టికర్త మానవులకు ఆదేశించిన ఒక పవిత్రమైన కర్తవ్యంగా మారినది. క్రియాశీలక వ్యతిరేకం ఈనాటి భౌతిక ద్రవ్య ప్రాధాన్యతలతో కూడిన వినియోగదారుల సమాజం ప్రపంచ వ్యాప్తంగా ప్రబలింప జేస్తున్న గంభీర వాతావరణ కాలుష్యాన్ని మరియు సహజమైన జీవచరాల వినాశనాన్ని చైతన్యవంతంగా వ్యతిరేకించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దీనిని నిర్లక్ష్యం చేయటమనేది అంతిమ దివ్యసందేశమైన ఖుర్ఆన్ బోధనల ప్రకారం ఒక ఘోరమైన పాపంగా పరిగణింపబడును. ఇంకా, ఈ బాధ్యతను పూర్తిచేయటానికి ప్రయత్నించటం ఒక ఆరాధనగా లెక్కించబడును.

# ముగింపు

మానవజాతి సృష్టి యొక్క ఉద్దేశ్యం తెలుసుకోని మానవులు చుక్కాని లేని నావ లాగా, గమ్యం లేని జీవితాన్ని గడుపుతారు. అసత్యపు ధర్మోపదేశాలను అనుసరిస్తూ ఉండటం వలన వారి జీవిత లక్ష్యాలు సరైనవి కావు. లేదా అవి భౌతికమైనవి మరియు ఈ ప్రపంచానికే పరిమితమైనవి కావచ్చు. కాబట్టి, వారి సంక్షేమం కోసమైనా సరే తమను సృష్టికర్త ఎందుకు సృష్టించాడో తెలుసుకోవటం అత్యవసరం.

మౌలికంగా, అల్లాహ్ తన దివ్యలక్షణాలను మరియు సుగుణాలను ప్రదర్శించటానికే ఈ విశ్వాన్నంతటినీ సృష్టించాడు. కాబట్టి, సృష్టి ఉనికి ఆయన యొక్క సృష్టికర్త అనే దివ్యలక్షణాన్ని సూచిస్తున్నది. అలాగే స్వర్గం ఆయన దయాదాక్షిణ్యాలను, కరుణా కృపలను సూచిస్తున్నాయి. నరకం అత్యుత్తమమైన ఆయన న్యాయాన్ని, మానవుల తప్పులు, పాపాలు ఆయన యొక్క క్షమాగుణాన్ని సూచిస్తున్నాయి. ఇంకా సజీవమైన మరియు నిర్జీవమైన సృష్టితాలు ఆయన యొక్క ఔదార్యాన్ని సూచిస్తున్నాయి. సృష్టి అనేది సృష్టికర్త యొక్క దివ్యలక్షణాల ప్రదర్శనా వేదిక అనే విషయాన్ని గ్రహించటంలోని ప్రత్యేకత వలన మానవులు సృష్టికర్తను సరిగ్గా గుర్తించి, ఆయన యొక్క దివ్యసందేశాన్ని మరియు తమ యొక్క పూర్వనిర్దిష్టాలను, అంత్యాన్ని మనస్ఫూర్తిగా స్వీకరిస్తారు. కాని, మానవులు తాము ఎందుకు సృష్టింపబడినామో తెలుసుకోవటం మరింత ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉన్నది. అంతిమ సందేశ బోధనల ప్రకారం అది ఏకైక దైవారాధన మాత్రమే. ఎందుకంటే, స్వర్గంలో ప్రవేశింపజేసే ఋజుప్రవర్తన, ధర్మశీలం, న్యాయనిష్ఠలు, మంచి నడవడిక మరియు ఉన్నత అధ్యాత్మిక స్థితి పొందటానికి మానవజాతి ఆయనను తప్పక ఆరాధించవలసి ఉన్నది. ఆహార పానీయాలు మనకు ఎంత అవసరమో,

ఏకైక దైవారాధన కూడా అంతే ఆవశ్యకమైనదని ఈ ధర్మజ్ఞానం యొక్క ప్రాధాన్యత కారణంగా మానవులు గ్రహించగలరు. అంతే కాని, ఆరాధించటం ద్వారా సృష్టికర్తకు ఏదో ఉపకారం చేస్తున్నట్లు కాదు.

ఈ ప్రాపంచిక శుభాల మరియు పరీక్షల ప్రాధాన్యతలను గ్రహించటం మానవులకు ఎంతో అవసరం. తమ సృష్టి వెనుక గల ఉద్దేశ్యం తమకు తెలియక పోయినట్లయితే, మానవజాతి ఈ ప్రపంచం వైపునకు, ప్రతిపక్షంలోని ఒక శత్రువు వలే చూస్తారు. కాని, సృష్టికర్త ఈ ప్రపంచాన్ని వారి లాభం కోసం సృష్టించాడు. మానవులలోని ఉత్తమ అధ్యాత్మిక లక్షణాలను వెలికి తీయటానికే మంచి చెడుల, కష్టసుఖాల పరీక్షలు తయారు చేయబడినాయి. కాని, మానవులు తమ పూర్తి విశ్వాసాన్ని సృష్టికర్త పై ఉంచి, ముందుగానే వ్రాయబడిన జీవన పరిస్థితులను సహనంతో గడపకపోతే, ఈ పరీక్షల ద్వారా లాభం పొందలేరు. ఎవరైతే సృష్టికర్తను తిరస్కరిస్తారో, వారికి ఈ ప్రపంచ పరీక్షలు కఠిన శిక్షలుగా మారతాయి. ఇంకా, పరలోకంలో అవి శాశ్వతమైన శిక్షలుగా మారతాయి.

ప్రపంచ ఉనికి యొక్క ఉద్దేశ్యపు జ్ఞానం, విశ్వాసులలో పరిసరాల జ్ఞానాన్ని పెంచుతుంది. మానవజాతి పై ఈ ప్రాపంచిక సంపదలను న్యాయంగా వినియోగించవలసిన బాధ్యత ఉన్నది. భూమి మీద మరియు సముద్రాల లోపల ఉన్న జీవచరాలు, వృక్షసంపదలు మరియు వాతావరణం అతడి సంరక్షణలో ఉంచబడినది. కాబట్టి, మానవుడు పరిసరాలను మరియు దానిలోని జీవచరాలను కాపాడటంలో చాలా జాగ్రత్త వహించవలెను. బాధ్యతాయుతమైన ఈ ఆచరణయే సృష్టికర్తకు చేసే కృతజ్ఞతా పూర్వకమైన ఆరాధనగా పరిగణింపబడును.

సృష్టి యొక్క ఉద్దేశ్యం గురించిన అటువంటి పూర్తి జ్ఞానంతో మానవుడు పరిపూర్ణంగా మారతాడు. ఆ జ్ఞానమే మానవాళికి మార్గదర్శకత్వంగా మారి, సరైన మరియు స్వచ్ఛమైన సత్యమార్గాన్ని

చూపును. కాబట్టి, అల్లాహ్ అటువంటి మార్గదర్శకత్వం పొందిన వారిని, మానవజాతిలో ఉత్తమమైన వారుగా తన అంతిమ దివ్యసందేశం (ఖుర్ఆన్) లో ఇలా పేర్కొనెను:

"మీరే (విశ్వాసులే) మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు ధర్మాన్ని ఆదేశించే (బోధించే) వారు మరియు అధర్మాన్ని నిషేధించే (నిరోధించే) వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు." [3:110]

# Bibliography

**Al- Albanee, Naasirud-Deen, Irwaa' al-Ghaleel,**
Beirut: al-Maktab al-Islamee, 1st ed., 1979.

**------------------, Saheeh Sunan Abee Daawood,**
Beirut: al-Maktab al-Islamee, 1st ed., 1988. Dawood

**--------------, Saheeh Sunan at-Tirmithee,**
Riyadh: Arab Bureau of Education for the Gulf States, 1st ed., 1988.

**----------------, Sahee Sunan Ibn Maajah,**
Beirut: al-Maktab al-Islamee, 3rd ed., 1988.

**------------------, Silsilah al-Ahaadeeth as-Saheehah, vol.1,** Beirut: al-Maktab al-Islamee, 4th ed., 1985.

**------------------, Silsilah al-Ahaadeeth as-Saheehah, vol.4,**
Riyadh: Maktaba al-Maarif, 4th ed., 1988.

**Chambers pocket Dictionary,**
Edinburgh: W & R Chambers, 1992.

**Hasan, Ahmad, Sunan Abu Dawud [English],**
Lahore: Sh. Muhammad Ashraf Publishers, Isted., 1984.

**Khan, Muhammad Muhsin, Sahih Al Bukhari, [Arabic-English],**
Riyadh: Maktabah ar-Riyaad al-Hadeethah, 1981.

**Rahimuddin, Muhammad, Muwatta Imam Malik [English],**
Lahore: Sh. Muhammad Ashraf, 1980.

**Reese, W.L., Dictionary of Philosophy and Religion,**
New Jersey: Humanities Press 1980.

**Robson, James, Mishkat Al-Masabih,**
Lahore: Sh. Muhammad Ashraf, 1981.

**Sidddiq, Abdul Hamid, Shahih Muslim [English],**
Lahore: Sh. Muhammad Ashraf Publishers, 1987.

**The Living Webster Encyclopedic Dictionary,**
Chicago: The Enlgish Language Institute of America, 1975.

**The New Encyclopaedia Britanica,**
Chicago: Encyclopedia Britanica, 15th ed., 1991.

**The World Book Encyclopedia,**
Chicago: World Book, 1987.

---------------- 0 ----------------

# త్వరపడండి

## గొప్ప అవకాశం

వేల రూపాయలు
మీకోసం ఎదురుచూస్తున్నాయి.
తెలుగు ప్రజలకు ప్రత్యేక అవకాశం

క్విజ్ లో పాల్గొనండి,
సమాధానములు పంపండి,
వేలకువేల రూపాయలు గెలవండి.

ప్రపంచంలోని ఏ మారుమూల నుండైనా,
ఏ మతం వారైనా, ఏ ధర్మం వారైనా,
ఏ కులం వారైనా, ఏ దేశం వారైనా,
ఆడమగ అందరూ ఈ పోటీలో
పాల్గొనవచ్చును.